

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

6-8-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 186 పేజీలు: 10+4 వెల: 6.50



చేనేతకు వస్త్రాలపై జిఎస్టీని భరిస్తాం: సిఎం 2లో

ఆధిపత్యం కోసమే అమెరికా సుంకాలు 5లో


## 24 గంటల్లో భారత్‌పై మరిన్ని సుంకాలు

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

### రష్యా చమురు కొనుగోలుతో భారత్‌పై అమెరికా ఆగ్రహం



**వాషింగ్టన్, ఆగస్టు 5:** భారత్‌పై రానున్న 24 గంటల్లోను అదనపు సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీచేసారు. అమెరికాకు వచ్చే భారత్ దిగుమతులపైనే ఈసారి సుంకాలు రెట్టింపుచేస్తామంటూ హెచ్చరించారు. రష్యానుంచి చమురుకొనుగోళ్లను నిలిపివేయలేదని, దీనివల్ల ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ఇప్పటికీ కొనసాగిస్తున్నదంటూ మండిపడ్డారు. అమెరికాకు భారత్ ఎంతమాత్రం మంచి వాణిజ్య భాగస్వామి కాదని, భారత్ మాదేశంతో ఎంతో వ్యాపారంచేసి లాభపడిందని, అయితే అమెరికా భారత్‌తో బిజినెస్ మాత్రం తక్కువగానే ఉందని ఆయన గుర్తుచేసారు. అందువల్లనే తాము 25శాతం సుంకాల విధింపునకు సిద్ధం అయ్యామని అయితే రానున్న 24 గంటల్లో ఈసుంకాలను మరింతగా అంటే గణనీయంగాపెంచాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఇప్పటికీ భారత్ రష్యా చమురును కొనుగోలుచేయడం మానుకోలేదని ఒక ఆంగ్ల టెలివిజన్ ఇంటర్వ్యూలో ప్రకటించారు. ఆగ్నేయాసియా దేశం రష్యానుంచి తక్కువధరలకు ముడిచమురు కొనుగోలుచేసి అధిక లాభాలకు ఇతర దేశాలకు విక్రయిస్తోందని ఆయన ఆరోపించారు. ముడిచమురు విక్రయించి భారత్ అధికలాభాలు గడిస్తోందన్నారు. ఇందుకు ప్రతిగా భారత్‌సైతం ధీటుగా స్పందించింది. అమెరికా,యూరోపియన్ దేశాలు భారత్ రిఫైనరీలనుంచి ఎగుమతులపట్ల విముఖత వ్యక్తంచేయడం కొనసాగుతూనే ఉందన్నారు. ప్రపంచ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా భారత్ ముడిచమురు దిగుమతులు చేసుకుంటుందన్నారు. మమ్మల్ని విమర్శి >>2

# దేశానికే ఆదర్శం పి-4

### పేదరిక నిర్మూలనే ప్రభుత్వం అంతిమ లక్ష్యం

### స్వచ్ఛందంగా వచ్చినవారే మార్గదర్శకులు

### అవనిగడ్డ పారిశుద్ధ్య కార్మికురాలు హేమలతను ప్రశంసించిన సిఎం

### చిన్న ఆసరా.. పెద్ద అండ: ముఖ్యమంత్రి



మంగళవారం సచివాలయంలో పి4పై సమీక్ష జరుపుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరిక నిర్మూలనకు చేపడుతున్న జీరోపావర్టీ పి4 ఆశయం 2029 నాటికి సాకారం అవుతుందని, ఇదే మొదటి అడుగు అవుతుందని సిఎం చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన పి4 కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. మంగళవారం సచివాలయంలో పి4పై ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 19వ తేదీ నుంచి పి4 అమలు చేయాలని ఈ సమీక్షలో నిర్ణయించారు. సచివాలయంలో నిర్వహించిన ఈ సమీక్షకు సిఎస్ విజయానంద్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పి4 ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కుటుంబరావు, ఆర్థిక, ప్రణాళిక శాఖ అధికారులు హాజరయ్యారు. సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పేదరిక నిర్మూలనలో భాగంగానే పి4 కార్యక్రమాన్ని చేపట్టాం. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యం. సమాజానికి తిరిగి ఇవ్వాలన్నదే ప్రధాన ఉద్దేశం. మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదలకు కొండంత అండఅవుతుంది. ఆ స్ఫూర్తితోనే అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు పల్లెకుంట హేమలత మార్గదర్శిగా మారి ఓవృద్ధురాలిని ఆదుకుంటున్నారు. స్పందించే మనస్సు ఉంటే... పేదల్ని ఆదుకునేందుకు మానవత్వం చూపుతూ ముందుకు వస్తారు. డబ్బుతో పాటు.. సాయం చేసే వారు కూడా మార్గదర్శులే. బంగారు కుటంబాలకు కావాల్సింది ఎమోషనల్ బాండింగ్, చేయూత మాత్రమే.

సిఎస్సార్ నిధులతో బిల్ గేట్స్, వేదాంత లాంటి సంస్థలు పనిచేస్తున్నాయి. వీటికి మించి కుటుంబాలను ఆదుకోవటమే లక్ష్యంగా పి4 కార్యక్రమం చేపట్టాం. ప్రజలేఆస్తిగా జీరోపావర్టీ మిషన్ అమలు చేస్తున్నాం"అని సిఎం స్పష్టంచేశారు. మనం చేసే ప్రతిఆలోచన స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. ఒకరికి ఒకరు తోడుగా ఉన్న >>2



మంగళవారం అమరావతిలో పర్యటిస్తున్న మంత్రి నారాయణ

## అమరావతిలో వచ్చే మార్చికి ఉద్యోగులకు 4 వేల ఇళ్లు

### కాలువలు, రిజర్వాయర్ల పనులు వచ్చే అక్టోబర్‌కు పూర్తి: మంత్రి నారాయణ

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఎవరెన్ని కుట్రలు చేసినా అమరావతిని మూడేళ్లలో ఖచ్చితంగా పూర్తిచేసి తీరుతామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేసారు. అసలు అమరావతిలో పనులే జరగడం లేదని ఆరోపణలు చేస్తున్న వారు క్షేత్రస్థాయికి వచ్చి చూడాలని సూచించారు. రాజధాని నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు మంత్రి నారాయణ. శాఖమూరు రిజర్వాయర్,కొండవీటి వాగు,గ్రావిటీ కెనాల్‌తో పాటు అనంతవరం పార్కును మంత్రి నారాయణ పరిశీలించారు..ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు మంత్రి.

అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి 2014-19 మధ్యలోనే టెండర్లు పూర్తిచేసి పనులు కూడా ప్రారంభించాం. గత ప్రభుత్వం మూడుముక్కలాటతో మొత్తం నాశనం చేసింది. అసలు రాజధాని ఎక్కడో క్లారిటీ ఇవ్వలేదు. రైతులను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టింది.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఉన్న టెండర్లు క్లోజ్ చేయడంతో పాటు ఇతర ఆర్థిక అంశాలను కొలిక్కి తీసుకొచ్చి పాత నిర్మాణాలపై ఐఐటీ నిపుణులతో అధ్యయనం చేసి ముందుకెళ్తున్నామన్నారు మంత్రి. ప్రస్తుతం రాజధానిలో అన్ని పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు అధికారులు,ఉద్యోగులకు సంబంధించి 4 వేల ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తామని తెలిపారు. ఇదే సమయంలో రోడ్లు,డ్రైనేజి పనులు కూడా దాదాపు పూర్తికావచ్చినట్లు చెప్పారాయన. అయితే లేఅవుట్ రోడ్ల డిజైన్లు మాత్రం ఈనెలాఖరుకు ఐఐటీ నిపుణులు ఫైనల్ చేస్తారని అన్నారు.

ఇక రాజధానిలో వరద ముంపు నివారణ కొరకు కాలువల డిజైన్లు నెదర్లాండ్స్ అధికారులతో చేయించామన్నారు మంత్రి..రాజధానిలో కొండవీటి వాగు 23.6 కిమీ,పాలవాగు 16.5 కిమీ,గ్రావిటీ కెనాల్ ను 7.843 కిమీలు మొత్తంగా 47.94 కిమీ మేర కాలువలను వెడల్పు చేసి లోతుగా తవ్వుతున్నామన్నారు. వీటితో పాటు శాఖమూరు రిజర్వాయర్ ను 0.03 టిఎంసిల కెపాసిటీతో 50 ఎకరాల్లో కృష్ణాయపాలెం రిజర్వాయర్‌ను 0.1 టిఎంసితో 190 ఎకరాల్లో అలాగే నీరుకొండ రిజర్వాయర్‌ను 0.4 టిఎంసిల కెపాసిటీతో 440 ఎకరాల్లో నిర్మిస్తున్నట్లు మంత్రి చెప్పారు...వర్షాల కారణంగా కాలువల పనులు కొంచెం నెమ్మదిగా సాగుతున్నాయని అన్నారు...2027 అక్టోబర్ లోగా ఆయా పనులు పూర్తిచేయాలని టార్గెట్ పెట్టుకున్నప్పటికీ వచ్చే ఏడాది చివరకు పూర్తిచేసేలా వేగంగా పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతిలో పనులు జరగడంలేదని కొంతమంది ఆరోపణలు చేస్తు >>2



## ఆపరేషన్ 'కుంకీ' విజయవంతం

### అటవీ ఏనుగులను కుంకీలు దారి మళ్లించాయి

### - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆపరేషన్ కుంకీ మొదలయ్యిందని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. కుంకీ ఏనుగులు ద్వారా చేపట్టిన తొలి ఆపరేషన్ విజయవంతంగా పూర్తయినట్లు కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ విజయవంతమైనట్లు పునరుద్ఘాటించారు. పంటల్ని ధ్వంసంచేస్తున్న ఏనుగులను కుంకీలు దారిమళ్లించాయని తెలిపారు. తొలి ఆపరేషన్‌ను విజయవంతం చేసిన అటవీశాఖ అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయం మరో ప్రకటన విడుదల చేసింది. ఆపరేషన్ కుంకీ మొదలయ్యింది. కుంకీ ఏనుగుల ద్వారా >>2

## హరిత ఇంధన రాష్ట్రంగా ఏపి

### గ్రీన్‌వర్క్ ఫోర్స్‌కు కేంద్ర బిందువుగా మారుతోంది..

### నేడు విజయవాడలో భారీ సదస్సు

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రీన్ వర్క్ ఫోర్స్ విప్లవానికి కేంద్ర బిందువుగా మారేందుకు రాష్ట్రం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు రేపు విజయవాడ నోవాటెల్ హోటల్ లో దేశంలోనే అతిపెద్ద రెన్యువబుల్ ఎనర్జీ స్కిల్లింగ్ డ్రైవ్‌ను చేపడుతోంది. దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్‌ను శక్తివంతం చేయడంతో పాటు సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్ గా ఏపి అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో ఈ డ్రైవ్‌ను నిర్వహించడం జరుగుతోంది. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో 250కి పైగా పరిశ్రమల ప్రతినిధులు, ముఖ్యమైన అభివృద్ధి భాగస్వాములు హాజరుకానున్నారు.



భారతదేశం 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్య లక్ష్యాన్ని సాధించేందుకు వేగంగా అడుగులు వేస్తుండగా.. ఆంధ్రప్రదేశ్ ఈ గ్రీన్ వర్క్ ఫోర్స్ విప్లవానికి కేంద్రబిందువుగా మారనుంది. భారతదేశంలోనే అతిపెద్ద గ్రీన్ >>2

## 25 నుంచి 'స్మార్ట్' రేషన్ కార్డులు

### - మంత్రి నాదెండ్ల



**విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్టు 5, ప్రభాత వార్త :** ఈనెల 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు అందచేస్తామని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విశాఖపట్నం కలెక్టరేట్ మీటింగు హాలులో జరుగుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు అవిరళ కృషి చేస్తున్నామని అన్నారు. నెలలో 15 రోజుల పాటు రేషన్ సరుకులు అందజేస్తున్నామని, 65 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులకు, వికలాంగులకు (ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు) ఇంటివద్దకే సరకులు అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగ్గా రేషన్ సరకులు అందజేసేందుకే ఎండియు. వాహనాల విషయంలో సుమారు రూ.200 కోట్ల భారం పడినా ముందుకు వెళ్లామని, దీపం పథకం ద్వారా ఫేజ్ 1 కోటి మందికి, ఫేజ్ 2లో 95లక్షల మందికి సబ్సిడీ అందించాం...ఫేజ్ 3లో సాంకేతిక సమ >>2

## వివేకా హత్యపై విచారణ పూర్తి

### సుప్రీంకోర్టుకు వెల్లడించిన సిబిఐ

### ఎంపి అవినాష్ రెడ్డి సహా ఇతర నిందితుల బెయిలు రద్దుపై విచారణ వాయిదా



**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించిన విచారణ పూర్తయ్యిందని సిబిఐ మంగళవారం నాడు సుప్రీం కోర్టుకు వెల్లడించింది. ఒకవేళ సుప్రీం కోర్టు ఆదేశిస్తే తదుపరి విచారణను కొనసాగిస్తామని సిబిఐ తరపు న్యాయవాది సుప్రీం ధర్మాసనానికి తెలిపారు. మరోవైపు ఇదే కేసుకు సంబంధించి కడప ఎంపి అవినాష్ రెడ్డిసహా ఇతరనిందితుల బెయిల్‌ను రద్దు చేసేందుకు సంబం ధించి వివేకా తనయ సునీతతో పాటు సిబిఐ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ వాయిదా పడింది.

దివంగత సిఎం వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరుడు మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్యపై సిబిఐ విచారణ ముగిసింది. గత నెల 21వ తేదీన సుప్రీం కోర్టు సిబిఐని మూడు అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించడం తెలిసిందే. దీని తరువాతే కడప ఎంపి అవినాష్ రెడ్డి సహా ఇతర నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లపై వి చారణ చేబడతామని పేర్కొనడం విదితమే. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం మేరకు దర్యాప్తుకు సంబంధిం చిన స్టేటస్ వివరాలను మంగళవారం నాడు సిబిఐ సుప్రీం కోర్టుకు తెలిపింది. వివేకా హత్య కేసులో ఇంకా తదుపరి దర్యాప్తు అవసరమని సిబిఐ భావిస్తుందో? లేదో? సుప్రీం ధర్మాసనం కోరింది. దీంతో పాటు ఎపి ప్రభుత్వం కడప సెషన్స్ కోర్టులో వై.ఎస్ వివేకా తనయ సునీత, ఆమె భర్త >>2



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

## కంటైనర్‌ను ఢీకొన్న కారు

### ముగ్గురు దుర్మరణం

### తవణంపల్లె మండలంలో దుర్ఘటన

**తవణంపల్లె, ఆగస్టు 5 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలోని బెంగుళూరు-తిరుపతి సిక్స్‌లేన్ రోడ్డు తెల్లగుండ్లపల్లె వద్ద రోడ్డు ఆగివున్న కంటైనర్‌ను కారు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానిక ఎస్ఐ చిరంజీవి కథనం మేరకు వివరా >>2

## నేడు మంత్రిమండలి సమావేశం

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం కేబినెట్ సమావేశం జరగనుంది. సచివాలయంలో జరిగే ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నట్టుతెలుస్తోంది. ఈ సమావేశంలో మహిళల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై చర్చించబోతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి అధికారికంగా ప్రభుత్వం రేపు ప్రకటన చేయనుంది. అలాగే పలు సంస్థలకు భూ కేటాయింపులపై కూడా చర్చించనున్నారు. ఇటీవల సిఎం సింగపూర్లో పర్యటించారు. ఈ పర్యటనపైనా చర్చ జరగనుంది.



## 'ఉత్తరా'న జల విలయం! బురద వరదలో కరిగిన 'ధరాలి'

### కొట్టుకుపోయిన ఇళ్లు, హోటళ్లు

### 60 మందికి పైగా మృతి

### ఉత్తరాఖండ్‌లో మరో నాలుగు రోజులు భారీ వర్షాలు

**డెహ్రాడూన్, ఆగస్టు 5:** ఉత్తరాఖండ్‌లోని ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా ఉండే ధరాలి గ్రామం ఆకస్మిక వరదలు, కుంభవృష్టికి కొట్టుకునిపోయింది. సముద్రం మీదపడిందా, అలలు ఒక్కసారిగా చుట్టుముట్టి గ్రామాన్ని తీసుకుపోయాయా అన్నట్లు వరద ఉధృతికి ధరాలి కనుమరుగయిపోయింది. భారీ ఎత్తున ఎగిసిపడిన బురద వరద ధరాలి గ్రామాన్ని కప్పేసింది. ఇపుడు ఆగ్రామం మరుభూమిలా మారిపోయింది. చార్‌ధామ్ యాత్రీకులు ఎక్కువగా ఈగ్రామానికి వస్తుంటారు. యాపిల్స్ ఎక్కువ ఉండే రాష్ట్రంలోని హర్సిల్ లోయ ఈ గ్రామానికి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ధరాలి >>2



ప్రధాని మోడీ, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ సమక్షంలో పలు ఒప్పందాలపై సంతకాలు జరిగిన దృశ్యం

# భావనపాడు తీరంలో ముగ్గురు యువకులు గల్లంతు

## గజ ఈతగాళ్లతో గాలిస్తున్న పోలీసులు

**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 5 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరం స్నానానికి దిగిన ముగ్గురు యువకులు మంగళవారం గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు వజ్రపు కొత్తూరు మండలం పూడి జగన్నాధపురం గ్రామానికి చెందిన తుమ్మల జస్వంత్ (18), మడి వానిపేట గ్రామనికి చెందిన దున్న దుర్యోధన (18)గా గుర్తించారు. మూడో యువకుడు టెక్కలి పట్నం రాయల రాజేష్‌గా గుర్తించారు. ఈ ముగ్గురు యువకులు విజయనగరంలోని ఒక కళాశాలలో డిప్లొమా చదువుతున్నారు. సెలవులకు ఇంటికి వచ్చిన యువకులు భావనపాడు తీరం వచ్చి హార్బరు గట్టు వద్ద సముద్ర స్నానానికి దిగి గల్లంతు అయినట్లు తెలిసింది. ఈ విషయం తెలిసిన వెంటనే నౌపడ ఎస్ ఐ నారాయణ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు గజ ఈత గాళ్ళను పెట్టి గాలింపు చర్యలు చేపట్టారు.




బీహార్‌లో ప్రత్యేక ఓటర్ల సవరణకు నిరసనగా మంగళవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, ప్రియాంక నాయకత్వంలో భారీ ఆదోళన జరిగిన దృశ్యం

# దేశానికే ఆదర్శం పి-4

>> ప్పుడు అనేక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మార్గదర్శులు బంగారు కుటుంబాలకు వేసే బాట పేదరికాన్ని నిర్మూలించడమే కాకుండా శక్తివంతమై యువతను సృష్టిస్తుందన్నారు.

**మార్గదర్శుల ఎంపిక స్వచ్ఛందమే**

బంగారు కుటుంబాలను ఆదుకోవటంలో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా వాలంటరీగానే జరుగుతోంది. ఎక్కడా ఎవరిపైనా బలవంతం లేదు. మార్గదర్శుల ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదు. ఎవరినీ బలవంతం చేయొద్దు. మానవత్వం ఉండే వారే ఇందులో చేరతారు. మంచి కార్యక్రమాలను అడ్డుకునేందుకు కొందరు రాక్షసుల తరహాలో వ్యవహరిస్తారు. ప్రజల మనస్సుల్లో దీనిపై వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నిస్తారు. గతంలో జన్మభూమి, శ్రమదానం, నీరుమీరు ఇలా ఏ కార్యక్రమం చేపట్టినా ఇదే విధంగా విమర్శించారు. నేను ఇలాంటివి పట్టించుకోను. కొందరికి ఆర్థిక వనరులు ఉన్నా పేదల్ని ఆదుకోవడానికి మనస్సు రాదు. కొందరికి మనస్సు ఉన్నా సమయం ఉండకపోవచ్చు. ఇలాంటి వారిని గుర్తించండి. పి4 వేదిక ఉందని చెప్పండి. ఆర్థిక అసమానతలు మరింతగా తగ్గాలి. ఇవి పెరిగితే సమాజానికి మంచిది కాదు. ఇవాళ బంగారు కుటుంబంలో సాయం పొందిన వారే రేపు మార్గదర్శి కావచ్చు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అందుకుంటూనే బంగారు కుటుంబాలకు అదనపు సాయం పి4 ద్వారా అందుతుంది. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలను కలిసి వారిలో ఆలోచనను రేకెత్తించండి" అని సిఎం సూచించారు.

**ఉద్యమస్ఫూర్తిగా పి4**

ఇప్పటి వరకూ 9,37,913 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తి అయింది. 1,03,938 మంది మార్గదర్శులను గుర్తించాం. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల బంగారు కుటుంబాలకున్న అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాం. 11 ప్రశ్నలతో వివరాలు నమోదుచేసి ఎఐతో విశ్లేషించాం. 31 శాతం మంది ఉద్యోగ అవకాశాలు కల్పిచాలని, 22 శాతం మంది వైద్య చికిత్సలకు సంబంధించి, 9 శాతంమంది తమ చిన్నచిన్న వ్యాపారాలను మరింత పెంచుకోడానికి అవకాశాలు కల్పించాలి. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవటంతో పాటు గ్రామాలు, మండలాల వారీగా దత్తత తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు. అలాగే ఫండ్ ఎ నీడ్ అనే అంశాన్ని కూడా పి4 కార్యక్రమంలో పెట్టాం. ఈ కార్యక్రమం అమలును ప్రతీ మూడు నెలలకు ఓమారు సమీక్షించుకుంటాం. ప్రజాప్రతినిధులు, అధికారులుకూడా ఈకార్యక్రమంలో వాలంటరీగా పాల్గొనవచ్చు. ప్రస్తుతం నేనుకూడా మార్గదర్శిగా పేరు నమోదుచేయించుకుని 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. ఆకుటుంబాల సంక్షేమం కోసం ప్రణాళికా బద్ధంగా వెళ్తాం. ఎన్టీఆర్ ట్రస్ట్‌ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ఉత్తరాఖండ్ వరదల సమయంలో ప్రతిపక్షంలో ఉన్నా తెలుగుప్రజల్ని ఆదుకునేందుకు ముందుకువచ్చాం. బాధితుల్ని తీసుకు వచ్చేందుకు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేశాం. వారిని ఇళ్లకు చేర్చేందుకు బస్సులు ఏర్పాటు చేశాం. మార్గదర్శుల్లో స్ఫూర్తే బంగారు కుటుంబాలకు ఆసరా" అని ముఖ్యమంత్రి అన్నారు.

# 42 ఎపిపి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

**విజయవాడ,ఆగస్టు5, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి) పోస్టుల భర్తీకి పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 11 నుంచి సెప్టెంబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఎస్ఎల్‌పిఆర్‌బి.ఎపి.జిఓవి.ఇన్(ఆంగ్లంలో అన్ని చిన్న అక్షరాలతో) వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబరు 5న రాతపరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పేపర్-1 (ఆబ్జెక్టివ్),మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకూ పేపర్-2(డిస్క్రిప్టివ్)పరీక్ష ఉంటుంది. ఈ మేరకు పోలీసు నియామక మండలి చైర్మన్ రాజీవ్‌కుమార్ మీనా ఓ ప్రకటన విడుదలచేశారు. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి పూర్తి వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని తెలిపారు.

# రేషన్ కార్డులు

>> స్యలను అధిగమించి అర్హులందరికీ పథక ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ప్రజల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, దీనిపై ఇప్పటికే ఆయా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసామని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. లబ్ధిదారులకు గ్యాస్ రాయితీ జమ కానీ పక్షంలో అధికారుకు హుటాహుటిన చర్యలు తీసుకోవాలి... కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాలని అన్నారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా పెంచామని, చట్టంలో మార్పులు కూడా తీసుకొచ్చామని అన్నారు. లీగల్ మెట్రాలజీ డిపార్ట్మెంట్ కార్యకలాపాలను పెంచామన్నారు. గత సీజన్లో రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం సేకరించి రూ.12,000 కోట్లు చెల్లించామని చెప్పారు. ఆర్టిఫిసియల్ సహాయంతో పౌర సరఫరాల శాఖలో డేటా అనాలిసిస్ చేస్తున్నామని, సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నామని అన్నారు. ప్రజలకు మరింత ఉత్తమ రీతిలో సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం మనఃస్ఫూర్తిగా భాగస్వామ్యం కావాలని కోరారు.

# ఉద్యోగులకు 4 వేల ఇళ్లు

>> న్నారని.. అమరావతిపై ఎన్ని కుట్రలు పన్నినా మూడేళ్లలో ఖచ్చితంగా పూర్తిచేసి తీరుతామని అన్నారు. బ్లూ గ్రీన్ రాజధానిగా అమరావతి ఉండేలా 30 శాతం పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కృష్ణా రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కూడా త్వరలోనే ప్రారంభిస్తామని.. ట్రంక్ రోడ్ల పనులు ఇప్పటికే ప్రారంభం కాగా లేఅవుట్ రోడ్లకు త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో గతంలో పాతిన సరిహద్దు రాళ్లు తొలగిపోయాయని.. తాజాగా ఆయా లేఅవుట్‌లలో మౌలికవసతులు కల్పించే కాంట్రాక్ట్ ఏజెన్సీలు సరిహద్దు రాళ్లను పాతుతాయని తెలిపారు. రాజధానిలో సుమారు 25 వేల మందికి ఈ ఏడాది కౌలు నిధులు జమ చేయాల్సి ఉండగా...నిన్నటి వరకూ రకరకాల కారణాలతో 7 వేల మందికి జమ కాలేదన్నారు.తాజాగా పెండింగ్ లో ఉన్న నిధులు కూడా అకౌంట్లలో జమ అయ్యాయి...అయితే బ్యాంకు అకౌంట్ తప్పుగా ఉండటం,కొంతమంది మరణించడం,మరికొంతమంది భూమి అమ్ముకోవడం వంటి కారణాలతో 900 మందికి నిధులు జమకాలేదన్నారు..అటువంటి అకౌంట్లను మరోసారి పరిశీలిస్తున్ను మంత్రి నారాయణ తెలిపారు...కౌలు నిధులు జమకాని రైతులు వెబ్ సైట్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# భారత్‌పై మరిన్ని సుంకాలు

>> స్తున్న దేశాలన్నీ కూడా ముడిచమురు కొనుగోలులో రష్యాతో కలిసి కొనసాగుతున్నాయని, ఈపరిస్థితుల్లో అమెరికా మాపై ఆంక్షలు ప్రకటించడమేమిటని విదేశాంగశాఖ ప్రకటించింది. యూరోప్ రష్యా వాణిజ్యం అంటే కేవలం ఇంధనం ఒక్కటే కాదని, ఎరువులు, మైనింగ్ ఉత్పత్తులు, రసాయనాలు, ఇనుము ఉక్కు, భారీ యంత్రపరికరాలు, రవాణా సామగ్రి వంటివికూడా ఉన్నాయని భారత్ గుర్తుచేసింది. దేశ శ్రేయస్సు ను పరిగణలోనికి తీసుకుని అన్ని నిర్ణయాలు తీసుకుంటామన్నారు. యూరోపియన్‌యూనియన్ రష్యాతో గత ఏడాది 78.02బిలియన్ డాలర్ల వాణిజనయంచేసిందని స్పష్టంచేసింది. అలాగే ఎల్ఎన్‌జి అంటే ద్రవరూప గ్యాస్ 16.5 మిలియన్ మెట్రిక్‌టన్నులు దిగుమతిచేసుకున్నదని అన్నారు. గతనెల 31వ తేదీనుంచేభారత్ అమెరికాఅమధ్య అగాధ: పెరుగుతూ వస్తోంది. ట్రంప్ 25శాతం సుంకాలుప్రకటించినప్పటినుంచి ఈ వివాదంపెద్దదవుతూ వస్తోంది. అంతేకాకుండా కొన్ని అస్పష్టమైన, ప్రత్యేక సుంకాలు కూడా అవసరమయితే విధిస్తామని అన్నారు. ఎన్ఎస్ఎ అజిత్‌దోవల్ రష్యాకు ఈ వారంలోనే పర్యటించనున్నారు. అలాగే విదేశాంగమంత్రి ఎస్‌జైశంకర్‌కూడా రష్యాలో పర్యటించేవీలుంది.

# కంటైనర్‌ను ఢీకొన్న కారు

>> లిలావున్నాయి. బెంగుళూరు ఎలక్ట్రానిక్ సిటికి చెందిన శ్రీకాంత్ (35), ఆతని తల్లి లక్ష్మీదేవి( 55), కుమారుడు శ్రియాన్(5) అనే వ్యక్తులు తిరుమల స్వామివారి దర్శనానంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఈనేపథ్యంలో వారు ప్రయాణిస్తున్న కారు తెల్లగుండ్లపల్లె వద్ద ఆగి వున్న కంటైనర్‌ను అతి వేగంగా వెనువైపు నుండి బలంగా ఢీకొంది. దీనితో శ్రీకాంత్, అతని తల్లి లక్ష్మీదేవిలు తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన శ్రియాన్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ఎస్ఐ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే ప్రమాదం వల్ల ట్రాఫిక్ అంతరాయం కలగడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పై చిరంజీవి తెలిపారు. ఇదే ప్రాంతంలో ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరగడంతో పదుల సంఖ్యలో వ్యక్తులు మృత్యువాతపడ్డారు.

# హరిత ఇంధన రాష్ట్రంగా ఎపి

>> స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ క్లీన్ ఎనర్జీ ఆర్థిక వ్యవస్థకు మానవ వనరుల కేంద్రంగా ఎదగనుంది. వేలాది మంది యువతకు సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో నైపుణ్య శిక్షణ పునరుత్పాదక ఇంధన నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువతకు సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో తయారీ నుంచి ఇన్‌స్టలేషన్, ఆపరేషన్స్, నిర్వహణ వరకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఇది కేవలం నైపుణ్య శిక్షణ కార్యక్రమం మాత్రమే మాత్రమే కాకుండా క్లీన్ ఎనర్జీ, వాతావరణ మార్పులకు తగ్గ నైపుణ్యాల అభివృద్ధికి, పరిశ్రమల వృద్ధికి దోహదపడే విధంగా రూపొందించడం జరిగింది. 2030కి 160 గిగావాట్ల సోలార్ మరియు విండ్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకొని కార్యాచరణ రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో మాత్రమే కాకుండా గ్లోబల్ టాలెంట్ ఎగుమతిదారుగా కూడా నిలవనుంది. ఈ సమావేశంలో మూడు హై ఇంపాక్ట్ ప్యానెల్ డిస్కషన్స్ నిర్వహించనున్నారు. సోలార్, విండ్ పరిశ్రమల దిగ్గజాలు.. పాలసీ మేకర్లు, శిక్షణ సంస్థలతో కలిసి డిమాండ్ ఆధారిత, పరిశ్రమల అవసరాలకు తగ్గ వర్క్ ఫోర్స్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ రూపొందించనున్నారు. అదనంగా ప్రైవేట్ సెక్టార్ గ్రీన్ స్కిల్లింగ్ టాస్క్‌ఫోర్స్‌ను కూడా ప్రారంభించనున్నారు.

# బురద వరదలో కరిగిన 'ధరాలి'

>> సమీపంనుంచే భాగీరథి నది కొనసాగుతుంది. రిషికేశ్‌నుంచి బయలుదేరి చంబా, ఉత్తరకాశీ, హర్సిల్‌మీదుగా ధరాలికి వస్తారు. సముద్ర మట్టానికి సుమారు 2780 మీటర్ల ఎత్తున ఉన్న ఈ గ్రామంనుంచి గంగోత్రి ధామ్‌కేవలం 20 కిలోమీటర్లే. ఈగ్రామంలో భారీ సంఖ్యలో గెస్టుహౌస్‌లు, లాడ్జిలు కూడా ఉన్నాయి. సమీపంలోనే నీలాంగ్ లోయకూడా ఉంది. భారత్ టిబెట్ మధ్య వాణిజ్యం కొనసాగే పాతమార్గం ఇక్కడినుంచే పోతుంది. ధరాలి సమీపంలోని హార్సిల్ లోయలో భారీ విస్తీర్ణంలో యాపిల్ తోటలున్నాయి. చార్‌ధామ్ యాత్రీకులు గంగోత్రికి వెళ్లే సమయంలో ఇక్కడే ఉండేందుకు ఇష్టపడతారు. కేదార్‌తాల్‌ప్రదేశానికి ట్రెక్కింగ్‌కు వెళ్లేవారికి ఈప్రాంతం బేస్‌క్యాంప్‌గా ఉంటుంది. ధరాలీకి సమీపంలోని ఖీర్‌గడ్ నదీపరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలకు నీరునిలిచిపోయింది. ఒక్కసారిగా ఈనీరంతా ధరాలిమార్కెట్‌పై విరుచుకుపడింది. దీనితో ఈగ్రామం కనుమరుగయిపోయింది. ప్రధానిమోడీ, హోంమంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి పుష్కరసింగ్ ధామి మొత్తం అందరూ ఈభారీ ఆకస్మిక దుర్ఘటనకు విస్తుపోయారు. ప్రజలను అప్పటికే సురక్షితప్రాంతాలకు తరలించడంతో పెనుముప్పు తప్పింది. అయినా కూడా 60మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. కాగా ఈ మెరుపువరదల్లో 20 నుంచి 25 హోటళ్లు, హోమ్‌స్టేలు కొట్టుకునిపోయాయి. 12మందికిపైగా శిథిలాలకింద చిక్కుకుని చనిపోయి ఉంటారని గ్రామస్తులు చెపుతున్నారు. భయంతో కేకలు వేస్తూ ఎత్తయిన ప్రాంతాలకు పరుగులుతీసారు. ఈనెల 10వ తేదీవరకూ ఉత్తరాఖండ్‌లోని కొండప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి అంచనావేసింది. పర్యాటకులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని వెల్లడించింది.

# చేనేతకు వస్త్రాలపై జిఎస్టీని భరిస్తాం

## మగ్గాలకు 200, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్..

### రూ. 5 కోట్లతో నేతన్నలకు త్రిఫ్ట్ ఫండ్..

### చేనేత శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

### జాతీయ చేనేత దినోత్సవం నుంచి నిర్ణయాల అమలు

**విజయవాడ,, ఆగస్టు 5,ప్రభాతవార్త ప్రతినిధి:** చేనేతకు వస్త్రాలపై జిఎస్టీని భరిస్తామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. చేనేత రంగానికి ఊతమిచ్చేలా,నేతన్నలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. మంగళవారం చేనేత శాఖపై రాష్ట్ర సచివాలయంలో సీఎం సమీక్షించారు. చేనేత కార్మికులను ఏ విధంగా ఆదుకోవాలనే అంశంపై చర్చించారు. వ్యవసాయం తర్వాత చేనేతే అత్యంత కీలకమైన రంగంగా ఉందని.. దీని మీద ఆధారపడిన వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా సిఎం అన్నారు. ఈ మేరకు ఇటీవల జమ్మలమడుగు పర్యటనలో ఓ చేనేత కుటుంబ సభ్యులతో మాట్లాడిన సమయంలో తన దృష్టికి వచ్చిన అంశాలను సమీక్షలో చంద్రబాబు ప్రస్తావించారు. మగ్గాలకు 200 యూనిట్లు.. అలాగే పవర్ లూమ్స్ కు 500 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందివ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు చేపట్టాల్సిన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ విషయంలో ఈ సమీక్షలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. హ్యాండ్లూమ్ వస్త్రాలపై జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరించేందుకు సిద్దమైంది. చేనేత వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే కేంద్రానికి చెల్లించనుంది. చేనేత వస్త్రాలపై జీఎస్టీ విషయంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేలా ఈ సమీక్షలో సీఎం నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల చేనేత రంగం పుంజుకుంటుందని... తక్కువ ధరల్లో చేనేత వస్త్రాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వివరించారు. దీని వల్ల చేనేత వస్త్రాలకు విక్రయాలు పెరిగి నేతన్నలకు లబ్ది చేకూరుతుందని చెప్పారు. చేనేత కార్మికుల కోసం రూ. 5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం నుంచి ఈ నిర్ణయాలను అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో చేనేత శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏపీకి చెందిన చేనేత ఉత్పత్తులకు 10 జాతీయ అవార్డులు వచ్చాయి...వన్ డిస్ట్రిక్..వన్ ప్రొడక్ట్ విభాగంలోనూ మొదటిసారి అవార్డు దక్కించుకుంది. ఈ అవార్డులను సమీక్షకు ముందు సీఎం చంద్రబాబుకు అధికారులు చూపించారు.

# మరో 11 మంది వైద్యులు, నర్సులపై విచారణ

## పర్యవేక్షణా రాహిత్యం, ఆడిట్ రిపోర్టుల పట్ల నిర్లక్ష్యం ప్రధాన ఆరోపణలు..

## మందుల స్టాక్ రిజిస్టర్, రోగులకు భోజన సరఫరాల్లో అవకతవకలు..

## 2020 లో గుడివాడ ఏరియా ఆసుపత్రిలో నిర్వాకాలపై ఎసిబి విచారణ

**విజయవాడ, ఆగస్టు5, ప్రభాతవార్తప్రతినిధి:** బాధ్యతా రాహిత్యం, అవకతవకలకు పాల్పడ్డారన్న అభియోగాలపై మరో 11 మంది వైద్యులు, నర్సులపై తగు క్రమశిక్షణా చర్యలు చేపట్టెందుకు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ విచారణకు ఆదేశించారు. 2020లో గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, నర్సుల నిర్వాకాలపై ఎసిబి (అవినీతి నిరోధక శాఖ) ఇచ్చిన నివేదికను పరిశీలించిన మంత్రి ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. గుడివాడ ప్రభుత్వాఆసుపత్రిలో అక్రమాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎసిబి ఫిబ్రవరి 2020 లో రెండు రోజుల పాటు తనిఖీ నిర్వహించి నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆరుగురు వైద్యులు, పరిపాలనాధికారి (ఏఒ), ఇద్దరు నర్సింగ్ సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

ఎసిబి తనిఖీ చేసిన రెండు రోజుల్లో ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రత, అంతర్గత ఆడిట్ రిపోర్టులపై తీసుకున్న చర్యలు, రోగులకు భోజన సరఫరా మరియు నాణ్యత మందుల సరఫరా మరియు స్టాకు వివరాలు, నియమాల ప్రకారం వైద్య సిబ్బంది పాటించాల్సిన డ్రెస్ కోడ్, పరిశుభ్రతలకు సంబందించి లోతైన పరిశీలన చేసి, వైద్య సిబ్బందిని ప్రశ్నించిన మీదట రూపొందించిన నివేదికలో పలు లోపాలను వెల్లడించింది. వివిధ స్థాయిల్లో పర్యవేక్షణా లోపాన్ని ప్రధానంగా ఎసిబి వివరించి, తత్ఫలితంగా ఎదురైన అవకతవకలను వివరించింది. ప్రభుత్వాసుపత్రుల్లో సరైన పర్యవేక్షణ విషయం పై దృష్టి సారిస్తున్న మంత్రి సత్యాకుమార్ యాదవ్ 2020లో ఎసిబి ద్వారా గుడివాడ ప్రభుత్వాఆసుపత్రిలో వెల్లడైన ఈ లోపాన్ని తీవ్రంగా పరిగణించారు. ఆసుపత్రి నిర్వహణకు సంబందించి 2014-18 కాలంలో వచ్చిన అంతర్గత ఆడిట్‌నివేదికలపై తగు చర్యలు తీసుకోకపోవడం పట్ల కూడా మంత్రి స్పందించారు. వ్యవస్థ నిర్వహణ మెరుగు పడేందుకు దోహద పడే ఆడిట్ రిపోర్టుల పట్ల ఉదాసీనతను సహించలేమని మంత్రి అన్నారు. రోగ నిర్ధారణ పరీక్షల కోసం వాడే పలురకాల కిట్లు, గ్లౌసులు వంటగది, పంపు షెడ్డు, ప్లంబర్ రూమ్ ఇతరచోట్ల చెల్లా చెదురుగా పడి ఉండటాన్ని ఏసి బి పర్యవేక్షణా రాహిత్యానికి సాక్ష్యంగా చూపింది.

వాడటానికి వీలుకాని వాహనాన్ని దీర్ఘకాలం పాటు వదిలించుకోకుండా డ్రైవరును వేరే పనులకు వాడుకొని లక్షల మేరకు జీతం చెల్లించడాన్ని ఎసిబి తప్పుపట్టింది. పర్యవేక్షణారాహిత్యం కారణంగా ఆసుపత్రి ప్రాంగణంలో పరిశుభ్రత లోపించడాన్ని ఎసిబి వెల్లడించింది. రోగులకు భోజనం అందించే విషయంలో ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని, భోజన నాణ్యత నాసిరకంగా ఉందని, రోగుల వివరాల్లో తప్పులున్నాయని ఎసిబి వెల్లడించింది. రోగులకు మందుల సరఫరా, స్టాక్ రిజిస్టర్లో వ్యత్యాసాలు, ప్రతిరోజూ రోగులమంచాలపై దుప్పట్లు మార్చకపోవటానికి సంబంధించి ఎసిబి నర్సింగ్ సూపరింటెండెంట్లు, ఫార్మాసిస్టులను బాధ్యులుగా చేసింది.

అనకాపల్లి ప్రభుత్వాసుపత్రిలో 2020లోనే ఎసిబి జరిపిన మరో తనిఖీ దరిమిలా ఇచ్చిన నివేదిక ఆధారంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ గత నెల 27న 22 మంది వైద్యులు, ఇతర సిబ్బందిపై విచారణకు ఆదేశించారు. రెండువారాలలోపే అదే రీతిలో మరో నివేదిక వెల్లడవటం గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వాసుపత్రుల్లో నెలకొన్న బాధ్యతారాహిత్యానికి, అక్రమాలకు అద్దం పట్టిందని మంత్రి వ్యాఖ్యానించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి ప్రభుత్వాసుపత్రుల్లో పర్యవేక్షణ పటిష్టం చేయడంపై దృష్టిపెట్టిన సత్యకుమార్ యాదవ్ ఈ దిశగా పలు సమీక్షలు చేపట్టారు.

# వివేకా హత్యపై విచారణ పూర్తి

>> నర్రెడ్డిపై దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టుపైనా అభిప్రాయం చెప్పాలని సిబిఐని సుప్రీం కోర్టు కోరింది. ఇదే సమయంలో వివేకా హత్య కేసు ట్రయల్, తదుపరి విచారణ ఏకకాలంలో కొనసాగించే అవకాశం వుందా? అన్న విషయంపైనా సిబిఐ అభిప్రాయం చెప్పాలని సుప్రీం కోర్టు కోరింది. వివేకా హత్య కేసులో అన్ని కోణాల్లో విచారణ ముగిసిందని సిబిఐ తరపు న్యాయవాది తెలిపారు. జస్టిస్ ఎంఎం సుందరేషన్ నేతృత్వంలోని ధర్మా సనానికి ఈ మేరకు సిబిఐ స్టేటస్ వివరాలను అందజేసింది. మరోవైపు ఇదే కేసులో కడప ఎంపి అవినాష్ రెడ్డితో పాటు మరికొందరు నిందితులకు గతంలో తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా దీనిని సిబిఐతో పాటు వివేకా తనయ సునీత సుప్రీం కోర్టులో సవాల్ చేయగా దానిపైనా మంగళవారం నాడు సుప్రీం కోర్టులో వాదనలు జరిగాయి. బెయిల్‌పై వున్న వారు సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సునీత తరపు న్యాయవాది సి ద్దార్థ లూద్రా సుప్రీం కోర్టుకు తెలిపారు. వివేకా హత్య కేసు దర్యాప్తు అధికారి రాంసింగ్‌తో పాటు సునీత దంపతులపై నమోదైన కేసులో ఎపి సర్కారు దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకే రాంసింగ్‌తో పాటు సునీత దంపతులపై అప్ప ట్లో కేసు నమోదయ్యిందని క్లోజర్ రిపోర్టులో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందని లూద్రా తెలిపారు. ఈ కేసులో అవినాష్ రెడ్డితో పాటు ఇతర ని ందితుల బెయిల్ రద్దుపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని లూద్రా కోరగా దీనిపై తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి సుప్రీం కోర్టు వాయిదా వే సింది.

## వారం - వర్జ్యం

తేది : 06-08-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
ద్వాదశి మ.2.04
మూల మ.12.56
వర్జ్యం : రా.10.56-12.37
దు.ఉ.11.49-12.40
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది.

**వృషభం :** సంఘంలో గౌరవం పెరుగుతుంది. ఆరోగ్య సమస్యలు తీరతాయి.

**మిథునం:** అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి. సన్నిహితుల నుండి ధనలాభం పొందుతారు.

**కర్కాటకం :** స్థిరాస్తి వివాదాలు ఒక కొలిక్కి వస్తాయి. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**సింహం:** ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. వైద్య, పారిశ్రామిక రంగాలవారికి అనుకూలమైన కాలం.

**కన్య :** ఋణాలు తీరి ఊరట చెందుతారు. మంచితనంతో అందరినీ ఆకట్టుకుంటారు.

**తుల :** ముఖ్యమైన పనులు సోదరులతో సకాలంలో పూర్తిచేస్తారు. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. గృహం, స్థలాలు కొనుగోలు యత్నాలు సాగిస్తారు.

**ధనుస్సు:** సన్నిహితులనుండి కీలక సమాచారం అందుకుంటారు. షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు

**మకరం:** ఇంటా బయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. నూతన ప్రయత్నాలలో విజయంసాధిస్తారు.

**కుంభం:** వివాదాలకు దూరంగా వుండండి. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు ఉంటాయి.

**మీనం :** జీవితభాగస్వామితో విభేదాలు రాకుండా తగుజాగ్రత్తలు పాటించండం చెప్పదగిన సూచన.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆపరేషన్ 'కుంకీ' విజయవంతం

>> చేపట్టిన తొలి ఆపరేషన్ విజయవంతంగా పూర్తయినట్లు డిప్యూటీ సిఎం కార్యాలయ అధికారులు తెలిపారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలోని మొగిలి వద్ద మామిడి తోటలను ధ్వంసం చేస్తున్న అటవీ ఏనుగుల గుంపుని కుంకీలు విజయవంతంగా దారి మళ్లించి అడవిలోకి తరిమికొట్టినట్టు అటవీ శాఖ అధికారులు ఇచ్చిన సమాచారం ద్వారా తెలియవచ్చింది. కృష్ణ, జయంత్, వినాయక అనే కుంకీలు ఈ ఆపరేషన్‌లో పాల్గొని అడవి ఏనుగులను పంటల వైపు రాకుండా అడ్డుకుని తిరిగి అడవిలోకి మళ్లించాయి. ఈ నెల రెండవ తేది రాత్రి నుంచి 4వ తేదిఉదయం వరకు కొనసాగిన ఈ ఆపరేషన్‌లో కర్ణాటక నుంచి తీసుకువచ్చిన కృష్ణ అనే కుంకీ ఏనుగు చాలా చురుకుగా పాల్గొన్నట్టు అటవీ అధికారులు తెలిపారు. మొగిలి ప్రాంతంలో 15 రోజులుగా ఏనుగుల సంచారం ఉన్న సమాచారంతో అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టారు.

**ఇదే తొలి అడుగు :**

కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తీసుకువచ్చిన అనంతరం రెండు నెలల శిక్షణ తర్వాత మొదటి ఆపరేషన్ విజయవంతంగా చేపట్టడం ఆనందాన్నిచ్చిందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఏనుగుల సంచారంతో ఇబ్బందులు పడుతున్న సరిహద్దు ప్రాంతాల రైతులు, ప్రజలకు ఈ ఆపరేషన్ భరోసా ఇస్తుందన్నారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏనుగుల గుంపు నుంచి పంటలను, ప్రజల ప్రాణాలు కాపాడే దిశగా ప్రణాళికాబద్ధంగా పని చేస్తుందనడానికి కుంకీలతో చేపట్టిన ఆపరేషన్ తొలి అడుగు అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న అటవీ అధికారులకు, మావటిలు, కావడిలకు ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. అడిగిన వెంటనే కుంకీ ఏనుగులను రాష్ట్రానికి ఇచ్చి సహకరించిన కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, ఆ రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేలకు మరోసారి కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. తదుపరి ఆపరేషన్ పుంగనూరు అటవీ ప్రాంతంలో చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని పవన్ తెలిపారు.

# అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం



వరి నాట్లు వేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీశ

**స్వయంగా వరి నాట్లు వేసిన కలెక్టర్ లక్ష్మీశ**

**పంట సాగుకు అవసరమైన ఎరువులు సిద్ధం**

**విచ్చలవిడిగా ఎరువులు వాడి నేలను నిస్సారం చేయొద్దు**

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నదాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య మిస్తోందని.. రైతుల క్షేమం, సంక్షేమంతోనే వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారమవుతుందని, ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం ఇబ్రహీం పట్నం మండలం, గుంటుపల్లిలో జరిగింది. కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. రైతు జి.రవీంద్రనాథ్ ఠాగూర్ పొలంలో వరి నాట్లు వేసి.. రైతులు అన్నివిధాలా ఎదిగేందుకు మేమంతా వారి వెనుక ఉన్నామనే భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి గ్రామానికీ ప్రత్యేక సమస్యలు ఉంటాయని.. ఈ నేపథ్యంలో రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే లక్ష్యంతో ప్రతి మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాగునీరు, విత్తనాలు, ఎరువులు, సీసీఆర్సీ కార్డులు, పంట రుణాలు.. ఇలా ప్రతి అంశానికి సంబంధించి [illegible] వెన్నుదన్నుగా నిలిచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని.. బయోమెట్రిక్ ఆధారిత ఆన్‌లైన్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అయితే విచ్చలవిడిగా ఎరువులు వినియోగించవద్దని, తెలిసో తెలియకో అలా వినియోగిస్తే నేల నిస్సారమై, సాగుకు పనికిరాకుండా పోతుందన్నారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది, శాస్త్రవేత్తల సూచనల మేరకు మాత్రమే ఎరువులు, పురుగుముందులు వినియోగించాలని సూచించారు. పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుందని..అదేవిధంగా ప్రకృతి సేద్య విధానాలను కూడా అనుసరించాలని సూచించారు. గుంటుపల్లిలో ప్రధానంగా బీపీటీ 5204, ఎంటీయూ 1318, ఎంటీయూ 1262, పీఎల్ 1100 రకాలు పండిస్తున్నారని.. వరికి సంబంధించి మొదటి దఫా యూరియా గుళికలు వేసి తర్వాత రెండు, మూడు విడతల్లో నానో యూరియాకు ప్రాధాన్యమివ్వాలని.. దీనివల్ల దాదాపు 50 శాతం ఎరువు ఆదా అవడమే కాకుండా సామర్థ్యమూ పెరుగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటికే 39 వ్యవసాయ డ్రోన్లు అందించామని, ఇక్కడ కూడా అవసరం మేరకు డ్రోన్లను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమం లక్ష్యంగా హైటెక్ అగ్రికల్చర్, ప్రెసిషన్ అగ్రికల్చర్, మార్కెట్ లింక్డ్ అగ్రికల్చర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు.

సాగు పరంగా ఎలాంటి ఇబ్బంది ఉన్నా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ (91549 70454) అందుబాటులో ఉందని.. కాల్ చేసి సమాచారమిస్తే వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎలాంటి వదంతులు నమ్మొద్దన్నారు. ఎరువులను అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా సంబంధీకులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

# అమరావతిలో 230 ఎకరాల్లో కల్చర్ డిస్ట్రిక్ట్

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో నదీ అభిముఖ ప్రాంత (రివర్‌ఫ్రండట్) అభివృద్ధిలో భాగంగా 250 ఎకరాల్లో 'కల్చర్ డిస్ట్రిక్ట్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతిలో హరిత వనాలు, కాలువలు, తటాకాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ ప్రతిపాదనపై ప్రాథమికంగా చర్చించారు. సింగపూర్‌కు చెందిన సుర్బానా జురాంగ్ రూపొందించిన రాజధాని అమరావతి బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్)లో కృష్ణానదీ తీరంలో కల్చర్ డిస్ట్రికక్ట్‌ను ప్రతిపాదించారు. దానికి మరింత విస్తృత రూపం ఇస్తూ రూపొందించిన ప్రణాళికలను అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కల్చర్ డిస్ట్రిక్ట్ ప్రతిపాదనకు సిఎం ఆమోదముద్ర వేసినట్లు సమాచారం. పూర్తిస్థాయి ప్రణాళికలను త్వరలో సిద్ధం చేస్తారు. రాష్ట్ర చరిత్ర,సంస్కృతి,కళలకు అద్దం పట్టేలా దీన్ని తీర్చిదిద్దాలన్నది ఆలోచనగా ఉంది.కల్చర్ డిస్ట్రిక్ట్‌లో భాగంగా రివర్ ఫ్రంట్,కల్చర్ ప్రొమెనేడ్,లాన్ టెర్రాస్,హైస్ట్రీట్, రివర్ మార్కెట్,క్రాఫ్ట్ విలేజ్,సాంస్కృతిక కేంద్ర,కమ్యూనిటీ ప్లాజా,యాంపీ థియేటర్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వేదిక, మల్టీపర్పస్ ప్లే గ్రౌండ్,పిల్లల ఆటపాటల కోసం కిడ్స్ ప్లే ఏరియా,రిబ్బన్ వాక్,సెల్ఫీ కార్నర్స్, వ్యూయింగ్ డెక్‌లు వంటివి ఏర్పాటు చేయబోతున్నారు.

# తిరుమల సమాచారం

## పవిత్ర ప్రతిష్టతో ఉత్సవాలు ఆరంభం



**తిరుమల,ఆగస్ట్ 5 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవారి ఆలయంలో మూడురోజులు నిర్వహించే పవిత్రోత్సవాలు మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం జాతశౌచం, మృతశౌచం వంటి సమయాల్లో తెలిసీతెలియకో భక్తులు, ఆలయ సిబ్బందిచేత కలిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎటువంటి భంగం వాటిల్లకుండా జరిపించే ఈ పవిత్రోత్సవాలు మంగళవారం నుండి మొదలయ్యాయి. వైఖానస ఆగమోక్తంగా జరిపించే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఉదయం శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారిని సంపంగిప్రాకారంలోని పవిత్రమండపంలోనికి వేంచేపుచేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. వేడుకగా ఉత్సవమూర్తులకు పాలు,పెరుగు, తేనె, చందనం, కొబ్బరిజలం సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. వేదపండితులు వేదసూక్తాలను పఠించారు. సాయంత్రం ఉత్సవమూర్తులు స్వామిఅమ్మవార్లు ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో స్వామివారికి జరిగే ఆర్జితసేవలు రద్దుయ్యాయి. పవిత్రోత్సవాల్లో తొలిరోజు మధ్యాహ్నం శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి పవిత్ర ప్రతిష్ట చేపట్టారు. ఈ సందర్భంగా అష్టదళపాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవలు రద్దయ్యాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయ్యంగారు, చిన్నజీయ్యంగారు. టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ ప్రధానఅర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు పాల్గొన్నారు.

## అందరిపై శ్రీవారి ఆశీస్సులుండాలి : ప్రముఖులు



**తిరుమల,ఆగస్ట్ 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై కలగాలని ఆకాంక్షించారు. మంగళ వారం ఉదయం సీనియర్ ఐపిఎస్ కుమార్‌విశ్వజిత్ కుటుంబంతో కలసి, సినీనటుడు జయరాం కుటుంబం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. దేవదేవుని దర్శనంతో అన్నీ శుభాలు కలుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. వీరికి టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రావణపౌర్ణమి రోజున మొగలిచర్ల దత్తాత్రేయ ఆలయంలో చండీహోమం



**తిరుపతి,ఆగస్ట్ 5 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రావణపౌర్ణమి పర్వదినం సందర్భంగా 9వ తేదీ శనివారం నెల్లూరుజిల్లా లింగ సముద్రం మండలం మొగలిచర్లలోని దత్తాత్రేయస్వామి మందిరంలో చండీహోమం నిర్వహిస్తున్నారు. ఈ హోమంలో భక్తులు ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా పాల్గొనవచ్చని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆలయంలో నేరుగా హోమంలో పాల్గొనదలచిన భక్తులు 8వతేదీ నేరుగా ఉదయం 10గంటలకు ఆలయంవద్దకు చేరుకుని పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మొగలిచర్లగ్రామంలో శీతలాదేవి విగ్రహం ప్రతిష్టాపన కార్యక్రమంతో శుక్ర,శనివారాల్లో మొగలిచర్లకు రాకపోకలు నిలుపుదలచేశారన్నారు. మరిన్ని వివరాలకు 9908973699,9182882632 నంబర్లకు సంప్రదించాలని నాగేంద్రప్రసాద్ కోరారు.

## భాకరాపేటలో కుటుంబ కథాచిత్రం షూటింగ్

**యర్రావారిపాళెం,ఆగస్ట్ 5ప్రభాతవార్త:** తిరుపతిజిల్లా చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని భాకరాపేటలో సరికొత్త కుటుంబ కథాచిత్రం షూటింగ్ మొదలైంది. జైచిరంజీవ ఆర్ట్‌క్రియేషన్స్‌పై ప్రొడక్షన్ నంబర్ 3 చిత్రం కోదండరామ ఆలయ ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరిగింది. ముహూర్త సన్నివేశానికి ముఖ్యఅతిధులుగా తిరుపతి ఎస్వీపశువైద్యవిశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ కరుణానిధి క్లాప్‌కొట్టారు. విశ్రాంత బ్యాంకు మేనేజర్ డాక్టర్ జిఎస్ ప్రసాద్ కెమెరా ఆన్‌చేశారు. రవికాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. వాసుదేవరావు నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఎస్వీరంగారావు అవార్డు గ్రహీత రేవు సీతారం, సూర్యకాంతం అవార్డుగ్రహీత సుందరమ్మ, ఈశ్వర్‌సేత, తమ్మిశెట్టి మురళీరాయల్ ప్రదాన పాత్రల్లో నటించనున్నారు. గ్రామీణప్రాంతాల్లో షూటింగ్ జరుపుకోవడం వల్ల ఈ ప్రాంతాలు గురించి ప్రజలకు తెలుస్తుందన్నారు. పర్యాటకంగా అభివృద్ధికి అవకాశం కలుగుతుందని డాక్టర్ కరుణానిధి తెలిపారు.

## మాటేసి.. వెంటాడి.. వేటాడి పిల్లిని పట్టుకోలేని చిరుత

**తిరుమల,ఆగస్ట్ 5 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో స్థానికులు నివాసముంటున్న బాలాజీనగర్ ప్రాంతంలోని గంగమ్మగుడిలో సోమవారం అర్ధరాత్రి సంచరించిన పిల్లిని సమీపంలోనే మాటేసి...చెట్టుపక్కన నక్కి దాగిఉన్న చిరుతపులి పట్టుకుని వేటాడేందుకు శతవిధాలా ప్రయత్నించింది. చివరకు సాక్షాత్తు ఆ గంగమ్మతల్లి పిల్లి ప్రాణాలు కాపాడిందనే స్థానికులు మంగళవారం ఉదయం చర్చించుకున్నారు. బాలాజీనగర్ ప్రాంతం వైపు, తిరుమలలో ఇటీవల చిరుతపులుల సంచారం ఉంది. సోమవారం అర్ధరాత్రి ఓ చిరుతపులి అడవిలోంచి ఆహారంకోసం అటుగా గంగమ్మగుడి వద్దకు వచ్చింది.


**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ - విశాఖపట్నం**
గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్, శ్రీ నారాయణ భవన్, సాయిబాబా వీధి, డాబా గార్డెన్స్, విశాఖపట్నం - 530 020. ఆంధ్రప్రదేశ్

**ఓ.ఎ.నెం.1035/2023**

డెట్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రక్రియ) రూల్స్, 1993 యొక్క సబ్-రూల్ (2ఎ)తో చదువబడే, చట్టం యొక్క సెక్షన్ 19 లోని సబ్ సెక్షన్ (4) ప్రకారం సమన్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME భీమవరం బ్రాంచ్, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, వారి తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న చీఫ్ మేనేజర్ ... దరఖాస్తుదారు

మరియు

1. మెస్సర్స్ శ్రీ వెంకటలక్ష్మీ ట్రేడింగ్ కంపెనీ, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్ట్నర్ : శ్రీ వాడపల్లి జగన్ మోహనరావు, 2. శ్రీ వాడపల్లి జగన్ మోహన్‌రావు, 3. శ్రీమతి వాడపల్లి భానుమతి, 4. శ్రీ వాడపల్లి వెంకటేశ్వరరావు, 5. శ్రీ వాడపల్లి వీర వెంకట బ్రహ్మాజీ ... ప్రతివాదులు

వీరికి :

4. శ్రీ వాడపల్లి వెంకటేశ్వరరావు, తండ్రి : సుబ్బారావు, డి.నెం.8-97, శాలిపేట, ఆకివీడు, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 534235. ... ప్రతివాదులు - 4

**పేపరు ప్రచురణ ద్వారా రెస్పాండెంట్స్/ప్రతివాదులు నెం.4 వారికి సమన్లు**

గౌరవనీయ ప్రిసీడింగ్ ఆఫీసర్ / రిజిస్ట్రార్ వారి సమక్షమున ఓ.ఎ.నెం.1035/2023, తేది.10.10.2025న జాబితా (లిస్ట్) చేయటమైనది.

రుణం రూ.1,71,63,863.67/- వసూలు కొరకు మీ పైన వేసిన దావా (ఓ.ఎ) ననుసరించి, చట్టం యొక్క 19(4) సెక్షన్ క్రింద సదరు దరఖాస్తు పైన గౌరవనీయ ట్రిబ్యునల్ సమన్లు / నోటీసు జారీ (దరఖాస్తు డాక్యుమెంట్లు కాపీలు వగైరాతో మా సమక్షమున అందచేయబడతాయి) చేయటమైనది. చట్టం యొక్క 19వ సెక్షన్ (4) వ సబ్-సెక్షన్ తదనుగుణంగా, మీరు, ప్రతివాదులు ఈ క్రింది అంశాలు గమనించవలెను:

1) సమన్లు జారీ చేసిన 30 రోజులలోగా కోరిన ఉపశమనం ఎందుకు మంజూరు చేయకూడదో కారణం చూపాలి.

2) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన ఎస్సెట్స్ లేదా ఆస్తులు కాకుండా ఇతర ఆస్తులు మరియు ఎస్సెట్స్ వివరాలను వెల్లడించాలి.

ఆస్తులు ఎటాచ్‌మెంట్ కొరకు దరఖాస్తు విచారణ మరియు డిస్పోజల్ పెండింగ్‌లో ఉన్నందున, సెక్యూర్డ్ ఎస్సెట్స్ లేదా అటువంటి ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన వాటితో లావాదేవీలు చేయుట లేదా విక్రయించుట నుండి మిమ్మల్ని నిరోధించడమైనది.

3) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన లేదా బహిరంగ పరచిన సెక్యూర్డ్‌గా ఇచ్చిన ఎస్సెట్స్ మరియు / లేదా ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు పైన మీరు సాధారణ వ్యాపారం మినహా, వాటిని ట్రిబ్యునల్ ముందస్తు అనుమతి లేకుండా విక్రయించుట, లీజు లేదా ఇతరత్రా లావాదేవీల ద్వారా మీరు బదిలీచేయ వీలులేదు.

4) సెక్యూర్డ్ ఆస్తులు లేదా ఇతర ఆస్తులు అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయానికి మీరు బాధ్యత వహించాలి మరియు అట్టి విక్రయ ఆదాయాన్ని సదరు ఆస్తులు సెక్యూరిటీ ఇంటరెస్ట్ కలిగియున్న బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థలు నందు నిర్వహిస్తున్న ఖాతా నందు జమ చేయవలెను.

ఇందుకు సంబంధించి లిఖిత స్టేట్‌మెంట్‌ను దాని కాపీని దరఖాస్తుదారునికి దాఖలు చేస్తూ తేది.10.10.2025న ఉదయం 10.30 గంటలకు ప్రిసైడింగ్ ఆఫీసర్/ రిజిస్ట్రార్ సమక్షంనకు హాజరు కావలసినదిగా కూడా మీకు సూచించడమైనది అట్లు చేయనిచో దరఖాస్తు మీ పరోక్షమున విచారించబడుతుంది మరియు నిర్ణయించబడుతుంది.

(ఇది నా స్వహస్తాలతో మరియు ట్రిబ్యునల్ ముద్రికతో 04 ఆగస్టు, 2025న ఇవ్వడమైనది)

సం/- అధీకృత అధికారి వారి సంతకం
సమన్లు జారీ చేయు వారు


## నన్‌లపై దాడులకు నిరసనగా విజయవాడలో క్రైస్తవ సంఘాల ఆందోళన

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి** క్రైస్తవులపై దాడులను ఆపాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో తెలుగు చర్చెస్ ఆఫ్ ఫెడరేషన్ ఆందళనలు నిర్వహిస్తోంది.అందులో భాగంగా నగరంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. గత వారం విజయవాడలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఇద్దరు మలయాళీ నన్‌లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ .. తెలుగు చర్చిల సమాఖ్య సభ్యులు, క్రైస్తవ సమాజ సభ్యులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ నిరసన ర్యాలీ బిషప్ స్కూల్ గ్రౌండ్స్ నుండి ప్రారంభమై ఎంజి రోడ్డు గుండా ప్రయాణించి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్మృతి వనం పార్క్ వద్ద ముగిసింది. విజయవాడ కాథలిక్ పీఠం ఆధ్వర్యంలో మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్ నేతృత్వంలో ఈ ర్యాలీ జరిగింది. విజయవాడ కాథలిక్ డయోసెస్ మాన్సిగ్నోర్, ఫెడరేషన్ ఆఫ్ చర్చిస్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ రెవరెండ్ మువ్వల ప్రసాద్, బెథెల్ మినిస్ట్రీస్ చైర్మన్ రెవరెండ్ ఎస్. జయ కుమార్, గుణదల చర్చి రెక్టర్ ఫాదర్ ఎలేటి విలియం జయ రాజు, నన్‌లు సుగుణ, సుందరి, ఇతరులు మాట్లాడుతూ నన్‌లపై ఉన్న కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఛత్తీస్‌గఢ్‌లోని రైల్వే స్టేషన్‌లో ఉన్న నన్‌లపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అయితే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మఅతి వనం వద్దకు చేరుకోకుండా సూర్యారావుపేట వద్ద పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. ఈ ర్యాలీకి ఎలాంటి అనుమతి తీసుకోలేదని పోలీసులు ఆరోపించారు. అయితే, ర్యాలీలో పాల్గన్న ఒక అసోసియేషన్ నాయకుడు మాట్లాడుతూ " మేము ర్యాలీ నిర్వహించ డానికి ముందుగానే పోలీసుల నుండి అనుమతి తీసుకున్నాము. కానీ, ఒక పోలీసు అధికారి మమ్మల్ని రోడ్డుపై ఆపి, కొవ్వొత్తుల ర్యాలీకి అనుమతి లేదని వాగ్వాదం చేశారు. స్మఅతి వనం వరకు మమ్మల్ని అనుమతించాలని మేము అతనిని అభ్యర్థించినప్పటికీ, పోలీసులు మా అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో నన్‌లు బిషప్ అజారియా స్కూల్‌కు తిరిగి వచ్చారు. " అని వివరణ ఇచ్చారు. ర్యాలీలో మైక్‌లను ఉపయోగించడానికి అనుమతి లేదని సౌత్ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పవన్ కుమార్ తెలిపారు. "నిర్వాహకులు మైక్‌లను ఉపయోగించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తుండటంతో తాము వాటిని స్వాధీనం చేసుకున్నాము" అని ఎసిపి తెలిపారు.

## గ్రంథాలయం కేంద్రంగా చదువుకుని కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సత్కారం



గ్రంథాలయం కేంద్రంగా చదువుకుని కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సత్కార కార్యక్రమంలో రమాదేవి

**విజయవాడ,ఆగస్టు5, ప్రభాత వార్త ప్రతినిధి:** విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చదువుకుని కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం ఘనసన్మానం జరిగింది.గ్రంథాలయం ఆధ్వర్యంలోనే జరిగిన ఈ కార్యక్రమానికి లైబ్రేరియన్ కె.రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను దుశాలువ, జ్ఞాపికలతో ఆమె సత్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ఏపీ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో ఠాగూర్ గ్రంథాలయం కేంద్రంగా చేసుకుని చదువుకున్న 13 మంది విద్యార్థులు ఎంపిక అయినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. బి.ప్రదీప్. పి.శ్రీనివాస్,. జే.వెంకటయ్య, బి.నాగరాజు, జీ.సురేంద్ర బాబు, యన్.పృథ్వీ, .హలీమ, . ఏ.మహేష్,. గోపి.కె. వాసంతి, కె. సుష్మా శ్రీ, బి. అలివేలు,యం. బాలయ్య మొత్తం 13 మంది ఎంపిక అయ్యారని తెలిపారు వారు ఎంతో కష్టపడి తమ కుటుంబ సభ్యులను, తోటి విద్యార్థులను, గ్రంథాలయ సిబ్బంది అందరినీ గర్వపడేలా చేశారు అని అన్నారు. వారు ఇక్కడితో కాకుండా ఇంకా ఉన్నత స్థానానికి చేరాలని కోరుతున్నాను అన్నారు. అభ్యర్థులు మాట్లాడుతూ గ్రంథాలయంఎంతగానో ఉపయోగపడింది అని, ఇక్కడ చదువుకోవటానికి చాలా సౌకర్యంగా ఉంటుంది అని, కష్టపడి చదివితే ఫలితం తప్పకుండా దక్కుతుంది అని అన్నారు. నిరాశ పడకుండా ప్రిపరేషన్ చేస్తూ వెళ్తే ఎన్నటికైనా మనకి సరైన ఫలితం వస్తుంది అని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది,విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## రైల్వే జోనల్ ఎస్‌సి,ఎస్‌టి ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో గజరాజు ప్యానల్ ఘన విజయం

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 5,ప్రభాతవార్త** అకిల భారత రైల్వే ఎస్‌సి,ఎస్‌టి ఉద్యోగుల సంఘం దక్షిణ మధ్య రైల్వే జోనల్ కమిటీకి నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలను ఎన్నికల అధికారి బి వీరన్న,రైల్వే పరిశీలకుడు యట్టయ్యలు ప్రకటించారు. అసోసియేషన్ జోనల్ కమిటీకి రానున్న మూడేళ్ల కాలవ్యవధికి నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలలో ఏనుగు(గజరాజు), ధర్మచక్రం ప్యానల్‌ల మధ్య పోటీ హోరా హోరీగా సాగింది. ఈ ఎన్నికలలో ఓటర్లు ఏనుగు (గజరాజు) ప్యానల్‌కు పట్టం కట్టారు. జోనల్ అధ్యక్ష పదవికి ఏనుగు ప్యానల్ నుండి పోటీ చేసిన ఏ వినోద్ తన ప్రత్యర్థిపై 11ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధర్మనాయక్ 12ఓట్ల మెజార్టీతోను, జోనల్ కార్యదర్శిగా జి దాశరథి క్రిష్ణ 14ఓట్ల మెజార్టీతో, జోనల్ అదనపు కార్యదర్శిగా కెపి హరిప్రసాద్ రెండు ఓట్ల మెజార్టీతో కీలకమైన జోనల్ కోశాధికారిగా రాయలసీమ గుంతకల్లు డివిజన్ నుంచి పోటీ చేసిన యస్ సాయిబాబా తన సమీప ప్రత్యర్థిపై అత్యధికంగా 20ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించినట్లు ఎన్నికల అధికార యంత్రాంగం ప్రకటించింది.

## అమరావతి నిర్మాణంలో ప్రజాభాగస్వామ్యం

**- విరాళాల స్వీకరణకు సిఆర్డీఎ ఆహ్వానం**

**విజయవాడ,ఆగస్టు 5,ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా విరాళాలు స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాలన్న ఆకాంక్ష ఉన్న వారి కోసం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సీఆర్డీఏ వెబ్‌సైట్ సిఆర్‌డిఏ.ఎపి.జిఒవి.ఇన్‌లో ఇందుకు ప్రత్యేకంగా 'డొనేట్ ఫర్ అమరావతి' నే ఆప్షన్ ఇచ్చారు. దీనిపై క్లిక్ చేస్తే...క్యూ ఆర్ కోడ్ వస్తుంది.ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే...పేమెంట్ గేట్‌వే వస్తుంది. అందులో విరాళం అందచేయాల్సిన మొత్తాన్ని నమోదు చేసి...మన యూపీఐ పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి.ఆ మొత్తం సీఆర్డీఏ ఖాతాకు జమవుతుంది.2015 అక్టోబరులో కొత్త రాజధాని నిర్మాణం కోసం అప్పటి సిఎం చంద్రబాబు...'మై బ్రిక్...మై అమరావతి'ని ప్రారంభించారు. ఒక్కో ఈ-ఇటుకను రూ.10 వెచ్చించి ప్రజలు కొనుగోలు చేశారు. దీనికి ప్రపంచ వ్యాప్తంగా ...పలు దేశాల నుంచి అనూహ్య స్పందన కనిపించింది.

## శాస్త్ర విజ్ఞాన లక్ష్యాలకు తిరుపతి 'ఐసర్' మణిదీపం

### 6వ స్నాతకోత్సవంలో 255మందికి డాక్టరేట్ పట్టాలు



**శ్రీకాళహస్తి,ఆగస్టు 5 ప్రభాతవార్త** శ్రీకాళహస్తికి సమీపంలో కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిన భారతీయ విజ్ఞాన శిక్షణ మరియు పరిశోధన సంస్థ భవిషత్తులో 'శాస్త్ర విజ్ఞాన లక్ష్యాలకు మణిదీపం కాగలదని మంగళవారం జరిగిన పదవ వార్షికోత్సవం,6వ స్నాతకోత్సవ సభలో ప్రసంసించారు. 255 మంది విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను అతిధులు అందించారు. ఐసర్ 2015లో మంజూరు చేసి అదే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించగా సొంత భవనాల్లో మొదటి సారి 6వ స్నాతకోత్సవాన్ని జరుపుకున్నారు.ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శాంతను భట్టాచార్య పదేళ్ళలో సాధించిన ప్రగతిని విశ్లేషించారు.పరిశోధన వైజ్ఞానిక అవిష్కరణలకు పునాది వేసే విధంగా తిరుపతి ఐసర్‌ను నిర్మించామన్నారు. సుమారు 256 ఎకరాల్లో నిర్మించిన విద్యాసంస్థ ప్రత్యేక శిల్పకళతో తీర్చి దిద్దామన్నారు. ఈ కార్యంపస్‌కు గ్రిహా కౌన్సిల్ మరియు తేరి 4 స్టార్ ఎల్‌డి రేటింగ్ ఇచ్చాయని వివరించారు.ఇక్కడ నిర్మించిన ఒక్కొక్క భవనానికి ఎంతో ప్రత్యేకతను ఇచ్చామన్నారు. ముఖ్యంగా గ్రంధాలయం, ఆడిటోరియం వంతి భవనాల్లో భారతీయ, విదేశీ ప్రముఖ శాస్త్రవేత్తలు పేర్లను పొందు పరచామన్నా రు.దానిని నిర్మాణం లోనే మిళితం చేసామని భట్టా చార్య వివరించారు. భారతీయ శాస్త్రీయ రంగంలో ప్రతిభకు తిరుపతి ఐసర్ పట్టం కట్టిందన్నారు. పదేళ్ళ ప్రస్తానంలో ఎన్నో విజయాలు సాధించి నట్లు భట్టాచార్య వివరించారు. ఈ విద్యా సంవత్సరం 210పరిశోధనా పత్రాలు ప్రచురించబడ్డాయని ఇందుకు రూ.29.43 కోట్లు బహిరంగ పరిశోధనా నిధులు అందుకున్నామని వివరించారు. నెచర్ ఇండెక్స్ 2025 ప్రకారం తిరుతపి ఐసర్ 33వ స్థానంలో నిలిచినట్లు డైరెక్టర్ భట్టాచార్య వివరించారు.స్టాన్ ఫోర్ట్ యూనివర్శిటి ప్రకటించిన 'ప్రపంచ ఉత్తమ 2శాతం శాస్త్రవేత్తల జాబితాలో ఎనిమిది మంది ఫ్యాకల్టీ సభ్యులు ఉండటం గర్వకారణమన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి తిరుపతి ఐసర్ కొత్తగా ఒరెండు సంవత్సరాల మాస్టర్ బై రీసెర్చ్ (ఎంఎస్-ఆర్) కోర్సును ప్రారంభిస్తున్నట్లు వివరించారు.ఈ విద్యాసంవత్సరం కొత్తగా 400 మంది విద్యార్థులు చేరుతున్నట్లు వివరించారు. స్పోర్ట్స్ కాంప్లెక్సు, ఫైవ్‌స్టార్‌ల్యాబ్స్,పేఅండ్ ఈట్ మెస్, ఆధునిక నివాసాల మధ్య విద్యార్థుల సంపూర్ణ అబివృద్ధికి ఏర్పాట్లు చేస్తున్నట్లు భట్టాచార్య వివరించారు. నేల ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మార్చగల శక్తికి శాస్త్రవేత్తలకు ఉంది. సోమయ్య ముఖ్యఅతిధిగా వచ్చిన గోదావరి బయోరిఫైనరిస్ లిమిటెడ్ చైర్మన్ సోమయ్య విద్యాసంస్థల ఛాన్సలర్ సమీర్ సోమయ్య విద్యార్థులను ఆకర్షిస్తూ తన ప్రసంగాన్ని ఆంగ్లంలోనూ,హిందీలో సాగించారు.

## సెప్టెంబర్12నుండి తిరుపతిలో స్వర్ణోత్సవ నృత్యకళోత్సవాలు



**తిరుపతి.ఆగస్ట్ 5ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో తిరుపతిలో సెప్టెంబర్ 12నుండి 14వ తేదీవరకు మూడురోజులపాటు శ్రీకృష్ణదేవ రాయ స్వర్ణోత్సవ నృత్యకళోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. శాస్త్రీయ నృత్య జానపద పోటీలు ఉంటాయన్నారు. బృందం నృత్యాలలో తమ ప్రతిభ చూపిన కళాకారులకు మొదటిబహుమతిగా 10వేల రూపాయలు, రెండోబహుమతిగా 6వేలు రూపాయలు, తృతీయ బహుమతిగా 3వేల రూపాయలు, సోలో నృత్యోత్సవాల్లో విజేతలకు మొదటి బహుమతి 4వేలు, రెండోబహుమతి 3వేలు. మూడోబహుమతి 2వేల రూపాయలు ,జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులకు మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. తిరుపతి,చిత్తూరు, కడపజిల్లాల కళారారులు 12వతేదీ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు రంగస్థలి కార్యదర్శి కెఎన్ రాజ,9347046608నంబర్‌కు సంప్రదించాలని, ఆగస్ట్ 20వతేదీ లోపు దరఖాస్తులు పంపాలని కోరారు.

## అమరావతిలో ముమ్మరంగా భూగర్భ విద్యుత్‌లైన్ల పనులు

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగు తున్నాయి. ఇక్కడ ఇప్పటికే జనావాసాలకు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయించింది..ఈ భూముల్లో చాలా చోట్ల 220 కెవీ.132 కెవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల స్థంభాలు ఉన్నాయి. వీటి వల్ల నిర్మాణాలకు ఇబ్బందులు రాకుండా భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం తాళ్ళాయపాలెం లోని 400 కెవీ సబ్‌స్టేషన్‌తో పాటులింగాయపాలెం,నేలపాడులో నిర్మించబోయే 220 కెవీ ఉపకేంద్రాల నుంచి లైన్లను భూగర్భంలో వేసే పనులు,ఇప్పటికే ఉనన టవర్లనుమార్చే పనులు జరుగుతు న్నాయి. భూగర్భంలో డక్ట్‌లు ఏర్పాటుచేస్తున్నారు.

## పరిశ్రమలో ఇంటర్న్‌షిప్‌లు.. భద్రతకు ఒప్పందాలు

**- కోర్సులు,సిలబస్ రూపకల్పనకు నోడల్ సెంటర్లుగా వర్సిటీలు**

**విజయవాడ,ఆగస్టు 5,ప్రభాతవార్త ప్రతినిధి:** పరిశ్రమల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు కల్పించడానికి,వాటి భద్రతకు సంబంధించి విశ్వవిద్యాలయాల నుంచి సాంకేతిక సహకారం తీసుకునేందుకు ఫ్యాక్టరీస్ విభాగం సోమవారం శ్రీ వెంకటేశ్వర,జెఎన్‌టీయూ-అనంతపురం విశ్వవిద్యాలయాలు,ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్‌తో ఒప్పందాలు కుదుర్చుకుంది. విజయవాడ లోని కార్మిక శాఖ కమీషనర్ కార్యాలయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో వీరు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ప్రతిపాదనను ఆ శాఖ కార్యదర్శి శేషగిరిబాబు తీసుకొచ్చారు. ఈ ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారు. పరిశ్రమల్లో భద్రతకు సంబంధించి విశ్వవిద్యాలయాలు సాంకేతిక మద్దతునిస్తాయి. రాష్ట్రం లోని 200 ప్రమాదకర పరిశ్రమల్లో ప్రస్తుత పరిస్థితులు,ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై థర్డ్‌పార్టీ ఇచ్చే నివేదికను వర్సిటీలు పరిశీలిస్తాయి. ఫ్యాక్టరీల్లో భద్రత అధికారులను నియమించుకోవాలనే నిబంధన ఉంది. ఇందుకోసం వర్సిటీలు పీజీ డిప్లొమా కోర్సులు తీసుకురావడం లేదంటే కోర్సుల్లోనే అదనంగా సబ్జెక్టును చేర్చడం లేదా కిన్ని చాప్టర్లు ప్రవేశపెట్టడం లాంటివి చేస్తాయి.ఐటీఐ,డిప్లొమా,

బీటెక్‌ల్లో సిలబస్‌ను ప్రవేశపెట్టేందుకు వర్సిటీలు నోడల్ సెంటర్లుగా పనిచేస్తాయి. భద్రతపై ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు.

వార్త

చెవిటివాడు ఎవరు? మాట వినలేనివాడు కాదు, మంచి మాట విననివాడు.

-మార్టిన్ లూథర్ కింగ్

# 'జన' ఔషధి చౌక బేరం!

దేశంలో రోగాల విస్తృతి ఎంత మేరకు ఉందో అంతే స్థాయిలో నకిలీ ఔషధాల విక్రయమూ వ్యాప్తి చెందుతోంది. ఔషధ నియంత్రణ మీద ప్రభుత్వాల పట్టు గురించి చెప్పాల్సి వస్తే సరిపోదనే చెప్పాలి. నిషేధిత మందులే కాదు, నకిలీమందులు కాలం చెల్లిన ఔషధాలు కూడా ఇప్పటికే మందుల షాపుల్లో దొరకుతాయి. మందుల షాపు అనగానే అదేదో ఒక వ్యాపార విక్రయశాల కనుక తెలిసో తెలియకో విక్రయాలు జరుగుతున్నాయని సరిపెట్టుకోలేం. అక్కడ ఔషధ వినియోగం, దుష్ప్రభావాల గురించి బాగా తెలిసి వివరించ గలిగిన 'ఫార్మాసిస్ట్' ఉండడం తప్పనిసరి కావున. పైగా ప్రభుత్వాల ద్వంద్వ ప్రమాణాల కారణంగా మార్కెట్‌లో ఒక ఔషధాల కాంబినేషన్ ఫార్ములాలో ప్రఖ్యాతఫార్మసీ కంపెనీలు సాధారణ మందుల జనరిక్ మందులు బజార్లో విరివిగా దొరుకుతున్నాయి. ఈ రెండింటికీ మించి మరి కొన్ని ఫార్మా సంస్థలు సాధారణ ధరలు, జనరిక్ ఔషధ ధరలకు మధ్య ధరలకు మరికొన్ని కాంబినేషన్‌లను సరఫరా చేస్తున్నాయి. ఇలా ధరల తేడాల మధ్య ఒకే రకపు ఔషధాల కొనుగోలుకు వినియోగదారుడు వెంపర్లాడుతున్నాడు. గతానికి ఇప్పటికీ తేడా ఏమిటంటే గతంలో నేరుగా మందుల షాపుల్లో కొనుగోలు చేసే రోగులు ఇప్పుడు తాజాగా పెయిన్ కిల్లర్‌లు, బి.పి, మధుమేహం షుగర్‌ల వంటి వ్యాధులకు సంబంధించి కాంబినేషన్ డ్రగ్స్‌ను 'జనరిక్' పేర్లతో అతి తక్కువ ధరకు లభించే షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. దానివల్ల అవసరమైన ఔషధాలను తక్కువ ధరకు తెచ్చుకోగలుగుతున్నారు. డాక్టర్లు నేరుగా 'జనరిక్' పేర్లతో రాయడంలోనూ చొరవ చూపడం లేదు. జనరిక్ పేర్లతోనే ప్రిస్క్రిప్షన్‌లు రాసి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తగు ఉత్తర్వుల్చినా డాక్టర్లెవరూ వాటిని పాటించి తమ ప్రిస్క్రిప్షన్ తయారీలో వాడటానికి అలవాటు పడలేదు. ఇష్టపడడం లేదనే అనుకో వాలి. లేదు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు చౌకధరలకే అత్యవసర ఔషధాలను అందిస్తున్నామని పదేపదే చెప్పదలచుకున్నా అందులో వాస్తవాలు అతి తక్కువగా ఉంటున్నాయి. మందులు రాసిన డాక్టర్ వివేకాన్ని బట్టి రోగులపైభారం పడుతుంది. నేరుగా ఏ డాక్టరూ 'జనరిక్' మందును ప్రిస్క్రిప్షన్ చేసిన దాఖలాలు కనబడవు. దానాదీనా ధరల భారం తగ్గించడంలో ప్రభుత్వ నిర్ణయాలు ఏ మాత్రం వినియోగదారునికి ఉపయోగపడేలా లేవు. ప్రభుత్వాలు తాము కాలం చెల్లిన మందుల్ని తొలగించినట్లు చెబుతూనే వాటి వాడకాలపై నిషేధం విధిస్తోంది. అలాగే కొన్ని కాంబినేషన్లను వాడొద్దని చెబుతోంది. కానీ అంతే ధైర్యంగా 'జనరిక్' మందుల విక్రయాలు అత్యంత అవకాశాలున్నాయని చెప్పడంలో ధైర్యం చేయలేకపోతోంది తాజాగా 35 అత్యవసర ఔషధాల ధరలు తగ్గించినట్లు ప్రకటించింది. అవన్నీ ప్రాణాంతక రోగాలకు వాడే మందులే. నిత్యావసర ఔషధాలే. మధు మేహం, గుండె సంబంధిత వ్యాధులు, యాంటీ బయో టిక్ సహా వివిధ రకాల కీలక ఔషధాలే ఉన్నాయి. కొత్త గా నిర్ణయించిన ఔషధాలు వాటి ధరలు తగ్గిన వైనాన్ని డీలర్లు తమ దుకాణాల్లో వినియోగదారులకు కనిపించేలా బోర్డులుపెట్టాలని జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థకోరింది. ప్రధానంగా పారాసిటమాల్, ఎసిలోఫెనాక్, ట్రిప్సిన్, కైమోట్రిప్సిన్ మెట్‌పార్మిన్, అటోర్వాస్టోటిన్ కాంబినేషన్ టాబ్లెట్‌లు మధుమేహ నియంత్రణ మాత్రల ధరలు కూడా తగ్గాయి. ఔషధాల ధరల నియంత్రణలో సత్ఫలితాలు లేవని గతంలో తెచ్చుకున్న స్టాక్‌ధర తగ్గించి అమ్మితే నష్టంవస్తుందని ఒకసారి, తీరా కొత్తగా సరకు రానందున పాతమాత్రలు పాతధరలు తప్పవంటూ కొన్నాళ్లు... ఆపైన వినియోగదారు తమ ఔషధ వినియోగాన్నే తప్ప ఇతరాలు పట్టించుకోరు. అదే వినియోగదారు కొంప ముంచుతోంది. మధ్యలో నకిలీ ఔషధాలు కూడా మార్కె ట్‌లోకి వచ్చేస్తున్నాయి. అసలైన ఔషధాల పేరిట మరికొన్ని ఔషధాలు మార్కెట్‌లో దొరకుతున్నాయి. వాటి గురించే ఇప్పుడు ఎల్లెడలా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఔషధాల్లో హానికారక పదార్థాలుకానీ, ముడి పదార్థాలో ఒకవేళ కలిసి ఉంటే అవి ప్రాణాంతకం కావొచ్చు. శరీరంలో విషప్రభావాలు కల్పించవచ్చు. నకిలీ మందుల విక్రయంనేరమని తెలిసినా వాటినివ్యాప్తి చేయడం కొందరుపనిగా పెట్టుకుంటారు. అందుకు చాలామంది రోగగ్రస్తులు నమ్మకమైన మందుల షాపులలోనే మందులు కొనుక్కొంటారు. ఎలాంటి మందులు వాడినా డాక్టరు సునిశిత పరిశీలన, రోగవిశ్లేషణ ద్వారానే ఆరోగ్య వంతులు కాగలరు. అందుకే డాక్టరు సలహా సంప్రదింపులు అవసరం అని గుర్తించాలి. ఉత్తరప్రదేశ్‌లో గత యేడాది రూ. 30.77 కోట్ల మేరకు విలువైన డ్రగ్స్‌ను పట్టుకున్నారు. అదే కాలంలో 1166 డ్రగ్ లైసెన్సులు రద్దు చేసి, 68 మందిని అరెస్టు చేశారు. పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లలో 1.4 కోట్ల రూపాయల విలువైన 1.4 కోట్ల టాబ్లెట్స్, 2లక్షల క్యాప్సిల్స్ పట్టుకున్నారు. వీటిలో నకిలీ కొలెస్ట్రాల్ మందులు ఎక్కువగా ఉన్నాయి. సింథటిక్ డ్రగ్స్, మైఫిడ్రోన్, కొకైన్ రోజువాస్ వంటి నకిలీ ఉత్పత్తులను పట్టుకొన్నారు. ఇటీవలనే హైదరాబాద్‌లోని కోఠి ప్రాంతంలో ఇద్దరు హోల్‌సేల్ ఔషధ విక్రేతల నుంచి కొలెస్ట్రాల్ నియంత్రణ మందులను పట్టుకుని డ్రగ్స్ సీజ్ చేశారు. ఈరకం మందులు సీజ్ చేయడం ఇదే తొలిసారని ఔషధ నియంత్రణ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా వాడే మందులకు ప్రత్యామ్నాయంగా చౌకధరకు లభించే జనరిక్ మందులు ఉన్నా ఇతరత్రా ప్రత్యేక ప్రత్యామ్నాయ మందుల కోసం ధరభారం తగ్గుతుందనే ఉద్దేశంతో వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి సందర్భాలలో నేరుగా తక్కువ ధరకే దొరికే జనరిక్ ఉత్పత్తుల ప్రోత్సాహమూ అవసరమే!

> గొప్ప లక్ష్యాన్ని సాధించాలని ప్రయత్నించి విఫలం కావడం నేరం కాదు. గొప్ప లక్ష్యం లేకపోవడం నేరం.



లోవెల్

> కీర్తి అత్తరులాంటిది. పైపైన చల్లుకోవాలే గాని తాగుతూ కూర్చోకూడదు.



హరివంశరాయ్ బచన్

# ప్రజావాక్కు



### అవయవదానంలో ముందంజ

తెలంగాణ రాష్ట్రం మరోసారి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం అభినందనీయం. అవయవదానంలో దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. ఇది రాష్ట్రానికి గర్వకారణంగా మారింది. కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకారం, తెలంగాణ రాష్ట్రం 2024లో అత్యధిక అవయవదానాలు చేసింది. జాతీయ అవయవ మార్పిడి సంస్థ ఈ గణాంకాలను విడుదల చేసింది. జీవితం అనంతరం దానం చేసిన అవయవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. తెలంగాణ ఈ విభాగంలో దేశంలోనే ముందంజలో ఉంది. ఇది సామాజిక చైతన్యానికి నిదర్శనం. రాష్ట్రప్రభుత్వం నడుపుతున్న 'జీవన్ దాన్' కార్యక్రమం కీలకం. ఈపథకం ద్వారా అవయవ దాతల సంఖ్య వేగంగా పెరిగింది. ఇది రాష్ట్ర విజయానికి వెన్నెముకగా నిలిచింది. అవయవదానంలో దేశానికే ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఒక ఉదాహరణగా నిలుస్తోంది.

- కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా

### పరిశుద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాలి

దేశం స్వచ్ఛ భారత్‌వైపు ముందుకు సాగుతూ ఉంది కాబట్టిప్రజలు పరిశుద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా గ్రామస్థాయి నుండి నగరస్థాయి వరకు ప్రజలు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతను ఇవ్వాలి. పారిశుధ్య కార్మికులతో పాటు ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అలాగే బహిరంగ ప్రదేశలైనబస్టాండ్, రైల్వే స్టేషన్, పార్కులు, సినిమా హాళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అలాగే నగర పాలకసంస్థ వారు నగరాన్నిఅందంగా తీర్చిదిద్దాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

### వాహనాల లైటింగ్ తగ్గించాలి

ఒకప్పుడుస్వదేశీఅంబాసిడర్, మారుతి వంటి కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాల వంటి మోటారు వాహనాలు పరిమిత వేగంతో పయనించటమే గాక వాటి హెడ్‌లైట్లపై సగం నల్లరంగు వేయడటమో నల్ల స్టిక్కర్లు అంటించటమో జరిగేది. ఫలితంగా కాంతి అన్ని వైపులా ప్రసరించకుండా ఎదుటి వాహనాలు స్పష్టంగా కనిపించేవి. కనుక ఇకనైనా వాహన తయారీ కంపెనీలు ఎదుటి వాహనాలకు ఇబ్బంది లేని విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలి.

- టి. సాంబశివరావు, గుంటూరు

### పెరిగిన ఫీజులు

ఇటీవలి కాలంలో ఇంజినీరింగ్ కళాశాలలు తమ ఫీజులను భారీగా పెంచబోతున్నారన్న వార్తలు విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది ఇప్పటికే ఆర్థికంగా ఒత్తిడిలో ఉన్న మధ్య తరగతి, పేద కుటుంబాలకు మరింత భారంగా మారుతోంది. కోచింగ్, హాస్టల్, ప్రయాణ ఖర్చులతో విద్యార్థులు ఇప్పటికే తీవ్ర ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు అదనపు ఫీజుభారం వల్ల వారి విద్యను మధ్యలోనే నిలిపేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇంజినీరింగ్ విద్య యువత భవిష్యత్తుకు పునాది. దీన్ని వ్యాపార ఉద్దేశాలతో నడపడం సమాజానికి హానికరం. విద్యను కేవలం ధనవంతులకు పరిమితం చేయడం వల్ల సామాజిక అసమానతలు పెరిగే ప్రమాదం ఉంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఫీజు సమీక్షించాల్సి ఉంటుంది.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### అక్రమ కట్టడాలను నిర్మూలించాలి

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రభుత్వ ఆర్థిక సహకారంతో పేద ప్రజలకు పంచిన ఇళ్ల స్థలాలలో కబ్జాదారులు కన్ను వేసి చాలా గజాలు ఆక్రమించుకోవడం జరుగుతుంది. అక్రమకట్టడాలు నిర్మించడం జరుగుతుంది. కాలనీలలో కొన్ని ఇండ్లస్థలాలు కొనుగోలు అమ్మకాలు జరిగాయి. ప్రభుత్వ రెవెన్యూ రికార్డులలో ఎవరికి ఎంత భూమి ఎంత ఇంటి స్థలం ఉందో రికార్డులు చూపుతున్నాయి. కానీ కబ్జాదారులు ఇళ్ల స్థలాల అక్రమణకు పాల్పడుతున్నారు. దాడులు దౌర్జన్యాలు చేస్తున్నారు. రెవిన్యూ అధికారులకు, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా కూడా ఇలాంటి ఫలితం లేకుండా ఉంటుంది. కనుక రాష్ట్ర రెవిన్యూ శాఖ మండల తహసిల్దార్ ఆధ్వర్యంలో ప్రతి మండల కేంద్రంలో ఉన్న కాలనీలలోఇంటి స్థలాల కొలతలు, సరిహద్దులు, వంటి విషయాలను పరిశీలించి వివాదాలు లేకుండా చూడాలి.

- డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### కనీస సదుపాయాలు కల్పించాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం ద్వారా ఆర్థికాభివృద్ధి సైకిల్ ముందుకు వెళుతుంది. ఇసుక, సిమెంట్, ఐరన్ వంటి సామాగ్రికి డిమాండ్ పెరిగి ఉత్పత్తి పెరుగుతుంది. అంతమాత్రమేకాదు గ్రామాలలో కూలీలకు డిమాండ్ పెరుగుతుంది. ఉత్పత్తి వస్తువుల డిమాండ్ పెరిగేలా చూడడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యం.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# జల సమస్యను రెండు రాష్ట్రాలు పరిష్కరించుకోలేవా?

***కొత్త ట్రిబ్యు నల్ ఏర్పాటు చేయడంవల్ల మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ వాటా పెంచాలని కోరే అవకాశం ఉంది. కాబట్టి, పరస్పర చర్చల ద్వారానే సమస్య పరిష్కరించుకోవాలని నిపుణుల అభిప్రాయం. ఇటీవలిజూలై 16న న్యూఢిల్లీలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి, చంద్రబాబు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో కీలక సమావేశం జరిగింది. కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం, టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకు ఆమోదం, వివాదాల పరిష్కారానికి సమగ్ర ఆలోచనలపై చర్చ లాంటి నిర్ణయాలు వెలువడ్డాయి. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకంపై రాజకీయ లాభనష్టాలకంటే ప్రజల శ్రేయస్సు ముఖ్యం. నదీజలాలు భవిష్యత్ తరాలకు ప్రాణాధారం. అందుకే పారదర్శకత, శాస్త్రీయత, సమాఖ్య స్ఫూర్తితో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొత్త కమిటీపై ప్రజలు ఆశగా చూస్తు న్నారు. ఇది శాశ్వత పరిష్కారానికి తొలి అడుగు కావాలని కోరుకుందాం.***



మన్నారం నాగరాజు

పంతొమ్మిది వందల యాభై ఆరులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యాక వ్యవసాయ అభివృద్ధిలో సాగునీటికి ప్రాధాన్యం పెరిగింది. రాష్ట్ర భౌగోళిక నిర్మాణం, సముద్ర తీర ప్రాంతం, నదుల సమృద్ధి, జనాభాలో 72.7 గ్రామీణులు వ్యవసాయంపై ఆధారపడటంతో సాగునీటి అవసరం స్పష్టమైంది. రాష్ట్రంలో సుమారు 40 శాతం పంట భూమి సాగునీటి ఆధారితంగా ఉండగా, అందులో 95శాతం వరి పంటకే ఉపయోగపడుతోంది. స్వాతంత్ర్యం తరువాత ఇంజినీర్లు, ఆర్థికవేత్తలు, వాతావరణ నిపుణులు కలిసి సాగునీటి ప్రాజెక్టులపై సమగ్ర ప్రణాళికలు రూపొందించారు. బ్రిటిష్ కాలంలో నిజాం సాగర్, ప్రకాశం బ్యారేజ్, సర్ ఆర్థర్ కాటన్, గోదావరి డెల్టా వంటి కొన్ని ప్రాజెక్టులే ఉండగా, 1956 తర్వాత నాగార్జునసాగర్, శ్రీరాం సాగర్, సోమశిల వంటి మేజర్ ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి. గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్న నదులపై అనేక ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి. 2000-01 నాటికి 45.27లక్షల హెక్టార్లకు సాగునీరు అందించబడింది. ఉపరితల జలాలు, భూగర్భ జలాలపై ఆధారపడే ఈ వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల పాత్ర ఉంది. అయితే సాగునీటి వనరుల వినియోగంలో సమర్థత, సమాన పంపిణీ, పర్యావరణ పరిరక్షణపై చర్చ అవసరం. రాష్ట్రాల మధ్య గోదావరి జలాలపై ఉన్న వివాదాలపై 1980లో ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఆధారంగా శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ద్వారా 6.5 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించబడింది. మిగతా ప్రాజెక్టుల వ్యయాల్లో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఉదాహరణకు, శ్రీరాంసాగర్ వ్యయం రూ. 4,010 లక్షల నుండి రూ.31,800 లక్షలకు పెరిగింది. 2008 నాటికి 20ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. పోలవరం, తెలుగు గంగ, నెట్టెంపాడు, కల్వకుర్తి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు లక్షల హెక్టార్ల భూమికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో కొనసాగుతున్నాయి. తెలుగు గంగప్రాజెక్టు ద్వారా చెన్నై నగరానికి తాగునీరు, 2.3లక్షల హె.కి సాగునీరు అందించబడుతోంది. చిన్నతరహా వనరుల అభివృద్ధి కూడా గణనీయంగా జరిగింది. 2000-01 నాటికి 20.3 లక్షల చిన్న వనరులు అందుబాటులో ఉన్నాయి. అయితే భూగర్భజలాల అధిక వినియోగం, చెరువుల పూడిక సమస్య, నిర్వహణ లోపాలు సాగు సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. చివరిగా, సాగునీటి రంగంలో మౌలిక మార్పులకు దోహదపడే విధంగా సమగ్ర ప్రణాళికలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తూ, మధ్యతరహా ప్రాజెక్టులకు, చిన్నవనరుల అభివృద్ధికి దృష్టి సారించాలి. నిక్షిప్త వనరులను సమర్థవంతంగా వినియోగించేం




దుకు శాస్త్రీయ ధోరణిలో ముందుకెళ్లాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదం దశాబ్దకాలంగా కొనసాగుతోంది. 2014 రాష్ట్ర విభజన జరిగినప్పటికీ, కృష్ణా, గోదావరి నదుల్లో నీటి పంపకంలో స్పష్టత లేకపోవడం, ప్రాజెక్టులపై అనుమతుల కలిగించకపోవడం, కేంద్ర ప్రభుత్వ జోక్యం స్పష్టంగా లేకపోవడం వల్ల సమస్య మరింత సంక్లిష్టమవుతోంది. తెలంగాణ ఏర్పాటైనప్పుడు రాష్ట్రానికి కృష్ణానదిలో తగిన వాటా లభించకపోవడం అన్యాయం అని భావించింది. ఉమ్మడి రాష్ట్రంలో మహబూబ్‌నగర్, నల్గొండ వంటి జిల్లాలు త్రాగునీటి కష్టాలు ఎదుర్కొనడం, సాగు నీటి అవసరాలు తీరకపోవడం విశేషంగా ప్రస్తావించబడింది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌ద్వారా జరిగిన నీటి కేటాయింపులు తెలంగాణ రాష్ట్రం ఆమోదించలేదు. ఆ తీర్పుపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలై ఉంది. కేంద్రం మాత్రం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం వ్యవహరించాలని అభిప్రాయపడుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను విస్తరించడంతో, కృష్ణా బేసిన్ వెలుపల నీటిని తరలించే ప్రణాళికలు ప్రారంభమయ్యాయి. 2020లో రాయలసీమ ఎత్తిపోతల పథకంకి జీవో 203 ద్వారా రూ.24000 కోట్లు మంజూరు చేయడం తెలంగాణ తీవ్ర వ్యతిరేకతను కలిగించింది. ఇది కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అభిప్రాయానికి విరుద్ధంగా ఉన్నా, కేంద్రం చర్యలు తీసుకోలేకపోయింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, సీతారామ, దేవాదుల వంటి గోదావరి ప్రాజెక్టులను కేంద్రం కొత్త ప్రాజెక్టులుగా గుర్తించి, డిపిఆర్‌లు సమర్పించమని కోరడం రాష్ట్రాన్ని నిరాశకు గురిచేస్తోంది. అవి 2014 కు ముందే ప్రారంభమైన ప్రాజెక్టులని తెలంగాణవాదిస్తోంది. మరోవైపు, కేంద్రం ఈ ప్రాజెక్టులకు సాంకేతిక సలహాకమిటీ ఆమోదం లేకుండా ముందుకెళ్లవద్దని సూచిస్తోంది. గోదావరి నదిపై ఇప్పటికే బచావత్ అవార్డు, జిడబ్ల్యుడిటి, కెడబ్ల్యుడిటి1 వంటి జలపంపక అవార్డులు ఉన్నాయి. కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడంవల్ల మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ వాటా పెంచాలని కోరే అవకాశం ఉంది. కాబట్టి, పరస్పర చర్చల ద్వారానే సమస్య పరిష్కరించుకోవాలని నిపుణుల అభిప్రాయం. ఇటీవలిజూలై 16న న్యూఢిల్లీలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి, చంద్రబాబు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో కీలక సమావేశం జరిగింది. కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం, టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకు ఆమోదం, వివాదాల పరిష్కారానికి సమగ్ర ఆలోచనలపై చర్చ లాంటి నిర్ణయాలు వెలువడ్డాయి. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకంపై రాజకీయ లాభనష్టాలకంటే ప్రజల శ్రేయస్సు ముఖ్యం. నదీజలాలు భవిష్యత్ తరాలకు ప్రాణాధారం. అందుకే పారదర్శకత, శాస్త్రీయత, సమాఖ్య స్ఫూర్తితో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొత్త కమిటీపై ప్రజలు ఆశగా చూస్తు న్నారు. ఇది శాశ్వత పరిష్కారానికి తొలి అడుగు కావాలని కోరుకుందాం. ●

# మానవతా విలువలు పెంచే విద్య కావాలి

సోరుపాక అనిల్ కుమార్

తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్థుల స్థాయిలో, చదువుల ఒత్తిడికి తట్టుకోలేక ఎంతోమంది యువత జీవితం మీద ఆశ కోల్పోతున్నారు. ప్రతి సంవత్సరం పది, ఇరవైకాదు, వందల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఈ దారుణ వాస్తవం మన సమాజం, విద్యా వ్యవస్థ, తల్లిదండ్రుల బాధ్యతా భావాన్ని ప్రశ్నించే స్థితికివచ్చింది. చదువు అనే పవిత్రమైన పదం ఇప్పుడు విద్యార్థులకు భయపదకంగా మారింది. జీవితాన్ని వెలిగించాల్సిన విద్య, ఎందుకు చీకట్లో ముంచుతోంది? ఒక విద్యార్థి ఉదయం నాలుగు గంటలకే లేచి, రాత్రి పది గంటల వరకు ఒక మెషీన్లా చదివే విధంగా షెడ్యూల్ చేస్తే అతని వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, భావోద్వేగాల స్థానమే ఎక్కడ ఉంది? అతని ఆనందం, కలలు, విశ్రాంతి అన్నీ పాఠ్యపుస్తకాల మధ్య రేకుల్లా తుడిచిపెట్టినట్లు పోతున్నాయి. చదువు అనేది నేర్చుకోవడం కోసం, జీవన నైపుణ్యాల కోసం ఉండాలి. కానీ అది ఇప్పుడు గడియారాన్ని లెక్కపెట్టి బాధగా మారింది. ప్రత్యేకించి ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు వారి 100 రిజల్ట్ స్టేట్ టాపర్ మా కళాశాల నుంచే అనే ప్రకటనల కోసం విద్యార్థుల జీవితాన్ని సర్వస్వంగా వాడుకుంటున్నాయి. పబ్లిక్ ప్రాపర్టీ కంటే తక్కువ స్థాయిలో కూడా విద్యార్థులను గౌరవించకపోవడం, వారిని టార్గెట్ ర్యాంక్ల కోసం ఒత్తిడికి గురిచేయడం, మానవ సంబంధాలే లేకుండా ఒక పరీక్షల యంత్రంగా మలచడం ఇవన్నీ విద్య అనే మహత్తరమైన భావనను మట్టికరిపిస్తున్నాయి. నువ్వు ఈ టెస్టులో పాస్ కాకపోతే తల్లిదండ్రులకు ఫోన్ చేస్తాం, తక్కువ మార్కులు వస్తే వర్క్ సెక్షన్లో పెట్టేస్తాం, మరెక్కడైనా అడ్మిషన్ తీసుకోరు వంటి బెదిరింపులు ఇవే వారి భవిష్యత్తు నిర్మించాల్సిన గురువుల మాటలైతే, విద్యార్థులు దిక్కుతోచని స్థితిలోకి ఎందుకు వెళ్లరు? అంతేకాదు, తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశాలు పరిమితమయ్యాయి. విద్యార్థుల అనుభవాలు, భావోద్వేగాలు, అభిరుచులు అన్నీ అణగిపోతున్నాయి. సమస్య చెప్పుకునే వేదిక లేదు. నాలో ఏదో తేడా



ఉంది, నేను ఎందుకు ఇతరుల్లా చదవలేకపోతున్నాను? అనే స్వీయ సందేహాలు విద్యార్థులను మానసికంగా నశింపజేస్తున్నాయి. ఇవన్నీ కలిసినప్పుడు ఒక విద్యార్థికి అసలు బతకాల్సిన ఉత్సాహం మిగలదు. అది జీవితానికి శాపంగా మారుతుంది. మనం ఒక యుగాన్ని నిర్మించాలనుకుంటున్నాం కానీ చదువు పేరుతో మనం ఆ యువతని నాశనం చేస్తున్నాం. ఇది వ్యక్తిగతంగా ఒక్కరి బాధ కాదు, సమాజం మొత్తానికి ఒత్తిడిగల హెచ్చరిక. ఒక విద్యార్థి ఆత్మహత్య వెనక ఒక్క పరీక్ష ఫెయిలు కాదు, కళాశాల ఒత్తిడి, తల్లిదండ్రుల అంచనాలు, గురువుల విమర్శలు, మానసిక ఒంటరితనం అన్నీ కలిసివుంటాయి. నీవు సరిగా చదవడం లేదనిపిస్తోంది. మా గౌరవాన్ని నాశనం చేస్తున్నావు, నీ వల్ల నేను మిగిలిన తల్లిదండ్రుల ముందు తలవంచుకోవాలి. ఇవన్నీ ప్రేమగా చెప్పిన మాటలు కావచ్చు, కానీ ఒక్క పిల్లోడి మనసులో అవి ఏ పిరికితనాన్ని పెంచుతున్నాయో మనం ఊహించలేము. చదువు అనేది ఎప్పటికీ ఒత్తిడిగా ఉండకూడదు. విద్యార్థులు బలంగా, ఆనందంగా, స్వేచ్ఛగా ఎదగాలంటే చదువును మానవతా విలువలతో కలిపి పోషించాల్సిన అవసరం ఉంది. ప్రతి కళాశాలలో మానసిక కౌన్సిలింగ్ ఉండాలి. విద్యార్థి పరీక్షల్లో విఫలమయ్యాడంటే ఇంకోసారి ప్రయత్నించు అనే శబ్దం వినిపించాలి. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లలను లక్ష్యాల కోసం ఉపయోగించే టూల్స్‌లా కాకుండా, మనుషులుగా చూడాలి. మార్కుల కన్నా ముందు మనిషిత్వం, విజ్ఞానం కన్నా ముందు విశ్వాసం అవసరం. ఒక్క పరీక్షలో ఫెయిలైతే జీవితమంతా ఫెయిలైపోయినట్టు భావించే దశకు విద్యార్థిని తీసుకెళ్లొద్దు. మనమందరం కలిసి ఈ విద్యా వ్యవస్థను పునరాలోచించాలి. విద్యార్థి మానవ హక్కులను కాపాడాలి. మనోబలాన్ని, వ్యక్తిత్వాన్ని పెంచేలా విద్యను రూపుదిద్దాలి. చదువు అనేది ఒక వేదం అది చైతన్యానికి, అభివృద్ధికి మార్గం చూపాలి. కానీ అదే వేదం ఒక మృత్యు సమచారంగా మారడం అత్యంత భయంకరమైనదిగా మారకూడదు. మనం విద్యార్థిని పుస్తకాల్లో కూర్చోపెట్టి పరీక్షల బలిగొంపులో నెట్టకూడదు. మనం ఒక జీవితాన్ని బ్రతికించాలి. ఒక్క పరీక్ష ఓటమి కాదు ఒక జీవితానికే తలవంచే సందర్భం కూడా కాదు. అందుకే, ఇప్పుడు ఓ మార్పు అవసరం. మరింత ఆలస్యం చేస్తే మరో విద్యార్థి కలలు చిత్తుగా మారతాయి. పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంది. ●

# అమెరికాను సంపన్న దేశంగా మారుస్తున్న భారతీయులు

మేకిరి దామోదర్


ఆధునిక టెక్నాలజీ ఫలితంగా ప్రపంచమే ఓ 'కుగ్రామంగా' మారింది. దీనితో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో విశ్వవ్యాప్తంగా తెలుస్తోంది. మన భారతీయులు ప్రపంచంలోని అనేక దేశాల్లో స్థిరపడి రాజకీయ, సాంకేతిక, వ్యాపార రంగాల్లో ఆర్థికంగా కుబేరులుగా ఎదిగి ఆయా దేశాల్లో పాలకులై, ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వారి ప్రగతి చూస్తూ మా వాళ్లని పొంగిపోతున్నారు. మనవారెక్కడున్నా జన్మభూమి రుణం తీర్చుకోవడం, మూలాలను విస్మరించకుండా మనవాళ్లను తరతరాలుగా పట్టిపీడిస్తున్న పేదరికం, ఉపాధి లేమి, నిరుద్యోగం తదితర సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి తోడ్పడాల్సిన బాధ్యతల గురించి తెలుసుకుందాం. అంతర్జాతీయ వ్యాపార దిగ్గజాలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ వినూత్న వ్యూహాలతో సంపదను పెంచుకున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల సంఖ్య2025 లో 3028కి పెరగడం ఇందుకు నిదర్శనం. వీరి మొత్తం సంపద విలువ 16.1లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. 2025 జూలైకు సంబంధించి ఫోర్బ్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం..ఎలాన్ మస్క్ ప్రపంచ అగ్రగామి కుబేరుడుగా కొనసాగుతున్నారు. 2024 మేలో 400 బి. డాలర్ల మైలురాయిని అధిగమించిన తొలి కుబేరుడుగా నిలిచి మస్క్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ప్రపంచ అగ్రగామి 10 మంది కుబేరుల సంపద విలువ జూన్ 1 నాటికి 100 బిలియన్ డాలర్లకు అధికమై 2లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది ఇలా ఉంటే ప్రపంచ కుబేరుల జాబితాలో దశాబ్దాలుగా అగ్రస్థానంలో కొనసాగిన మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఇప్పుడు టాప్ 10 జాబితాలో స్థానం కోల్పోయారు. ఆయన చేసిన భారీ దానధర్మాల కారణంగా ప్రపంచ సంపద గణనలో జరిగిన మార్పులతో ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రపంచ కుబేరుల జాబితాలో ఐదో స్థానంలో ఉన్న ఆయన ఏకంగా 12వ స్థానానికి పడిపోయారు. దాదాపు 116 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో 15వ స్థానంలో ముఖేష్ అంబానీ ఉన్నారు. వంద బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8.85 లక్షల కోట్ల) క్లబ్‌లో ఉన్న ఏకైక ఆసియావాసి ఈయనే. అమెరికాలోని సంపన్న భారతీయులు 43 దేశాలకు చెందిన 125 మంది బిలినీయర్లలో మన వాళ్లే 12 మంది. అగ్రస్థానంలో జయ చౌధ్రీ, తొలిసారిగా సుందర్ పిచాయ్, సత్య నాదెళ్లకు చోటు దక్కింది. అమెరికాను ప్రవాస భారతీయులు మరింత సంపన్న దేశంగా మారుస్తున్నారు. ఫోర్బ్స్ జాబితా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోంది. మొత్తం 43 దేశాలకు చెందిన 125 మంది ప్రవాస బిలియనీర్లు అమెరికాలో ఉన్నట్టు ఫోర్బ్స్ గుర్తించింది. వీరిలో 12 మంది భారతీయులే ఉన్నారు. ఈ సంఖ్య పరంగా ఇజ్రాయిల్‌ను మన దేశం అధిగమించింది. ఈ జాబితాలోని 10దేశాల ప్రవాస బిలియనీర్లలో మూడవ వంతు మంది భారత్‌కు చెందిన వారున్నారు. ఇజ్రాయిల్, తైవాన్, కెనడా, చైనా మరో 5 దేశాలకు చెందినవారు ఉన్నారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యా



నాదెళ్ల, నికేశ్ అరోరా తొలిసారిగా ఈ జాబితాలో చేరారు. అగ్రస్థానంలో 17.9 బి. డాలర్ల సంపదతో జయ్ చౌధ్రీ (65) అగ్రస్థానంలో ఉన్నారు. 1980 ప్రాంతంలో యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటిలో చేరడం కోసం తొలిసారిగా విమానం ఎక్కిన ఈయన 2008లో స్కాలర్ అనే సైబర్ సెక్యూరిటీ సంస్థను ఏర్పాటు చేశారు. 2018లో నాస్ డాక్‌లో లిస్ట్ అయిన ఈ కంపెనీలో ఆయనకు, ఆయన కుటుంబానికి 40 శాతం వాటా ఉంది. హిమాలయాల్లోని చిన్న గ్రామం ఈయన స్వస్థలం. 8వ తరగతి వరకు ఆ ఊరికి విద్యుత్, పదవ తరగతి వరకు సురక్షిత నీటిసరఫరాలేదు. అటువంటి ప్రాంతం నుంచి వచ్చి అమెరికాలో చదువుకుని, ఉద్యోగంలో చేరిన ఆయన.. తర్వాత తన భార్యతో కలిసి సెక్యూర్ ఐటి అనే అంకురాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత బిలియనీర్ గా మారగలిగారు. ఈ జులై నాటికి 1బిలియన్ డాలర్ల (రూ.8550 కోట్ల) కంటే అధిక సంపద ఉన్నవారితో ఈ జాబితాను ఫోర్బ్స్ ప్రకటించింది. ఇది ఇలా ఉంటే భారత దేశంలో గత ఏడాది 2024 పై యూబీఎస్ నివేదిక మేరకు 39 వేల మంది కొత్త మిలియనీర్లు అవతరించారు. అంత క్రితం ఏడాదితో పోలిస్తే వీరి సంఖ్య 4.4శాతం వృద్ధి చెందడంతో ప్రపంచవ్యాప్తంగా మిలియనీర్ల సంఖ్య వృద్ధి విషయంలో భారత్ నాలుగో స్థానంలో ఉందని, యుబీఎస్ గ్లోబల్ వెల్త్ రిపోర్ట్ వెల్లడించింది. తొలి మూడు స్థానాల్లో తుర్కియే, యూఏఈ, రష్యా ఉన్నాయి. మొత్తం 9,17,000మంది మిలియనీర్ల (కనీసం 10లక్షల డాలర్లు రూ. 8.5 కోట్ల సంపద ఉన్నవారు)లో బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా కంటే మెరుగ్గా భారత్ ఉంది. అయితే చైనా 63లక్షల మంది మిలియనీర్లతో అగ్రస్థానంలో ఉంది. మొత్తం 56 దేశాల నుంచి సమీకరించిన సమాచారం ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం అమెరికా, మెయిన్ ల్యాండ్, చైనా చేతిలోనే సగానికి పైగా వ్యక్తిగత సంపద ఉంది. ప్రపంచ సంపదలో భారత్ వాటా 3.4శాతమే. ఆదాయ వృద్ధి తక్కువ, గత ఐదేళ్లుగా సగటు ఆదాయం వృద్ధి విషయంలో అట్టడుగు స్థానాల్లో ఉన్న ఆరు దేశాల్లో భారత్ కూడా ఒకటి. వచ్చే 25 ఏళ్లలో సంపద గరిష్టంగా బదలీ అయ్యే దేశాల్లో భారత్ కూడా ఒకటిగా మారుతుంది. ఈ దేశంలో ఉన్న యువ జనాభా కారణంగా ఒక తరం నుంచి మరో తరానికి సంపద బదలీ అవుతుంది. మన దేశ వ్యక్తిగత సంపదలో అగ్రగాములు అంబానీ వారసులే. దేశంలో వ్యక్తిగత సంపద విలువ రూ.1,000కోట్లకు మించిన వాణిజ్యవేత్తలతో 360 వెల్త్ వన్ సంస్థ రూపొందించిన జాబితాలో అగ్రస్థానంలో ముఖేష్ అంబానీ వారసులు నిలిచారు. తొలితరం పారిశ్రామికవేత్తలతో పాటు వారసత్వంగా వచ్చిన వ్యాపార సామ్రాజ్యాలను మరింతగా విస్తృతం చేసిన వారు ఈ జాబితాలో చోటు చేసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులుగా మన భారతీయులు(తెలుగు)వారు కొనసాగుతున్నారు. వీరి మూలాలైన తాత, ముత్తాతలు, వీరికి ఆ స్థాయిని కల్పించిన జన్మభూమి భారత దేశానికి తమ వంతు బాధ్యతతో సేవలు అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈదేశంలో పేదరికం, అసమానతలు ఉపాధి లేమి, నిరుద్యోగం లాంటి సామాజిక రుగ్మతలను రూపుమాపాల్సిన అవసరం ఉంది. వారి సేవలను స్వాగతించుకుంటూ భారత ప్రభుత్వం తోడ్పాటుతో పరిశ్రమలు పెట్టడానికి సౌకర్యం కల్పించి సద్వినియోగపరుచుకోవాల్సినబాధ్యత కూడా మెండుగా ఉంది. దాతృత్వంతో మన దేశంలోనిపేదరికాన్ని రూపుమాపి సోదర భారతీయుల కళ్ళల్లో ఆనందం తోపాటు దేశప్రతిష్టను పెంచడంలో ఉన్న సంతృప్తి వెలకట్టలేనిది. ప్రవాస భారతీయకుబేరులు జన్మభూమి రుణం తీర్చుకోవడంలో ఇదే శ్రేష్ఠమైన కార్యంగా భావించాలి. ●

# ఆధిపత్యం కోసమే అమెరికా సుంకాలు

## బ్రిక్స్‌దేశాలు మాకు అండగా ఉన్నాయి: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్



మాస్కో, ఆగస్టు 5: గ్లోబల్ సౌత్ దేశాలపై ఆధిపత్యాన్ని చెలాయించేందుకు అమెరికా ఆధునిక వలసవాద విధానాన్ని అనుసరిస్తోందని రష్యా మండిపడింది. సుంకాలు, ఆంక్షలు చరిత్ర సహజ గమనాన్ని మార్చలేవని పేర్కొంది. అంతర్జాతీయ వేదికపై స్వతంత్ర మార్గాన్ని ఎంచుకునే దేశాలపై అమెరికా రాజకీయ ప్రేరేపితమైన ఆర్థిక ఒత్తిడికి గురిచేస్తోందని విమర్శించింది. అభివృద్ధి చెందుతున్న, ఆర్థికంగా వెనుకబడిన (గ్లోబల్ సౌత్) దేశాలతో సహకారాన్ని పెంపొందించుకోవడానికి, నిజమైన బహుళపక్ష వాదం, సమానత్వంతో కూడిన ప్రపంచ వ్యవస్థ సాకారానికి కృషి చేసేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డజన్ల కొద్దీ దేశాలపై సుంకాలను విధించిన కొన్ని రోజుల తర్వాత మాస్కో నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఆయా దేశాలపై ఆంక్షలు విధించడం దురదృష్టకరం. అంతర్జాతీయ వేదికపై తన ఆధిపత్యం క్షీణించడాన్ని అమెరికా అంగీకరించలేకపోతోంది. ఈ నేపథ్యంలో తన స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ఆధునిక వలసవాదాన్ని అనుసరిస్తోంది. తనను అనుసరించేందుకు నిరాకరిస్తున్న, స్వతంత్ర మార్గాన్ని ఎంచుకునే దేశాలపై రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు చేస్తోంది. గ్లోబల్ సౌత్ దేశాల సార్వభౌమాధికారంపై ప్రత్యక్ష ఆక్రమణ, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నం చేస్తోందని రష్యా రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా తెలిపారు. ఏ సుంకాల యుద్ధాలు, ఆంక్షలు చరిత్ర సహజ గమనాన్ని ఆపలేవని తాము దృఢంగా విశ్వసిస్తున్నామని మరియా తెలిపారు. తమకు పెద్ద సంఖ్యలో భాగస్వాములు, సారూప్యత కలిగిన మిత్ర దేశాలు, గ్లోబల్ సౌత్ దేశాలు, అన్నింటికంటే ముఖ్యంగా బ్రిక్స్ దేశాలు మద్దతు ఇస్తున్నాయని పేర్కొన్నారు. చట్టవిరుద్ధమైన ఏకపక్ష ఆంక్షలను ప్రతిఘటించడానికి మాస్కో సిద్ధంగా ఉందని అన్నారు. పాశ్చాత్య దేశాలు ఒకప్పుడు ప్రోత్సహించిన స్వేచ్ఛా వాణిజ్య రంగంలో ప్రస్తుతం నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ ప్రేరేపిత రక్షణావాదం, సుంకాల అవరోధాలు ఏర్పడుతున్నా యని స్పష్టం చేశారు. కాగా, భారత్‌పై సోమవారం మరోసారి అక్కసు వెళ్లగక్కారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. గత వారం ప్రకటించిన 25 శాతం సుంకాల వడ్డింపుతో తాను ఆగబోవడం లేదని, ముున్ముందు వీటిని ఇంకా పెంచబోతున్నట్లు హెచ్చరించారు. రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తూ విపణిలో భారీ లాభాలకు విక్రయిస్తున్న భారత్‌పై గణనీయ స్థాయిలోనే సుంకాలు పెంచబోతున్నట్లు బెదిరించారు. రష్యాతో యుద్ధంలో ఎంత మంది ఉక్రెయిన్ పౌరులు ప్రాణాలు కోల్పోయినా భారత్ పట్టించుకోవడం లేదని, అందుకే ఆ దేశంపై గణనీయంగా సుంకాలు పెంచుతానని స్పష్టం చేశారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై అమెరికా, ఈయూ దేశాల అభ్యంతరాలను భారత్ గట్టిగా తిప్పికొట్టింది. యూఎస్, ఈయూ తమను లక్ష్యంగా చేసుకోవడంపై విరుచుకుపడింది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా నుంచి చమురు దిగుమతులను యూఎస్ ప్రోత్సహించిందని ఎద్దేవా చేసింది. ఉక్రెయిన్ ఘర్షణ అనంతరం అంతర్జాతీయ విపణిలో తలెత్తిన పరిస్థితుల వల్లే దేశీయ ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. దేశ ప్రయోజనాల కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. తమను విమర్శించే దేశాలు రష్యాతో వాణిజ్యంలో అవసరం లేకపోయినప్పటికీ, మాస్కోతో వాణిజ్యంలో మునిగిపోతున్నాయని భారత విదేశాంగ మంత్రిత్వ విమర్శించింది.



## జమ్ముకాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత

న్యూఢిల్లీ, ఆగస్టు 5: భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సీనియర్ నేత, జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ (79) కన్నుమూశారు. దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసి ఆయన దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచారు. సుదీర్ఘకాలం అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తుదిశ్వాస విడిచారు. 1960వ దశకంలో మీరట్‌లో విద్యార్థి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సత్యపాల్ మాలిక్, ఐదు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలోనే గడిపారు. ఉత్తరప్రదేశ్ శాసనసభ్యుడిగా, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పర్యాటక శాఖ సహాయ మంత్రిగా పలు ఉన్నత పదవులను ఆయన అలంకరించారు. కాంగ్రెస్, జనతాదళ్, బీజేపీ వంటి పలు పార్టీలలో పనిచేసిన అనుభవం ఆయన సొంతం. ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైన, చరిత్రాత్మకమైన ఘట్టం జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసిన కాలం. 2018 నుంచి 2019 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. కశ్మీర్‌కు గవర్నర్‌గా వ్యవహరించిన సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రశంసలతో పాటు విమర్శలను కూడా ఎదుర్కొన్నాయి. జమ్మూకశ్మీర్‌తో పాటు బీహార్, గోవా, మేఘాలయ రాష్ట్రాలకు కూడా సత్యపాల్ మాలిక్ గవర్నర్‌గా సేవలందించారు. గవర్నర్ పదవిలో ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై, ముఖ్యంగా రైతుల హక్కుల కోసం ఆయన తరచూ గళం విప్పేవారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను బహిరంగంగా విమర్శించి సంచలనం సృష్టించారు. తన చివరి రోజుల్లో క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, సామాజిక న్యాయం, బడుగు వర్గాల సంక్షేమంపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ మార్గనిర్దేశం చేశారు.



## రష్యా తరఫు యుద్ధంలో పాక్, చైనా కిరాయి సైనికులు!

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

కీవ్, ఆగస్టు 5: రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఉక్రెయిన్ కీలక ఆరోపణలు చేసింది. తమ దళాలు మాస్కో సైనికులతోపాటు పాకిస్థాన్, చైనాకు చెందిన కిరాయి సైనికులతో కూడా పోరాడాల్సి వస్తుందని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను పాక్ ఖండించింది. వోవ్‌చాన్స్క్ ప్రాంతంలోని సైనిక దళాలతో భేటీ అయినట్లు జెలెన్‌స్కీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఫ్రంట్‌లైన్‌లోని కమాండర్ల గురించి, ఆ ప్రాంతంలోని రక్షణ వ్యవస్థల గురించి వారితో మాట్లాడినట్లు తెలిపారు. డ్రోన్ సరఫరాలు పెంచడం, దళాల నియామకం, బ్రిగేడ్‌లకు ప్రత్యక్ష నిధులపై కూడా చర్చించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా చైనా, తజకిస్థాన్, పాకిస్థాన్‌తో సహా ఆఫ్రికన్ దేశాల నుంచి వస్తున్న కిరాయి సైనికులు యుద్ధంలో పాల్గొంటున్నట్లు తమ దళాలు గుర్తించాయన్నారు. దీనికి తమ ప్రతిస్పందన గట్టిగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా యుద్ధంలో పాల్గొని దేశానికి సేవ చేస్తున్న దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## లాస్‌ఏంజెల్స్‌లో మళ్లీ కాల్పులు: ఇద్దరు మృతి, ఆరుగురికి తీవ్రగాయాలు



లాస్ ఏంజెల్స్, ఆగస్టు 5: అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. లాస్ ఏంజెలెస్ నగరంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఓ పార్టీలో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. లాస్ ఏంజెలెస్ పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఎల్‌ఏపీడీ) తెలిపిన వివరాల ప్రకారం, డౌన్‌టౌన్ లాస్ ఏంజెలెస్‌లోని 14వ ప్లేస్, పలోమా స్ట్రీట్ సమీపంలోని ఓ గిడ్డంగిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వారాంతంలో జరిగిన హార్డ్ సమ్మర్ మ్యూజిక్ ఫెస్టివల్ అనంతరం ఈ ఆఫ్టర్ పార్టీని ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. సోమవారం తెల్లవారుజామున 1 గంట సమయంలో పార్టీలో కాల్పులు జరిగినట్టు సమాచారం అందడంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆసక్తికరంగా, కాల్పులు జరగడానికి కొన్ని గంటల ముందే, అంటే ఆదివారంరాత్రి 11 గంటల సమయంలోనే పోలీసులు ఈ పార్టీ జరుగుతున్న ప్రదేశానికి వచ్చారు. అనుమతి లేకుండా 50 మందికి పైగా పార్టీ చేసుకుంటున్నారని గమనించి, ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ సమయంలో తుపాకీ కలిగి ఉన్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, పార్టీని ఖాళీ చేయించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే, వారు వెళ్లిన కొద్ది గంటలకే అదే ప్రదేశంలో ఈ దారుణం జరిగింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, తుపాకీ గాయాలతో పడి ఉన్న ఎనిమిది మందిని గుర్తించారు. వారిలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, 52 ఏళ్ల మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. బాధితుల వయసు 26 నుంచి 62 ఏళ్ల మధ్య ఉంటుందని చెప్పారు. ఈ దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని, నిందితుల గురించి ఎటువంటి సమాచారం లేదని లాస్ ఏంజెలెస్ పోలీస్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది.

## దశాబ్దాలపాటు పాకిస్థాన్‌కు ఆయుధ సరఫరాచేసిన అమెరికా

### పాతకాలం నాటి క్లిప్పింగ్‌తో ఎండగట్టిన ఈస్టర్న్ కమాండ్

న్యూఢిల్లీ, ఆగస్టు 5: అమెరికాతో భారత్ వాణిజ్య సంబంధాల విషయంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో, భారత సైన్యం పరోక్షంగా చురకలంటించింది. ఉగ్రవాదులకు స్వర్గధామమైన పాకిస్థాన్‌కు అమెరికా దశాబ్దాల పాటు ఎలా ఆయుధాలు సరఫరా చేసిందో గుర్తుచేస్తూ ఒక పాత వార్తాపత్రిక కథనాన్ని సోషల్ మీడియాలో పంచుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పోస్ట్ ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత సైన్యంలోని ఈస్టర్న్ కమాండ్, మంగళవారం "ఆ రోజు... ఈ రోజు 1971 ఆగస్టు 5" అనే శీర్షికతో 1971 నాటి ఒక ఆంగ్ల పత్రిక క్లిప్పింగ్‌ను షేర్ చేసింది. 1954 నుంచి పాకిస్థాన్‌కు 2 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఆయుధాలు అనే శీర్షికతో ఉన్న ఆ కథనం, బంగ్లాదేశ్ విమోచన యుద్ధం జరిగిన 1971 వరకు పాకిస్థాన్‌కు అమెరికా ప్రధాన ఆయుధ సరఫరాదారుగా ఎలా కొనసాగిందో వివరిస్తోంది. భారత్ రష్యా నుంచి రాయితీ ధరకు చమురు కొనుగోలు చేయడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కారణంగా భారత్‌పై భారీగా సుంకాలు విధిస్తామని, జరిమానా వేస్తామని హెచ్చరించారు. రష్యా యుద్ధ యంత్రం వల్ల ఉక్రెయిన్‌లో ఎంతమంది చనిపోతున్నా భారత్ పట్టించుకోవడం లేదు. అందుకే భారత్ అమెరికాకు చెల్లించే సుంకాలను నేను గణనీయంగా పెంచుతానని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. గట్టిగా బదులిచ్చిన భారత్ ట్రంప్ వ్యాఖ్యలపై భారత విదేశాంగశాఖ తీవ్రంగా స్పందించింది. అమెరికా ఆరోపణలు అన్యాయమైనవి, అహేతుకమైనవని తిప్పికొట్టింది. ఉక్రెయిన్ సంక్షోభం ప్రారంభమైనప్పుడు రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునేలా అమెరికాయే చురుకుగా ప్రోత్సహించిందని గుర్తు చేసింది. అంతేకాకుండా, అమెరికా, ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాల రెండు నాల్కల ధోరణిని భారత్ ఎండగట్టింది. అమెరికా ఇప్పటికీ తన అణువిద్యుత్ కేంద్రాల కోసం రష్యా నుంచి యురేనియం హెక్సాఫ్లోరైడ్‌ను దిగుమతి చేసుకుంటోందని, కానీ భారత్‌ను విమర్శించడం సరికాదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, భారత సైన్యం అమెరికా పాకిస్థాన్ పాత బంధాన్ని గుర్తుచేయడం దౌత్యవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## అమెరికా నిర్ణయం.. ఐరోపాకు ప్రాణసంకటం

### అణుఒప్పందం నుంచి వైదొలగిన రష్యా


మాస్కో, ఆగస్టు 5: రష్యాను బెదరించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొన్న ఓ తొందరపాటు నిర్ణయం ఐరోపా దేశాలకు ప్రాణ సంకటంగా మారనుంది. మధ్యశ్రేణి క్షిపణులను మోహరించకుండా మాస్కో-వాషింగ్టన్‌ల మధ్య ఉన్న ఐఎన్ఎఫ్ (ఇంటర్మీడియట్ రేంజి న్యూక్లియర్ ట్రీటీ) ఒప్పందాన్ని ఇక ఏమాత్రం అనుసరించబోమని రష్యా ప్రకటించింది. పశ్చిమదేశాలు తమ జాతీయ భద్రతకు నేరుగా ముప్పును సృష్టించాయని ఆరోపించింది. ఈ క్రమంలో ఒప్పందాన్ని అనుసరించే పరిస్థితులు లేవని తేల్చిచెప్పింది. ఈ మేరకు రష్యా విదేశాంగ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. తాము కొన్ని రకాల క్షిపణులను మోహరించకుండా విధించుకున్న ఆంక్షలను ఇక పాటించబోమంది. అమెరికా దళాలు ఫిలిప్పీన్స్‌లో టైఫూన్ క్షిపణి లాంచర్లను మోహరించడం, ఆస్ట్రేలియా సమీపంలోని టలిస్మాన్ సాబ్రె డ్రిల్స్‌లో క్షిపణులను పరీక్షించడం దీనికి ప్రధాన కారణంగా వెల్లడించింది. మరోవైపు ట్రంప్ చర్యలు కూడా దీనికి ఆజ్యం పోశాయి. ఇటీవలే రష్యా మాజీ అధ్యక్షుడు మెద్వదేవ్ ప్రకటనకు స్పందనగా రెండు ఒహైయో శ్రేణి అణుజలాంతర్గాములను మోహరించేలా ఆదేశాలు జారీ చేశారు.



**అసలేమిటి ఈ ఐఎన్ఎఫ్ ఒప్పందం..?**

1987లో అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్, రష్యా అధినేత మిఖాయిల్ గోర్బచేవ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇంటర్మీడియట్ రేంజి న్యూక్లియర్ ఫోర్స్ ట్రీటీగా దీనిని వ్యవహరిస్తారు. దీనిప్రకారం భూ ఉపరితలంపై నుంచి ప్రయోగించే మధ్యశ్రేణి రేంజి క్షిపణుల మోహరింపును నిషేధించారు. 500 కిలోమీటర్ల నుంచి 5,500 కిలోమీటర్ల మధ్యలోవి ఈ ఒప్పంద పరిధిలోకి వస్తాయి. అప్పట్లో ఐఎన్ఎఫ్ ట్రీటీ కారణంగా సోవియట్ అమెరికాలకు చెందిన దాదాపు 2,692 క్షిపణులను ధ్వంసం చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీనిని ప్రచ్ఛన్న యుద్ధాన్ని మలుపుతిప్పిన సంధిగా భావిస్తారు. వాస్తవానికి ఈ ఇంటర్మీడియట్ రేంజి క్షిపణుల మోహరింపుతో అమెరికా మిత్రులైన ఐరోపా దేశాలకే ప్రధాన ముప్పు. 2019లో ట్రంప్ ఈ ఒప్పందం నుంచి అమెరికాను బయటకు లాగేశారు. రష్యా సుదీర్ఘకాలంగా దీనిని ఉల్లంఘిస్తోందని ఆయన నాడు ఆరోపించారు. 9ఎం729 లేదా ఎస్ఎస్‌సి-8 క్షిపణులను మోహరించిందని పేర్కొన్నారు. దీనిని నాడు మాస్కో తిరస్కరిం చింది. ఇప్పుడు ట్రంప్ అణు జలాంతర్గాముల మోహరింపు ఆదేశాలు వెలువడిన మూడు రోజులకు రష్యా కూడా ఈ ఒప్పందం నుంచి బయటకు వచ్చేస్తామని ప్రకటించింది.

## హోంమంత్రిగా అమిత్‌షా రికార్డు



న్యూఢిల్లీ, ఆగస్టు 5: ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఎలాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. మోదీ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఓ సరికొత్త రికార్డు నెలకొల్పారు. దేశ చరిత్రలో ఎవరూ అందుకోలేని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. దేశ చరిత్రలో అత్యధిక కాలం కేంద్ర హోంశాఖమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకూ బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ పేరుతో ఉన్న రికార్డును షా బద్దలు కొట్టారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక అమిత్‌షా 2019లో కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చింది. దీంతో షా వరుసగా రెండోసారి కూడా హోంశాఖ బాధ్యతలనే స్వీకరించారు. దీంతో షా హోంశాఖ బాధ్యతలు స్వీకరించి నేటికి ఆరు సంవత్సరాల 64 రోజులు పూర్తైంది. దాదాపు 2,194 రోజులు అమిత్ షా హోం మంత్రిగా పనిచేశారు. ఫలితంగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రికార్డును షా బద్దలుకొట్టారు. 1998-1999, 1999-2004 వరకూ ఎల్‌కే అద్వానీ కేంద్ర హోంమంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దాదాపు 2,193 రోజులు అద్వానీ ఈ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును అమిత్ షా అధిగమించారు. ఇక కేంద్ర హోం శాఖ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తన హయాంలో ఆర్టికల్ 370 రద్దు సహా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా దేశంలో నక్సలిజంపై ఉక్కుపాదం మోపి గాలింపును తీవ్రస్థాయిలో కొనసాగించే చర్యలుచేపట్టారు.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు, ఎగువసభలో తీర్మానానికి ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 5: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు మార్గం సుగమం అయింది. మంగళవారం రాజ్యసభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ప్రతిపక్షాల తీవ్ర నినాదాల మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టారు. 2025 ఫిబ్రవరి 13న రాష్ట్రపతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద జారీ చేసిన మణిపూర్‌కు సంబంధించి ప్రకటన అమలులో కొనసాగింపు అనే చట్టబద్ధమైన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఇప్పటికే జూలై 30న, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఎన్ బిరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రాన్ని పీడిస్తున్న హింస, రాజకీయ అస్థిరత మధ్య సింగ్ రాజీనామా చేశారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356కింద అమలులోకివచ్చే ఈ నిర్ణయం ప్రకారంరాష్ట్రపతి ఇప్పుడు గవర్నర్ ద్వారా మణిపూర్ రాష్ట్ర పరిపాలనా విధులను నేరుగా నియంత్రిస్తారని అర్థం.

కేంద్ర హోంమంత్రిత్వ శాఖజారీ చేసిన భారతగెజిట్‌లో ప్రచురించబడిన ఈప్రకటన,మణిపూర్ శాసనసభఅధికారాలను పార్లమెంటుకు బదిలీ చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని సమర్థవంతంగా నిలిపివేస్తుందని పేర్కొంది.



## ఎవరు నిజమైన భారతీయులో నిర్ణయించేది జడ్జిలు కాదు..!

### పార్లమెంటు ఆవరణలో ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు 5: ఎవరు నిజమైన భారతీయుడో, ఎవరు కాదో న్యాయమూర్తులు నిర్ణయించరని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా స్పష్టం చేశారు. తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై సుప్రీంకోర్టు ఇటీవల చేసిన కొన్నివ్యాఖ్యల నేపథ్యంలో ఆమె మంగళవారం ఈ విధంగా స్పందించారు. పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి గౌరవం ఉందని, అయితే పౌరుల దేశభక్తిని నిర్ధారించడం వారి పని కాదని ఆమె అన్నారు. భారత సాయుధ బలగాల గురించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చిన కొద్దిసేపటికే ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడి ప్రాథమిక బాధ్యత. మా సోదరుడు రాహుల్ గాంధీ సైన్యానికి వ్యతిరేకంగా ఎన్నడూ మాట్లాడరు. ఆయనకు మన సైన్యం పట్ల అపారమైన గౌరవం, అభిమానం ఉన్నాయని వివరించారు. ప్రతిపక్ష నాయకుల దేశభక్తిని, పౌరసత్వాన్ని ప్రశ్నించే ప్రయత్నాలను ప్రియాంక గాంధీ తీవ్రంగా ఖండించారు.

గతంలో 2019లో రాహుల్ గాంధీ పౌరసత్వంపై ప్రశ్నలు తలెత్తినప్పుడు కూడా ఆమె ఇదేవిధంగా గట్టిగా బదులిచ్చారు. రాహుల్ గాంధీ భారతీయుడని దేశం మొత్తానికీ తెలుసు. ఆయన ఇక్కడే పుట్టారు, అందరి కళ్ల ముందే పెరిగారు. ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు, ఇటువంటి అర్థంలేని ఆరోపణలు ఎందుకని ఆమె గతంలో వ్యాఖ్యానించారు.

## పంద్రాగస్టు వేడుకలకు భద్రత డొల్ల


### డమ్మీబాంబు గుర్తింపులో వైఫల్యం, ఏడుగురు కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు



న్యూఢిల్లీ, ఆగస్టు 5: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశ రాజధాని సిద్ధమవుతున్న వేళ, ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోటలో తీవ్ర భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది అప్రమత్తతను పరీక్షించేందుకు నిర్వహించిన ఒక మాక్ డ్రిల్‌లో భాగంగా పెట్టిన డమ్మీ బాంబును గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడుగురు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆగస్టు 15 వేడుకల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శనివారం స్పెషల్ సెల్ బృందం ఎర్రకోట వద్ద భద్రతను పరీక్షించేందుకు ఒక మాక్ డ్రిల్ నిర్వహించింది. సాధారణ పౌరుల వలె దుస్తులు ధరించిన స్పెషల్ సెల్ సిబ్బంది, ఎవరి కంటా పడకుండా ఒక డమ్మీ పేలుడు పదార్థాన్ని కోట ప్రాంగణంలోకి తీసుకెళ్లి రహస్యంగా ఉంచారు. అయితే, ప్రధాన ద్వారం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది దీనిని పసిగట్టలేకపోయారు. ఈ విషయం బయటపడటంతో ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సిబ్బంది నిర్లక్ష్యంగా భావించి, బాధ్యులైన ఏడుగురు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లపై తక్షణమే చర్యలు తీసుకున్నారు. కొందరిని సస్పెండ్ చేయగా, మరికొందరిని మందలించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. డమ్మీ బాంబును తీసుకెళ్లిన బృందం ప్రధాన ద్వారం వద్ద భద్రతా తనిఖీలను దాటుకుని లోపలికి వెళ్లింది. సిబ్బంది దీనిని గుర్తించకపోవడం వారి అప్రమత్తతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఓ సీనియర్ పోలీస్ అధికారి వ్యాఖ్యానించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు ఎర్రకోట వద్ద భద్రతను పూర్తిస్థాయిలో సమీక్షించి, కట్టుదిట్టం చేస్తున్నారు. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీతో పనిచేసే 700 ఏఐ ఆధారిత సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో నిఘాను పటిష్ఠం చేయనున్నారు.

## సంక్షిప్తంగా..

### పుతిన్‌పై రహస్యకుమార్తె తిరుగుబాటు



ప్యారిస్,ఆగస్టు 5: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు వ్యతిరేకంగా ఆయన రహస్య కుమార్తెగా భావిస్తున్న యువతి చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా దుమారం రేపాయి. లక్షలాది మంది ప్రాణాలను బలిగొని, తన జీవితాన్ని కూడా నాశనం చేసిన వ్యక్తి ఆయనేనంటూ ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నో ఏళ్లుగా మౌనంగా ఉన్న ఆమె తొలిసారిగా తన తండ్రిగా భావిస్తున్న వ్యక్తిపై తిరుగుబాటు స్వరం వినిపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు, స్వెత్లానా క్రివోనోగిఖ్‌కు జన్మించిన కుమార్తెగా ఎలిజవేతా క్రివోనోగి(22)ను అంతర్జాతీయ మీడియా వర్గాలు ఎప్పటినుంచో పేర్కొంటున్నాయి. స్వెత్లానా ఒకప్పుడు సాధారణ క్లీనింగ్ వర్కర్‌గా పనిచేసి, పుతిన్ అధికారంలోకి వచ్చాక అనూహ్యంగా అపార సంపదకు యజమానురాలయ్యారు. పండోరా పత్రాల వంటి లీకులు ఆమె ఆస్తుల వివరాలను బయటపెట్టాయి.

### తృణమూల్ ఎంపి పార్టీ చీఫ్‌విప్ పదవికి రాజీనామా



కోల్‌కత్తా, ఆగస్టు 5: తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో ఎంపీల మధ్య పెరుగుతున్న కలహాలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సీరియస్ అయ్యారు. పార్టీ ఎంపీలు కల్యాణ్ బెనర్జీ మహువా మొయిత్రా మధ్య 'పంది','మహిళా వ్యతిరేకి', 'కొంపలు కూల్చే మహిళ'వంటి తీవ్రమైన పదాలతో సాగిన పరస్పర వాగ్వివాదంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలో క్రమశిక్షణ పాటించాలని ఆమె ఎంపీలకు సూచించారు. ఈ ఘటన తర్వాత జరిగిన వర్చువల్ సమావేశంలో పార్టీ ఎంపీల మధ్య సమన్వయం లోపించిందని మమత చెప్పడంతో, దానికి బాధ్యత వహిస్తూ లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్ పదవికి తాను రాజీనామా చేసినట్టు కల్యాణ్ బెనర్జీ తెలిపారు. ఎంపీలు పరస్పర విమర్శలకు దిగకుండా నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్‌ఆర్‌సీ) వంటి జాతీయ సమస్యలపై ప్రభుత్వంతో పోరాడాలని మమతా బెనర్జీ సూచించారు.

### భారత సంతతి ఆటోడ్రైవర్‌పై జాతి వివక్ష దాడి



డబ్లిన్, ఆగస్టు 5: ఐర్లాండ్‌లో భారత సంతతికి చెందిన క్యాబ్ డ్రైవర్‌పై దారుణమైన జాతి వివక్ష దాడి జరిగింది. మీ దేశానికి మీరు తిరిగి వెళ్లిపోండి అంటూ ఇద్దరు యువకులు ఆయనపై సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటన డబ్లిన్ శివారు ప్రాంతమైన బాలిమన్‌లోని పాపిన్‌ట్రీ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గత 23 ఏళ్లుగా ఐర్లాండ్‌లో నివసిస్తూ, పదేళ్లుగా క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న లఖ్‌వీర్‌సింగ్ తన క్యాబ్‌లో ఇద్దరు యువకులను ఎక్కించుకున్నారు. వారు కోరిన ప్రాంతానికి చేర్చిన తర్వాత, అకస్మాత్తుగా ఆ యువకులు కారు డోర్ తెరిచి, తమ వెంట తెచ్చుకున్న సీసాతో లఖ్‌వీర్ సింగ్ తలపై రెండుసార్లు బలంగా కొట్టారు. అనంతరం మీ దేశానికి వెళ్లిపోండి అంటూ జాతి వివక్ష వ్యాఖ్యలు చేస్తూ అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఊహించని దాడితో లఖ్‌వీర్ సింగ్ తీవ్ర రక్తస్రావంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. సహాయం కోసం సమీపంలోని ఇళ్ల తలుపులు తట్టినా ఎవరూ స్పందించలేదు. చివరకు, ఆయనే అత్యవసర సేవలకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు, పారామెడికల్ సిబ్బంది ఆయన్ను బ్యూమాంట్ ఆసుపత్రికి తరలించారు.

### కాలిఫోర్నియాలో కార్చిచ్చు.. 65వేల ఎకరాల్లో చెలరేగిన మంటలు



వాషింగ్టన్, ఆగస్టు 5: అమెరికాలోని సెంట్రల్ కాలిఫోర్నియాలో భారీ కార్చిచ్చు సంభవించింది. గత శుక్రవారం మొదలైన ఈ కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. ఈ క్రమంలో గాలినాణ్యత క్షీణిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 'గిఫోర్డ్'గా పేర్కొనే ఈ కార్చి చ్చు ప్రస్తుతం 65వేల ఎకరాలకుపైగా విస్తరించింది. లాస్ ఏంజెలెస్, వెంచురా, కార్న్‌వంటి దక్షిణ కాలిఫోర్నియా కౌంటీల్లోని నివాసతులతో పాటు పొరుగునున్న లాస్‌వెగాస్‌లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. సోమవారం నాటికి 3శాతం మాత్రమే మంటలను అదుపు లోకి తీసుకురాగలిగామని అధికారులు తెలిపారు.

# సీమలో వర్షం కోస్తాలో వడ గాల్పు



-చినుకు కోసం ఎదురుచూస్తున్న నేల
- వాడిపోయి విలవిలలాడుతున్న వరి
-నెల రోజులుగా వదలని వడగాలి
-వాన మబ్బులు చెదిరిపోగా..
-చంద్ర గాల్పులు మిగిలిపోవా..

**నరసాపురం.... ప్రభాతవార్త** : రాయలసీమలో భారీ వర్షాలు. తెలంగాణలో దంచి కొడుతున్న భారీ వానలు. వర్షం జోరుతో హైదరాబాదులో ట్రాఫిక్ జామ్. వరంగల్ కరీంనగర్ లో ఎడతెరిపి లేని వాన. కృష్ణమ్మ పరవళ్ళు. తొలిసారిగా అన్ని గేట్లు ఎత్తివేసిన శ్రీశైలం డ్యాం. ఉప్పొంగిన నాగార్జునుడు. ప్రకాశం బ్యారేజీ వరద నీటితో బిలబిల. కానీ... కోనసీమ కోస్తా ప్రాంతంలో అగ్నిగుండంగా మారిన వాతావరణం. వాడిపోతున్న వరి ఆకు. కొబ్బరి చెట్లకు మందు పదును దాటిపోతున్న వైనం. ఆక్వా చెరువులకు వడగాల్పుల గండం. ఆక్సిజన్ సమస్యతో ఆకివీడు ఘనపవరం ఉండి ప్రాంతాల్లో తేలిపోయిన చేపలు.

తూర్పు పశ్చిమ డెల్టా ప్రాంతాల్లో జూలై ఆగస్టు నెల అంటే వరద భయంతో వణికి పోతారు. శ్రావణమాసంలో భారీ వర్షాలు ముసురు. గత రికార్డులు తిరగేస్తే రోజు నాలుగు నుండి ఐదు సెంటీమీటర్లవర్షపాతం నమోదు. మరి ఇప్పుడు... చినుకు కరువైపోయింది. ఉదయం 9 గంటలకే బయటకు రావాలంటే దడ. వేడి గాలులు విపరీతంగా వేస్తున్నాయి. బస్సులు ఖాళీ. ఎండ దెబ్బకు మార్కెట్లు వెలవెల. సాయంత్రం అయితే గోలి సోడా కు తహతహ. ఆగస్టులోనూ జోరుగా సాగుతున్న కూల్ డ్రింక్స్ ఐస్ క్రీమ్ వ్యాపారం. ఎండ గాలులు తట్టుకోలేక ఆసుపత్రి ఫాలో అవుతున్న వృద్దులు పిల్లలు. తూర్పు పశ్చిమ జిల్లాల్లో పరిస్థితి ఇది. నరసాపురం పాలకొల్లు భీమవరం ప్రాంతాలు చూస్తుంటే ఇవి అప్పటి ఊళ్లేనా..... లేక కొత్తగూడం పిడుగురాళ్ల మార్కాపురం భద్రాచలం గా మారిపోయాయా అనే అనుమానం కలుగుతుంది. హైదరాబాదు వాసులు రెండు రోజులు ఇక్కడ ఉండడానికి ఆపసోపాలు పడుతున్నారు. అమ్మో మాకే నయం అంటూ పనులు ముగించుకొని హైదరాబాదుకు పరుగులు పెడుతున్నారు. ఇది ఇక్కడ వాతావరణ తీరు. జూలై ఆగస్టు నెలలో పట్టుమని 5 సెంటీమీటర్ల వర్షం కురవలేదు. పోనీ మబ్బులు లేవు. చింత నిప్పులా ఎండ. బయట పది నిమిషాలు తిరిగాము నీరసం. గ్రామాల్లో పరిస్థితి మరీ దయనీయం. కరెంటు ఖాళీ తీగలే కనబడుతున్నాయి. రాత్రి రెండు మూడేనా కరెంటు రాని దుస్థితి. అమ్మో కూటమి దెబ్బేసిందంటూ విమర్శలు. మంచినీటి కొరత తీవ్రంగా ఉంది. తెల్లవారితే డబ్బాలు తీసుకుని పట్టణాల్లో పరుగులు. గ్రామాలు దయ నియ ఎలా ఉంటే పట్టణాలు పరిస్థితి మరీ ఘోరం. వర్షాలు లేకపోవడంతో బీరకాయలు వంకాయలు, సైతం కాకరకాయల్లా చేదుగా ఉ ంటున్నాయని మహిళలు బోరుమంటున్నారు. ధరలు చూస్తే ధరాగాతం. కేజీ 60 80 పలుకుతున్నాయి. చవితికైనా ముసురు పడుతుందా లేదా అని ప్రజానీకం ఆకాశం వంక ఆశగా ఎదురుచూస్తున్నారు. వర్ణుడు కరుణిస్తాడా... వడగాల్పు మరింత కృంగ తీస్తుందా అనే భయం లేకపోలేదు. బంగాళాఖాతం తీరం వెంబడి రాత్రి వేళ కూడా ఈ రోజుల్లో వేడి గాలులు వేయడం ఎప్పుడూ లేదని మత్స్యకారులు అంటున్నారు. ఏ ముప్పు పొంచి కలదోనని కలత చెందుతున్నారు.

## నాన్ లేఔట్ల క్రమబద్ధీకరణకు చర్యలు - రెండు విధాలుగా రాయితీ

ఏలూరు, ఆగస్టు, 05: ప్రభాత వార్త : నాన్ లేఔట్ లో క్రమబద్ధీకరణ కోసం గత కొంతకాలంగా ఎదురుచూస్తున్న ప్రజానీకానికి ప్రభుత్వం తీపి కబురు అందించింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం G.O.Ms.No.134, MA&UD(M) శాఖ, తేదీ: 26.07.2025 ద్వారా అనధికార లేఅవుట్లు మరియు ప్లాట్ల క్రమబద్ధీకరణ నిబంధనలు (LRS-2020) ప్రకారం గడువు పొడిగించడమైనదని జాయింట్ కలెక్టర్ వైస్-చైర్ పర్సన్, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పి. ధాత్రిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమబద్ధీకరణ నిబంధనలు 30.06.2025 లోపు రిజిస్టర్ కాబడిన అనధికార ప్లాట్లు/లేఅవుట్లు కు వర్తిస్తాయనీ తెలియజేసారు. కావున, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో ది.30.06.2025 లోపువేసిన లేఅవుట్లు/ అనధికార ప్లాట్లు యజమానులు ది 26-07-2025 నుంచి 90 రోజుల్లోగా LRS పోర్టల్ ద్వారా ఆన్లైన్ దరఖాస్తుచేసి సదరు ప్లాట్/లేఅవుట్ లను చట్టబద్ధంగా క్రమబద్ధీకరించుకోవలసినదిగా కోరారు. సదరు క్రమబద్ధీకరణ రుసుమును 45 రోజుల్లో మొత్తంగా చెల్లిస్తే - 10% రాయితీ ,తదుపరి 90 రోజుల్లో చెల్లిస్తే 5% రాయితీ వర్తించుననీ తెలియ జేసియున్నారు. లేఅవుట్లు మరియు ప్లాట్లు క్రమబద్ధీకరించుకొనుట వలన చట్టబద్ధ భవన అనుమతులు, ఆధునిక వసతులు (నీరు, విద్యుత్, డ్రైనేజీ) పొందుటకు మరియు భవిష్యత్తులో న్యాయబద్ధమైన లావాదేవీలు జరుగుటకు చట్టపరమైన భద్రత కల్పించబడుతుంది కావున, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధి లో ది.30.06.2025 లోపు వేసిన లేఅవుట్లు/ అనధికార ప్లాట్లు యజమానులు తప్పనిసరిగా ఈ అవకాశమును సద్వినియోగం చేసుకొని ప్లాట్ /లేఅవుట్ను చట్టబద్ధంగా క్రమబద్ధీకరించుకొనగలరనీ లేనియెడల, భవిష్యత్తులో అనధికార లేఅవుట్లు మరియు ప్లాట్ల పై చట్ట ప్రకారము, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ తీసుకొను చర్యలకు భాద్యులగుదురు అని తెలియజేయడమైనది.సదరు విషయమై సందేహములు కొరకు హెల్ప్ డెస్క్ నెంబర్ : 99668 48055 ను సంప్రదించగలరు. దరఖాస్తు చేయు వెబ్ పోర్టల్ వివరములు:- https://lrsdtcp.ap.gov.in

## స్వచ్ఛందంగా రైతులు సహకారంతో కిక్కిసు తొలగింపు

మొగల్తూరు ఆగస్టు 5 ( ప్రభాత వార్త) కొత్త కాయల తిప్ప గ్రామాల మధ్య దర్బరేవ్ డ్రైన్ లో పేరుకుపోయిన కిక్కిసు వలన సాగునీరు ప్రవాహం లేక ఆక్వా రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్న కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఆక్వా చెరువులకు నీరు ప్రవాహం రాక అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై ఆక్వా రైతులు తమ సొంత నిధులు సమకూర్చి స్వచ్ఛందంగా దర్బరేవు డ్రైన్ లో పేరుకుపోయిన కి కీస్ తొలగింపు చర్యలు మంగళవారం మధ్యాహ్నం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దర్బరేవు డ్రైన్ రెండు గ్రామాల మధ్య గల కల్వర్టు క్రింద 16 తోరలు కూరుకుపోవడంతో నీటి ప్రవాహం అర్ధాంతంగా నిలిచిపోవడంతో ప్రతి ఏటా ఈ సమస్యపై పోరాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకు వెళ్తున్నప్పటికీ శాశ్వత పరిష్కార మార్గాలు చూపించలేక పోతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన వైకాపా ప్రభుత్వం మరియు కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు ఈ సమస్యపై శాశ్వత పరిష్కార మార్గం చూపించాలని పలువురు రైతులు కోరుతున్నారు. రెండు గ్రామాల మధ్య ఈ కల్వర్టు నిర్మాణానికి అనేకసార్లు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారని అయితే సమస్య పరిష్కారానికి ఎటువంటి శాశ్వత చర్యలు చేపట్టలేక పోతున్నారని ఆక్వారైతుల పలువురు అంటున్నారు. మొగల్తూరు గ్రామాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దత్తత తీసుకుని అభివృద్ధి పరచాలని అధికారుల ద్వారా ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించిన వానిలో రైతాంగం తరపున ఈ కల్వర్టు పునర్నిర్మాణానికి తగిన ప్రతిపాదనలో పెండింగ్లో ఉన్నాయని వాటిని వెంటనే కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంయుక్త సహకారంతో స్థానిక శాసనసభ్యుడు బొమ్మిడి నాయకర్ సహకారంతో రైతులకు శాశ్వత పరిష్కార మార్గం వెంటనే చూపించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## డ్రోన్ కెమెరాల తో నాటు సారా తయారీ కేంద్రాలపై దాడి.

ఆగిరిపల్లి ఆగస్టు 5 ప్రభాతవార్త. నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ డోన్ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ వారి యొక్క సిబ్బందితో నాటు సారా తయారీ కేంద్రాలపై డ్రోన్ కెమెరాలతో ఈదర గ్రామములో దాడులు మంగళవారం నిర్వహించారు. తయారీ కేంద్రాల వలన ప్రజా ఆరోగ్యంపై ఏర్పడుతున్న ముప్పు నివారణకు చర్యలు తీసుకున్నారు. ఓపెన్ డ్రింకింగ్ మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాల అరికట్టడంలో భాగంగా, గ్రామాల్లో డ్రోన్ ఆధారిత నిఘా వ్యవస్థను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి ఎస్ఐ కె శుభసాకర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు నూజివీడు డిఎస్పి కె వి ఎన్ వి ప్రసాద్ సూచనలతో రూరల్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బందితో దాడులు నిర్వహించడం జరిగిందని తెలిపారు.ప్రజల ఆరోగ్యం మరియు శాంతి భద్రతలను కాపాడటం మా ప్రధాన బాధ్యత. నాటు సారా తయారీ కేంద్రాలు, అసాంఘిక



కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుంది. చట్టాన్ని ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం," అని తెలిపారు. ఈ చర్యలు గ్రామాల్లో చట్టాన్ని గౌరవించే వాతావరణాన్ని సృష్టించడంలో భాగమని, ప్రజల సహకారం వల్లనే ఇది సాధ్యమవుతుందని కూడా ఆయన పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే రాధాకృష్ణకు ఆహ్వానం అందించిన దాసం ప్రసాద్



తణుకు, ఆగస్టు 5(ప్రభాత వార్త): ఈనెల 10న జరగనున్న అత్తిలి ఏఎంసీ చైర్మన్ పదవీ ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్ మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. తణుకులోని ఎమ్మెల్యే నివాసానికి విచ్చేసిన ఆయన అత్తిలి ఏఎంసీ కార్యాలయంలో జరిగే ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి జనసేన ఎమ్మెల్యేలు, రాష్ట్ర మంత్రులతోపాటు ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు హాజరవుతారని దాసం ప్రసాద్ తెలిపారు. ఆయన వెంట పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలం

### ఎమ్మెల్యే రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపిన కార్మికులు

తణుకు, ఆగస్టు 5(ప్రభాత వార్త): అవుట్సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఇటీవల తమ సమ్మెకు స్పందించి జీతాలు పెంచినందుకు తణుకు మున్సిపాలిటీ ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు రూ. 10 వేల నుంచి రూ. 13 వేలకు పెంచడం జరిగిందన్నారు.



## ప్రమాద బీమా ను సద్వినియోగం చేసుకోండి

చాట్రాయి, ఆగస్టు5,ప్రభాతవార్త : ప్రమాద బీమా ను సద్వినియోగం చేసుకోవడం వల్ల నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని చాట్రాయి భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్ చెప్పారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన పథకం కింద ఏడాదికి కేవలం 436 రూపాయలు చెల్లిస్తే 2 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని అని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేద ప్రజానీకం నిత్యం పొలాలలో జీవనం గావిస్తుంటారని ఏదైనా ప్రమాదవశాస్తూ మరణిస్తే 2 లక్షల రూపాయలు ఆ కుటుంబానికి అందజేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. చాట్రాయి మండలంలో ఇటీవల ప్రమాద బీమా చెల్లించి మృతి చెందిన నాలుగు కుటుంబాలకు రెండు లక్షల చొప్పున భీమా సొమ్ము చెల్లించడం జరిగిందని అని చెప్పారు. తుమ్మగూడెం గ్రామానికి చెందిన మొలుగుమాటి సీతమ్మ, చిన్నంపేట గ్రామానికి చెందిన ఇడుపులపాటి ఝాన్సీ, జనార్ధనవరం గ్రామానికి చెందిన తోకల రమాదేవి,చిత్తపూరు గ్రామానికి గొల్లమండల లక్ష్మీ లకు వారి నామినీ ఖాతాలలో 2 లక్షల రూపాయలు చొప్పున జమ చేసినట్లు ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆపదలో ఉన్నవారికి ఈ బీమా ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని అని చెప్పారు.

## విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం వేశారు - నూజివీడు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్

చాట్రాయి, ఆగస్టు 5, ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్తు చార్జీలు రెట్టింపు అయ్యాయని సంక్షేమ పాలన అంటూ ప్రజలపై భారం వేస్తున్నారని నూజివీడు మాజీ శాసనసభ్యులు మేక ప్రతాప్ అప్పారావు విమర్శించారు. మంగళవారం చాట్రాయి మండలం నరసింహారావు పాలెం గ్రామంలో మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ వాట్ ఇస్ మై ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికీ ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం చేకూరలేదని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని అమలు చేయమంటే ఆర్థిక ఇబ్బందులు అంటూ కుంటి సాకులు చెబుతున్నారని ఆయన ఆరోపించారు. యాడాదిలోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని ప్రజల పక్షాన ప్రతిపక్ష పార్టీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పరస చెన్నారావు, వంకిని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

## ఆక్వా జోన్ సర్వేలో నిబంధనలు కచ్చితంగా పాటించాలి

### - జిల్లా ఇన్చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.

భీమవరం ఆగస్టు 5 ప్రభాతవార్త :జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో మంగళవారం మత్స్య, గృహ నిర్మాణ శాఖలపై ఇంచార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మత్స్య, గృహ నిర్మాణ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వాజోన్ సర్వేలో నిబంధనలు కచ్చితంగా పాటించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. మండల్ లెవెల్ కమిటీ అధికారులు అందరూ ఆక్వా జోన్ లో ప్రతిపాదించిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సీవీడ్ సముద్రపు నాచు పెంపకం (సీవీడ్) పై ఎస్ హెచ్ జి గ్రూపులకు నిపుణుల చేత శిక్షణ ఇప్పించి ప్రోత్సహించాలని, ఈ కార్యక్రమాన్ని రెండు వారాల్లో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్ ఫామ్ లో ఆక్వాకు సంబంధించిన రైతులు, మత్స్యకారులు వివిధ భాగస్వాములు అందరిని విధిగా నమోదు చేయడం, దీని ఆవశ్యకతను అందరికీ



తెలియజేయాలన్నారు. సముద్రపు నాచు పెంపకంలో ఇప్పటికే అభివృద్ధి సాధించిన తమిళనాడులోని మండపం మొదలైన ప్రదేశాలలో అధికారులు అధ్యయనం చేసి మన ప్రాంతంలో ఈ సాగుకు ప్రోత్సహించాలన్నారు. సమృద్ధిగా పండే వ్యవసాయ భూమిని ఆక్వా జూన్ లోకి ప్రతిపాదించవద్దని ఆయన అధికారులకు సూచించారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికలకు

### ముమ్మరంగా నామినేషన్లు దాఖలు

ప్రభాతవార్త నరసాపురం : నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేయడానికి మొత్తం 24మంది నామినేషన్లు దాఖలు చేసారని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లమిల్లి జోసెఫ్ తెలిపారు..ఈ నెల 13వ తేదీన జరగబోయే ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేయడానికి మంగళవారం తో గడువు ముగిసింది.. అధ్యక్ష పదవికి గన్నాబత్తుల మత్స్య వల్లభరావు,బూసి విశ్వేశ్వర రావు నామినేషన్లు దాఖలు చేసారని జోసెఫ్ తెలిపారు. అలాగే ఉపాధ్యక్ష పదవికి యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, వైదాని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పదవికి విన్నా సూర్యప్రకాష రావు,గోడి సత్యనారాయణ, రొక్కాల గ్లాడ్ స్టన్ కుమార్, జాయింట్ సెక్రటరీ పదవికి సోడదాసి శ్రీధర్, నక్కా ఆనంద్ బాబు, లైబ్రరీ కార్యదర్శి పదవికి నారిన శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పదవికి సోడదాసి శ్రీధర్, రాయసం రాధారాణి, కోశాధికారి పదవికి పూరెళ్ళ శ్రీనివాస్, మహిళా ప్రతినిధి పదవికి గోపిరెడ్డి మణి, కార్యవర్గ సభ్యుల పదవులకు తంగెళ్ళ వెంకటేశ్వరరావు,దేవ రంజిత్ కుమార్,కొల్లా బత్తుల చంద్రశేఖర్,బోడపాటి నారాయణ స్వామి నాయుడు,ఓసూరి జ్యోతి మాంగల్య,కొప్పర్తి వెంకట సుబ్రమణ్యం, పులపర్తి హర్షవర్ధన్,గోరింకల వినోద్ కుమార్,కొల్లాటి ఆదినారాయణ, కంభాల స్వర్ణ తమ నామినేషన్లు దాఖలు చేసారని జోసెఫ్ తెలిపారు... నామినేషన్ల పరిశీలన బుధవారం జరుగుతుందని ఆయన వెల్లడించారు..




## క్లీన్ పట్టణంగా నరసాపురం పౌరుల కృషి ముఖ్యం

### కమిషనర్ అంజయ్య

నరసాపురం ప్రభాతవార్త :నరసాపురం మున్సిపల్ కమీషనర్ ఎం. అంజయ్య మొ%జ%దటి డివిజన్ రెండోవ డివిజన్ శానిటరీ ఇన్స్పెక్టర్ శానిటరీ మేస్త్రి లతో శానిటరీ సెక్రటరీ లతో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురం "క్లీన్ పట్టణం" గా రూపొందించే విధంగా ప్రతి పౌరుడు శానిటేషన్ సిబ్బందికి తమ వంతు సహకారాన్ని అందివ్వాలని కోరారు. రోడ్డుపైన, డ్రైన్ లో చెత్త వేయకుండా డస్ట్ బీన్స్ లో తడి,పొడి, ప్రమాదకర వ్యర్థాలను విడివిడిగా అందివ్వాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బంది అందరూ అంకిత భావంతో పనిచేయాలని అందులో భాగంగా ప్రతి ఇంటి నందు తప్పనిసరిగా 3 బిన్ సిస్టం తడి చెత్త పొడి చెత్త మరియు ప్రమాదకర చెత్త వేరువేరుగా సేకరించు అంశంపై ప్రజలలో చైతన్యం తీసుకొని రావాలని తెలిపారు. ప్రజలందరికీ 3 బిన్ సిస్టం పై అవగాహన కల్పించాలని కోరారు అనంతరం పలు వార్డుల లో ప్రజల సమస్యలపై పర్యటించారు

## నేడు జంగారెడ్డిగూడెంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ పర్యటన

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ బుధవారం జంగారెడ్డిగూడెం పట్టణంలోను, మండలం లోను పర్యటించనున్నారని పట్టణ టిడిపి అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ తెలిపారు. ఉదయం గం.9-45 నిమిషములకు గుర్వాయిగూడెం లోని శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయ సమీపంలో గల మానవత కళ్యాణ మండపం దగ్గర సిసి రోడ్డును ప్రారంభిస్తారు. అనంతరం 10 గంటలకు గుర్వాయిగూడెం లోని ఫంక్షన్ హాల్ లో పాల్గొంటారు. గం.10-30 జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ లో జరుగునున్న ఎస్ డి ఎస్ మీటింగ్ లో పాల్గొన్న తర్వాత, పట్టణంలోని సిసి రోడ్లు శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు మేఘ మార్ట్ ప్రారంభోత్సవంలో పాల్గొంటున్నారు. అనంతరం సూర్య ఫంక్షన్ హాలులో జరిగే వివాహ వేడుకల్లో పాల్గొంటారు. తిరుమలాపురం లో జరిగే సుబ్రహ్మణ్యం సంవత్సరీకంలో పాల్గొన్న అనంతరం, చిన్న వారి గూడెంలో సిసి రోడ్లను ప్రారంభించి అనంతరం, సాయంత్రం ఏ.పోలవరం లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా నిర్మించినున్న వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ పాల్గొంటారు.



## తడికలపూడి ఆలయంలో దొంగతనం


జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: కామవరపు కోట మండలం తడికలపూడి గ్రామంలో పోలీస్ స్టేషన్ కు దగ్గరలో ఊరి చివరన ఉన్న శ్రీ గంగానమ్మ, శ్రీ అంకాలమ్మ, శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో దొంగలు పడటం జరిగింది. దొంగలు ముందుగా దేవాలయం వెనుక వైపు నుంచి వచ్చి ఆలయ ప్రాంగణంలో ఉన్న విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు కొన్ని ధ్వంసం చేసి ఆ తర్వాత ఆలయంలోకి ప్రవేశించి, ఆలయం ముందు భాగంలో వారి వద్దనున్న వస్తువులతో అమ్మవారి హుండీ ను పగులగొట్టే ప్రయత్నం చేశారు. అది పగలకపోవడంతో గర్భాలయ ముందు గేటుకు వేసి ఉన్న తాళాలు పగలగొట్టి గర్భాలయంలోకి ప్రవేశించారు. అమ్మవారి తలకి ఉన్న వెండి కిరీటము, అమ్మవారి మెడలో సూత్రాలు, వెండి చెవులు, మెడలో ఉన్న వివిధ రకాల ఆభరణాలు అపహరించి గోడదూకి వెళ్లిపోవడం జరిగింది. ఉదయాన్నే ఆలయానికి వెళ్లిన పూజారి గుడి గేట్లు తీసి ఆలయంలోకి వెళ్లి



చూడగా ఈ సంఘటన వెలుగులోనికి వచ్చింది. వెంటనే విషయం తెలుసుకున్న పూజారి తడికలపూడి పోలీస్ స్టేషన్ పోలీస్ వారికి ఫిర్యాదు చేశారు. హుటాహుటిన సమాచారం తెలుసుకున్న పోలీసు అధికారులు జంగారెడ్డిగూడెం సిఐ వెంకట సుభాష్, తడకలపూడి ఎస్సై చెన్నారావు, వారి సిబ్బంది, క్లూస్ టీం, స్క్వాడ్ సిబ్బంది రంగంలోకి దిగి ఆలయ ప్రాంగణంలో, చుట్టుప్రక్కల దొంగల ఆనవాళ్ళను పరిశీలించి,దర్యాప్తు ముమ్మరం చేశారు.

## పేరుపాలెం బీచ్ లో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం


మొగల్తూరు ఆగస్టు 5(ప్రభాతవార్త) పేరుపాలెం బీచ్కు విహారయాత్రకు సోమవారం భీమవరం నుండి ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న బి తస్వీర్ తోటి విద్యార్థులతో కలసి వచ్చి, సముద్ర స్థానం ఆచరించడానికి దిగిన బి తస్వీర్, అలల తాకిడికి గల్లంతయ్యాడు, తస్వీర్ మృతదేహం మంగళవారం కృష్ణాజిల్లాలోని చిన్న గొల్లపాలెం సముద్ర తీరంలో లభించింది, దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు, మొగల్తూరు ఎస్సై జి వాసు తెలియజేశారు



## నరసాపురంలో జర్నలిస్టుల ప్రదర్శన

ప్రభాతవార్త నరసాపురం : జిల్లా లో అర్హులైన జర్నలిస్ట్ లు అందరికీ వెంటనే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలనినర్సాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏ పి యు డబ్ల్యూ జె రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నర్సాపురం ఆర్డీవో దాసిరాజు కు యూనియన్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. సమస్య లు పరిష్కారం కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఇజ్రాయిల్ కార్యదర్శి మారుతీ రావు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్ట్ లకు తక్షణమే ప్రభుత్వం అక్రిడిషన్ ఇవ్వాలన్నారు. ఆరోగ్య, ప్రమాద బీమా పాలసీ పూర్తి గా ప్రభుత్వం చెల్లించాలని కోరారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్ట్ లు అందరికీ ప్రభుత్వ పించన్లు నెల కు రూ 10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు ల రక్షణ కు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం నియోజకవర్గ జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

# పవిత్రములకు ప్రోక్షణ అభిమంత్రన





ఆగిరిపల్లి ఆగస్టు 5 ప్రభాతవార్త : శ్రీ శోభనాచల వ్యాగ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారి పవిత్రోత్సవములు భాగంగా మంగళవారం ఉదయం విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనం పంచగవ్యారాధన అగ్ని ప్రతిష్టాపన సహస్రనామార్చన పవిత్రములకు ప్రోక్షణ అభివందన ఆకల్మష హెూమము శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణలు నిర్వహించారు. సాయంత్రం నిండి శ్రీవార్లకు విశేష అర్చన సర్వదేవత ఆహ్వానము పవిత్రముల ధాన్యాదివాసము హెూత్ర ప్రశంస సర్వదైవత్య శాంతి హెూమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి సిహెచ్ సాయి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు గుడిపూడి అనంతకృష్ణ లీల మనోహర్ ప్రసాద్ ఇల్లు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి - దర్నాలో సిపిఎం డిమాండ్



ఉండి, ఆగస్టు 5, ప్రభాతవార్త :రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించి, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ప్రమాదాన్ని, విద్యుత్ ఛార్జీల భారాన్ని వివరిస్తూ మంగళవారం ఉండి మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాలకు తలొగ్గిన గత వైసిపి ప్రభుత్వం అదానీ కంపెనీలకు 25 ఏళ్లపాటు ఏడు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకుందని, నేడు కూటమి ప్రభుత్వం కూడా వైసీపీ బాటలోనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తూ అదానిని వదులుకోలేదని విమర్శించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఎవరు పెట్టుకోవద్దని నేలని కొట్టాలని చెప్పారని కానీ నేడు అవే స్మార్ట్ మీటర్లను బలవంతంగా ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నారు. అదానీకి ఇచ్చిన ప్రాజెక్టులను కొనసాగిస్తూ ప్రజలకు విద్యుత్ భారాలు వేసేలా నిర్ణయాలు చేసి ఆ ఒప్పందాలను ముందుకు తీసుకు వెళ్తున్నారని విమర్శించారు.

# ఉపాధి పధకం పై ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ



ఆత్తిలి – ఆగస్టు 5( ప్రభాత వార్త ):మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కొత్త గా విధుల్లో చేరిన 10 మండలాలకు చెందిన 35 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం అత్తిలి మండల పరిషత్ కార్యాలయం లో నిర్వహించారు. శిక్షణా కార్యక్రమానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు డాక్టర్ కె సిహెచ్ అప్పారావు,అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీకె మల్లికార్జున రావు, కోర్స్ డైరెక్టర్ జె.కనకదుర్గ, స్థానిక ఇంచార్జి ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు,10 మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. శిక్షణా కార్యక్రమం లో ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు బాధ్యతల ను, గ్రామపంచాయతీలో నిర్వహించవలసిన రిజిస్టర్ల ను, రోజువారి పనికి కల్పన ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు పంపుట, రెండు పూటలా పనులు చేయించి ఫొటోస్ అప్లోడ్ చేయడం, రోజువారి పని కొలతలు ఇవ్వడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ట్రైనింగ్ డిఆర్పీలు ఏంటీసీ కె.శ్రీను, టెక్నికల్ అసిస్టెంట్ ఎం.బాపూజీ, ఏపీవో ప్రసాద్, సిబ్బంది బోసు, తమస్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రెండు వేలు వాట్సప్ అప్లికేషన్లు

## ఇన్చార్జ్ జిల్లా కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి.



ఆత్తిలి – ఆగస్టు 5( ప్రభాత వార్త ):ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాట్సఅప్ గవర్నెన్స్ గురించి ప్రజలకు తెలిసేలా ర్యాలీలు నిర్వహించి విస్తృతంగా అవగాహన కల్పించాలని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. అత్తిలి గ్రామంలో వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు అత్తిలి గ్రామ పంచాయితీ కార్యాలయం నుండి అత్తిలి మెయిన్ సెంటర్ వరకు వాట్సప్ గవర్నెన్స్ అవగాహన పై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమమును నేటి నుండి జిల్లాలో ప్రజలలో వాట్సప్ గవర్నెన్స్ పై విస్తృతంగా అవగాహన కల్పించి మరింత సేవలను అందించాలన్నారు.

# స్మార్ట్ మీటర్లు విధానం రద్దు చేయాలి



పెనుమంట్ర–ప్రభాతవార్త : పెనుమంట్ర తాసిల్దార్ కు, విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ప్రజా వేదిక ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులకు స్మార్ట్ మీటర్లు విధానం రద్దు చేయాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు ఆకుల హరేరామ్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుసంపుడి సుబ్బరాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్ట వద్దని ప్రజల మీద పెనుబారాల మోపద్దని ఆదాని స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని. సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై వేస్తున్న విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలొ సి.ఐ.టి. యు నాయకులు కేతా గోపాలం నేతల చిత్తరంజన్,.సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్. గంట్టి ఆంజనేయులు, ఉండ్రాజరపు భాస్కరరావు, తెన్నేటి ఆంజనేయులు, నాగేశ్వరరావు. కాటిక వెంకటేష్, కర్రి సోమిరెడ్డి, మేడపాటి సుబ్బారావు తదితర కార్మికుల పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాలు



మొగల్తూరు ఆగస్టు 5( ప్రభాతవార్త) గ్రామపంచాయతీ కార్యాలయము నందు మంగళవారం సిడిపిఓ జీ ఊర్మిల ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాలు యొక్క ప్రాముఖ్యత గురించి అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు భారీ ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పడవల మేరి సత్యనారాయణ,ఉపసర్పంచ్ బోణం, నరసింహారావు, వార్డు సభ్యులు మెట్ల రాంబాబు, ముక్కు గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలి



కైకలూరు ఆగస్టు 5 (ప్రభాతవార్త) అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్లు వెంటనే మంజూరు చేసి, ప్రమాద బీమా పాలసీని వెంటనే పునరుద్ధరించాలని ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) మరియు కైకలూరు నియోజకవర్గం ప్రెస్ క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని కైకలూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు ఏవి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం కైకలూరు తాసిల్దార్ ఇబ్రహీం కి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ జర్నలిస్ట్ లకు ఇస్తున్న ఆక్రిడిడేషన్ల మంజూరు విషయంలో ప్రభుత్వం వాయిదాలు వేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నిబద్ధతతో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ లను మంజూరు చేసి ప్రభుత్వం గుర్తింపు నివ్వాలని డిమాండ్ చేశారు. అక్రిడేషన్ల మంజూరు విషయంలో రెన్యువల్ విధానానికి ఇప్పటికైనా స్వస్తి పలకాలని కోరారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ నూతన అక్రిడిడేషన్ లను మంజూరు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర,జిల్లా స్థాయి అక్రిడేషన్ కమిటీలలో జర్నలిస్ట్ యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని తక్షణమే పునరుద్దించాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తానన్న కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీను నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పెన్షన్ పథకాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా జాయింట్ సెక్రటరీ పెద్ది సురేష్, జిల్లా సామ్నా కార్యదర్శి కురెళ్ళ కిషోర్,జిల్లా కార్యవర్గ సభ్యులు భాష్యంబోయిన. శ్యామలరాజు, నరహరశెట్టి శ్యాంబాబు,సీనియర్ పాత్రికేయులు వాసే పౌల్ రాజు, మోరు సుబ్రహ్మణ్యం, మహ్మద్ ఇక్బాల్,జి దుర్గారావు,గున్నం రామకృష్ణ, మత్తె రాజేష్,బి.సీతారామయ్య,వాసు, అబ్రహం,కిశోర్, బి.శ్రీనివాసరావు,అనిల్ తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.

# పోలవరం పరిహారం రాలేదు..మరణం వచ్చింది

## - ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రాలేదని మనోవేదనతో రుద్రంకోట గ్రామవాసి మృతి



వేలేరుపాడు, ఆగస్టు 5,ప్రభాత వార్త : గ్రామంలో, ప్రజలలో, కుటుంబంలో గెలిచాడు కానీ అధికారుల నిర్లక్ష్యాన్ని, మరణాన్ని మాత్రం గెలవలేకపోయాడు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నప్పటికీ ఎన్ని అర్జీలు ఇచ్చినప్పటికీ తన సమస్య ముందు మాత్రం ఓడిపోయాడు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రంకోట పంచాయతీ రుద్రంకోట గ్రామానికి చెందిన సారే రామారావు సన్నాఫ్ రామచంద్రారావు రుద్రంకోట గ్రామం లోనే పుట్టి పెరిగిన తనకు అందరిలాగే పోలవరం పరిహారం అందుతుందని ఆశగా ఎదురు చూశాడు కానీ తొలి జాబితాలో పేరు ఉన్నప్పటికీ తుది జాబితా నుండి తొలగించారు అధికారులు. సారె రామారావు అనేక పర్యాయాలు పోలవరం ప్రాజెక్టు ముంపు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రాలేదని అధికారులకు విన్నవించుకున్నాడు. ఆధారాలు ఉన్నా ఎన్నిసార్లు మొరపెట్టుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. రామారావుకి సమస్యతో పాటు వయసు పెరిగింది. వయసు పై పడటంతో అనారోగ్యంతో మంగళవారం పరమపదించారు. రామారావు మరణం పోలవరం ముంపు ప్రజలను కలచివేసింది. పోలవరం పరిహారం కోసం ఎదురుచూసే వారి సమస్యలను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుచున్నారు. సారే రామారావుకి ఎలాగో న్యాయం చేయలేకపోయారు కుటుంబంలోని వారికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని రుద్రంకోట గ్రామస్తులు కోరుచున్నారు.

## కె ఎస్ గట్టు లో

## పొలం పిలుస్తోంది కార్యక్రమం.



ఆత్తిలి – ఆగస్టు 5 ( ప్రభాత వార్త ):అత్తిలి మండలంలోని కె.ఎస్. గట్టు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులందరూ తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలని కోరారు.రైతులు ఏ ఏ రకాలు ఊడ్చారో ఆ రకాలు వివరాలను వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని అన్నారు. రైతులందరూ విధిగా పంటల భీమా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి టి కె రాజేష్, వ్యవసాయ సహాయకులు మేరీ, కూటమి నాయకులు మెంతు రాజ్ కుమార్ రైతులు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ సమక్షంలో సుభాష్ రాజు పుట్టినరోజు వేడుక



భీమవరం ఆగస్టు 5 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ (బిజెపి) నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు పుట్టినరోజు వేడుకలు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ రాజుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు.మంగళవారం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ నివాసం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో పుట్టినరోజు కేకును సుభాష్ రాజు చేత కట్ చేయించారు. అనంతరం సుభాష్ రాజు కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఇతర బిజెపి నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస రాజు మాట్లాడుతూ పేరిచర్ల సుభాష్ రాజు పార్టీ కోసం ఎంతో అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఆయన పార్టీ బలోపేతానికి కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ సుభాష్ రాజు సేవలు పార్టీకి ఎంతో విలువైనవని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, జిల్లా ఉపాధ్యక్షులు కోరా రామ్మూర్తి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు షేక్ మొహిద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు ఐ.వి.ఎల్. వెంకటేశ్వరరావు, బలరామరాజు, కోళ్ల అబ్బులు, కాగిత రమణ, గోవర్ధన్ సుభాష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# చాట్రాయి మండలానికి ఇన్చార్జిల గ్రహణం పట్టింది

ప్రభాతవార్త చాట్రాయి : చాట్రాయి మండలానికి అధికారుల గ్రహణం పట్టింది. ప్రధాన కార్యాలయాలలో సైతం అధికారులు లేకుండా ప్రభుత్వ కార్యాలయాలు వెలవలబోతున్నాయి. మంత్రి ఇలాఖలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఇన్చార్జిలతో పాలన కొనసాగుతోంది. ప్రధానమైన ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో పాలన స్పందించిపోయింది. మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానమైన పోస్టు ఎండిఓ కాగా ఆ పోస్టు భర్తీ కాకపోవడంతో ఈ ఓ ఆర్ డి ఇన్చార్జ్ ఎండిఓ గా కొనసాగుతున్నారు. అయితే ఆమెకు కూడా ఇటీవల అనారోగ్య పరిస్థితులు రావటంతో సెలవులో ఉండటంతో అసలు ఎండీఓనే లేని పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల మండల పరిషత్ అభివృద్ధి కుంటుబడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ఇటీవల బదిలీలలో సూపరింటెంట్, సీనియర్ అసిస్టెంట్ లు కూడా బదిలీ కాగా కార్యాలయం మొత్తం ఒక జూనియర్ అసిస్టెంట్ తో కాలక్షేపం జరుగుతోంది. మండల పరిషత్ కార్యాలయం మండలంలో అభివృద్ధి చేయాల్సి ఉండగా కార్యాలయంలోనే అభివృద్ధి లేని పరిస్థితి ఏర్పడింది. తాహసిల్దార్ కార్యాలయం లో కూడా ఇన్చార్జిలతోనే పాలన సాగిస్తున్నారు

### జగనన్న కాలనీలో రహదారులు అభివృద్ధి చేయండి, స్థానికుల డిమాండ్



పెనుమంట్ర–ప్రభాతవార్త : మండలంలోని నెగ్గిపూడి గ్రామపంచాయతీ పరిధిలో వనంపల్లి జగనన్న హౌసింగ్ కాలనీలో మౌలిక సదుపాయాల లోపంతో నివాసితులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొద్దిగా వర్షం వస్తే రోడ్లన్నీ చెరువుల్లా మారుతున్నాయి. కాలనీలో రోడ్ల అభివృద్ధిపై అధికారులు, పాలకులు తక్షణమే దృష్టి సారించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే చాలా కాలంగా సమస్యను లేఖల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు.. జగనన్న కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ,రోడ్ల పరిస్థితి మాత్రం దయనీయంగా ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, రోడ్లను బీటీసీ లేదా సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని, జన జీవనానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# స్మార్ట్ మీటర్లు లకు వ్యతిరేకంగా ధర్నా



చాట్రాయి, ఆగష్టు 5,ప్రభాతవార్త చాట్రాయి సెంటర్లో వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన సభలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి హరినాథ్ ప్రసంగిస్తూ పెంచిన విద్యుత్ ఛార్జీలు తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ఆదానీ సెకీ ఒప్పందం రద్దు చేయాలని లేకుంటే ప్రజల నిరసన ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. 1750 కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని సాక్షాత్తుఅమెరికా కోర్టు వెల్లడించింది. ఎన్డీఏ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు మోడీ ఒత్తిడి మేరకే సెకీ ఒప్పందం రద్దు చేసుకుంటానికి సిద్ధంగా లేరని హరినాథ్ ఆరోపించారు. ఈ ఒప్పందం రద్దు చేసుకుంటానికి మూడు వేల కోట్లు అవుతుందని చంద్రబాబు వాదిస్తుండగా ఈ ఎస్ శర్మ (మాజీఐఏఎస్ ) ఒక్క పైసా కట్టనవసరం లేదని అన్నారు.

# కైకలూరులో గ్రామీణ వైద్యుల విజ్ఞాన సదస్సు

కైకలూరు,ఆగస్టు5 (ప్రభాతవార్త):నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు పట్టణంలోని షణ్ముఖ మినీ ఫంక్షన్ హాలు నందు మంగళవారం వినాయక హాస్పిటల్(భీమవరం) వారి సౌజన్యం తో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం కైకలూరు ఏరియా అధ్యక్షులు జి. సూర్యప్రకాష్ రావు అధ్యక్షతన జరిగింది. వినాయక హాస్పిటల్ అధినేత డాక్టర్ గజపతి రాజు సాగిరాజు, జీర్ణ కోశ వ్యాధులపై వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక హాస్పిటల్స్ వారు అనునిత్యం అత్యున్నత వైద్య సేవలు భీమవరం పరిసర ప్రాంత ప్రజలకు అందిస్తున్నామని సర్జకల్ గ్యాస్ట్రో విభాగంలో ఎన్నో ఆపరేషన్స్ చేయటం జరిగినదన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి. వెంకటరాజు మాట్లాడుతూ, జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం, ప్రధానం గా సభ్యుల సమిష్టి కృషి,తో మారుమూల గ్రామ ప్రాంతాల్లో సుధీర్ఘ సేవలు చేస్తూ ప్రభుత్వ గుర్తింపునకై పోరాటం చేస్తుందని నిరంతరం సూపర్ స్పెషలిటీ హాస్పిటల్స్ వైద్యులచే వైద్యావిజ్ఞాన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా వ్యాప్తంగా ఉన్నగ్రామీణ వైద్య మిత్రుల కుటుంబ సభ్యులతో వనమహెూత్సవకార్యక్రమం ప్రతిష్టకం గా నిర్వహించతలపెట్టమన్నారు.

## జంగారెడ్డిగూడెంలో జర్నలిస్టుల డే



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం ఏపీయూడబ్ల్యూ జే శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా జర్నలిస్టులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి వి భాస్కర్, కంచర్ల శ్రీను, బాలు, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలతో రోగ నిరోధక శక్తి.



అత్తిలి– ఆగస్టు 5 (ప్రభాతవార్త): అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలను పట్టించడం ద్వారా రోగ నిరోధక శక్తిని పెంచవచ్చని ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీ లక్ష్మీ అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో జరిగిన తల్లిపాలు వారోత్సవాలలో ఆమె పాల్గొన్నారు. తల్లి పాలు వల్ల బిడ్డకు ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధుల నుండి కూడా దూరం చేయవచ్చునని ఆమె అన్నారు. తల్లిపాలతో తల్లి బిడ్డల అనుబంధం కూడా పెంపొందుతుందని తెలిపారు. ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు బాలింతలు ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ సభ్యులు, ఏ ఎస్ ఆర్ మెడికల్ కళాశాల వారు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించారు,



జీలుగుమిల్లి, ఆగస్టు–05, ప్రభాతవార్త: మండలంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో 'డిమాండ్స్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉదయ్ నాయక్ కు సమస్యల తో కూడిన వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఫ్యామిలీ హెల్త్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని అన్నారు. ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు వంటి ప్రాథమిక అవసరాలు తీరితే, జర్నలిస్టులు తమ విధులను మరింత సమర్థవంతంగా నిర్వర్తించగలరని తెలియజేశారు. తహసీల్దార్ ఉదయ్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు కోలా రాము, మద్దిశెట్టి ఏసు బాబు నాయుడు, బొంతు రామకృష్ణ, బొంతు రామారావు, నక్క రవి, దారా మనోజ్, సాయి, ప్రసాద్, పాముల ప్రసాద్, బట్టు సందీప్, బొంతు రాంబాబు, సత్తిబాబు, పోసిరావు , సిరిశెట్టి రాఘవులు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల పాలకవర్గం.



అత్తిలి– ఆగస్టు 5 (ప్రభాత వార్త): అత్తిలి ఎస్ వి ఎస్ ఎస్ ఆర్ట్స్ సైన్స్ కళాశాల సంఘం సర్వసభ్య సమావేశం కళాశాల ప్రాంగణం లో నిర్వహించారు. పాలకవర్గ అధ్యక్షులుగా దాసం గోవిందరావు, ఉపాధ్యక్షులుగా బుద్దరాతి భరణి ప్రసాద్, కార్యదర్శిగా మద్దాల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి దిరిశాల సూర్య ప్రభాకర రావు, కోశాధికారిగా యడ్లపల్లి భద్రం, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 36 మందిని పాలకవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బీవీ రమణమూర్తి, పి.శ్రీ రామ్ శర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ షబానా పాల్గొన్నారు.

## విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు

### - ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ ఉపకేంద్రం వద్ద ధర్నా



వేలేరుపాడు,ఆగస్టు 5, ప్రభాత వార్త : ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా వేలేరుపాడు మండలంలో మంగళవారం 33/11 విద్యుత్ ఉపకేంద్రం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్మార్ట్ మీటర్లు బిగించి రెక్కాడితే గానే డొక్కాడని ప్రజల పైన, చిరువు వ్యాపారుల పైన అధిక భారం వేయడం ఎంతవరకు సబబు అని ప్రజలందరూ ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్న ప్రజల మాటలను పెడచెవిన పెట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వెళ్లడం సబబు కాదని అఖిలపక్షం నాయకులు అన్నారు. స్మార్ట్ మీటర్లను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని,అవి బిగించే సమయంలో ఎదుర్కొనేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. ధర్నా కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# చిరంజీవి బర్త్‌డే 22న 'త్రిబాణధారి బార్బరిక్' విడుదల



మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆగస్ట్ 22న మా 'త్రిబాణధారి బార్బరిక్ ' చిత్రాన్ని విడుదల చేస్తుండటం ఆనందంగా ఉంది.. రిలీజ్ డేట్ ప్రెస్ మీట్‌లో ప్రముఖ నటుడు సత్య రాజ్‌స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మిస్తున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. ఈ మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. పాన్ ఇండియన్ యాక్టర్ సత్య రాజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రంలో వశిష్ట ఎన్ సింహా, సత్యం రాజేష్, ఉదయభాను, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ వంటి వారు ప్రధాన పాత్రల్ని పోషించారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో..

సత్య రాజ్ మాట్లాడుతూ,'త్రిబాణధారి బార్బరిక్ సినిమాలో పని చేసినందుకు ఆనందంగా ఉంది. మేమంతా కూడా మాదే మెయిన్ పాత్ర అని చెప్పుకోవచ్చు. కానీ ఇందులో కథే మెయిన్ హీరో. డైరెక్టర్ మోహన్, నిర్మాత విజయ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజేష్ వీళ్లే అసలైన బాణాలు. ఈశ్వర్ గారు నాతో డ్యాన్స్ చేయించారు. రమేష్ మా అందరినీ అద్భుతంగా చూపించారు. డబ్బింగ్ చెప్పేటప్పుడు ఇతర సీన్లను కూడా అడిగి చూశాను. కెమెరా యాంగిల్‌తోనే సస్పెన్స్‌ను క్రియేట్ చేశారు. అలా దర్శకుడు, కెమెరామెన్ కలిసి అద్భుతం చేశారు. 70 ఏళ్లు దాటినా కూడా నేను కొత్త కొత్త పాత్రల్ని చేయాలని అనుకుంటున్నాను. రెగ్యులర్ పాత్రల్ని కాకుండా 'బార్బరిక్' లాంటి కొత్త పాత్రల్ని మరిన్ని చేయాలని అనుకుంటున్నాను. నా డియర్ ఫ్రెండ్ మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే సందర్భంగా ఆగస్ట్ 22న ఈ చిత్రం విడుదల కాబోతోంది. చిరంజీవి కంప్లీట్ యాక్టర్. ఆయన గొప్ప నటుడు, డ్యాన్సర్, అద్భుతమైన వ్యక్తి. మా మూవీ ఆయన పుట్టిన రోజున రిలీజ్ అవుతుండటం ఆనందంగా ఉంది అని అన్నారు. ఉదయ భాను మాట్లాడుతూ నేనేమీ సినిమాలకు దూరంగా ఉండలేదు. నాకు నచ్చిన పాత్రలు వస్తేనే నటిస్తున్నాను. ఆర్టిస్టులకు ఉండే ఆకలిని తీర్చే పాత్రలో ప్రస్తుతం నటించాను. 'బార్బరిక్' చిత్రంలో ఓ ఛాలెంజింగ్ పాత్రను మోహన్ గారు నాకు ఇచ్చారు. ప్రతీ పాత్రను నేను ప్రాణం పెట్టి పోషిస్తాను. నాకు రాజేష్ మంచి స్నేహితుడు. ఆయన ఏ ప్రాజెక్ట్ చేస్తున్నా కూడా నన్ను కన్విన్స్ చేస్తుంటారు. మోహన్ నెరేట్ చేసినప్పుడు ఆ కథ, ప్రతీ సీన్ నా కంటికి కనిపించింది. మన భాషలో ఇలాంటి చిత్రాలెందుకు రావు? అని అంతా అంటుంటారు. అలాంటి వారిని ఆశ్చర్యపరిచేలా మా చిత్రం ఉంటుంది. విజయ్ పాల్ గారు చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్. ఇలాంటి నిర్మాతలకు సక్సెస్ వస్తే ఇంకెంతో మందిని పైకి తీసుకు వస్తారు. వశిష్ట చాలా మంచి వ్యక్తి. క్రాంతి ఎనర్జీ నెక్స్ట్ లెవెల్లో ఉంటుంది. సాంచీ, మేఘన అందరం కలిసి ఎంతో సరదాగా షూటింగ్ చేశాం. రమేష్ మా అందరినీ చక్కగా చూపించారు. సత్య రాజ్‌తో పని చేయడం మా అదృష్టం. ఆయన ఎంతో ఒదిగి ఉంటారు. ఆయన్నుంచి మేమంతా ఎంతో నేర్చుకున్నాం. ఈ చిత్రం అందరికీ కన్నుల పండువగా ఉంటుంది. అందరూ చూసి ఆదరించండి అని అన్నారు.

వశిష్ట ఎన్ సింహా మాట్లాడుతూ,'త్రిబాణధారి బార్బరిక్ నాకెంతో ప్రత్యేకం. మోహన్ చెప్పిన కథ విన్నప్పుడే టైటిల్ చాలా కొత్తగా అనిపించింది. కథ, స్క్రీన్ ప్లే చాలా బాగా అనిపించింది. ఇది చిన్న సినిమా అని మోహన్ నాకు ఓ కథ చెప్పారు. కానీ సెట్ మీదకు వచ్చిన తరువాత ఇది చిన్న సినిమా కాదని నాకు అర్థమైంది. ఇంత మంచి చిత్రాన్ని ఇచ్చిన మోహన్‌కి థాంక్స్. ఇలాంటి చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. నన్ను ఈ మూవీలో చాలా కొత్తగా చూపించారు. ఇందులో ప్రతీ పాత్ర అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. విజయ్ చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్. సత్య రాజ్ గారితో పని చేయడం ఆనందంగా ఉంది. ఉదయ భాను ఆరా నెక్స్ట్ లెవెల్. క్రాంతి, సాంచీ, మేఘన, కార్తికేయ అందరూ అద్భుతంగా నటించారు. ఈశ్వర్ కొరియోగ్రఫీ చాలాకొత్తగా ఉంటుంది. కెమెరామెన్ రమేష్ పని రాక్షసులు. నేను చిరంజీవి అభిమానిని. ఆయన బర్త్ డే సందర్భంగా ఆగస్ట్ 22న ఈ చిత్రం విడుదల కాబోతోంది. అందరూ చూడండి అని అన్నారు..ప్రొడ్యూసర్ విజయ్ పాల్ రెడ్డి అడిదెల మాట్లాడుతూ మా 'బార్బరిక్' చిత్రం ఆగస్ట్ 22న రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి

## ఆడియన్స్ థ్రిల్‌అయ్యే సినిమా 'బకాసుర రెస్టారెంట్'



యమలీల, ఘటోత్కచుడులా తరహాలో ఆడియన్స్‌ను థ్రిల్ ఫీలయ్యే సినిమా 'బకాసుర రెస్టారెంట్: దర్శకుడు ఎస్‌జే శివ 'బకాసుర రెస్టారెంట్' అనేది ఇదొకకొత్తజానర్‌తోపాటు కమర్షియల్ ఎక్స్‌పరిమెంట్. ఇంతకు ముందు వచ్చిన యమలీల,ఘటోత్కచుడులాఆడియన్స్ థ్రిల్లింగ్‌గా ఫీలయ్యే కథ ఇది. ఇలాంటి కొత్త కథలనే జనాలు ఆదరిస్తారనే నమ్మకం వుంది. మన జీవితంలోకి ఓ తిండిబోతు దెయ్యం వస్తే ఆ తిప్పలు ఎలా ఉంటాయి అనేది కథ. సినిమా మొత్తం కంప్లీట్ ప్యాకేజీలా ఉంటుంది. హారర్ థ్రిల్లర్,కామెడీ, ఎమోషన్ అన్నీ ఉంటాయిఖీ అంటున్నారు దర్శకుడు ఎస్‌జే శివ. ఆయన దర్శకత్వంలో కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్', ఈచిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్,ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హాంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఆగస్టు 8న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమోతుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఎస్‌జే శివతో జరిపిన ఇంటర్వ్యూ ఇది.

**బకాసుర రెస్టారెంట్ ఎలాంటి కథాంశం ?**
బకాసుర ఎంటర్‌టైన్‌మెంట్ అనేది ఒక హాంగర్ కామెడీ ఎంటర్‌టైనర్. ఇప్పటి వరకు తెలుగులో చాలా జోనర్‌లు వచ్చాయి. ఇదొక కొత్త జోనర్. మా సినిమాతోనే ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. ఇదొక తిండిబోతు కథ. దానిని నుంచి వచ్చే కామెడీ కాబట్టి హాంగర్ కామెడీ అంటున్నాం. ఫైనల్‌గా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడమే మా లక్ష్యం.

**ఈ సినిమాలో హీరోగా కమెడియన్ ప్రవీణ్‌ను తీసుకోవడానికి కారణం ఏమిటి?**
మొదట వేరే హీరోలతో డిస్కస్ చేశాం. కానీ అందరూ సోలో హీరో కథలైతే చేస్తాం అన్నారు. కానీ ఈ కథ అలాంటిది కాదు. ఆ సమయంలోనే ప్రవీణ్ కూడా హీరోగా ఇంట్రడ్యూస్ అయ్యే ప్లానింగ్‌లో వున్నాడని తెలిసి ఆయన్నీ కలిశాం.ఐదుగురు బ్యాచిలర్స్ మధ్య జరిగే కామెడీ కథ ఇది. ఇక ఈ కథ వినగానే ప్రవీణ్ ఈ సినిమాకు కథే హీరో.. తప్పకుండా మనం చేద్దా అన్నాడు.

**ఇది బకాసుర రెస్టారెంట్‌లో జరిగే కథనా?** రెస్టారెంట్ పెట్టడమే కథ. రెస్టారెంట్ పెట్టాలని కలలు కనే ఓ యువకుడి కథ ఇది. ఈ అంశానికి హారర్, థ్రిల్లింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్ అంశాలు జోడించాం. ఇదొక క్లీన్ కామెడీ.. అందరూ ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ చిత్రమిది. **ఇదొక కొత్త జానర్.. ఎక్స్‌పెరిమెంట్ అనుకోవచ్చా?**
నిజమే ఇదొక కొత్తజానర్‌తో పాటు కమర్షియల్ ఎక్స్‌పరిమెంట్ అనుకోవచ్చు. **మీ తొలి సినిమా అనుభవం ఎలా ఉంది?**
సినిమా తీయడం చాలా టఫ్.. ఇక్కడ సినిమా బిజినెస్‌లో ఎవరైనా కథ ఏమిటి? ఎలా ఉండబోతుంది? అని అడగటం లేదు. ప్యాడింగ్ ఎవరు? ఎంత పెట్టారు? ఎంత ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు అని అడుగుతున్నారు. సినిమా అనేది ఎంటర్‌టైన్‌మెంట్ కానీ దాని గురించి తప్ప అన్నీ అడుగుతున్నారు.

**భవిష్యత్‌లో ఎలాంటి సినిమాలను తీస్తారు?** నాకు విఠలాచార్య లాంటి సినిమాలు అంటే ఇష్టం.


**మీ తదుపరి చిత్రం కూడా మీ బ్యానర్‌లోనే చేస్తారం?** మా ఎస్‌జే బ్యానర్‌లో కొత్త దర్శకులకు మాత్రమే అవకాశం. సో.. నా తదుపరి చిత్రం ఇందులో ఉండదు. ఈ బ్యానర్‌లో వరుసగా సినిమాలు చేస్తాం. **దర్శకుడిగా మీ లక్ష్యం ఏమిటి?**
చాలా తక్కువ వర్కింగ్‌డేస్‌లో సినిమాలు చేయడం అంటే ఇష్టం.. అప్పుడూ అందరూ బాగుంటారు. మా బకాసుర రెస్లారెంట్ ఐదు కోట్ల రూపాయాలతో తీసిన 12 కోట్ల రూపాయాల అవుట్‌పుట్ కనిపిస్తుంది.

## 'ప్రేమలో రెండోసారి' లిరికల్ సాంగ్ రిలీజ్



బి.వేణుగోపాలస్వామి. చార్టెడ్ అకౌంటెంట్ . చేతుల మీదుగా 'ప్రేమలో రెండోసార్లి లిరికల్ వీడియో విడుదల.సాకేరామయ్య సమర్పణలో సిద్ధ క్రియేషన్ బ్యానర్‌లోసత్యమార్క దర్శకత్వంలో, ప్రొడ్యూసర్ సాకే నీరజ లక్ష్మీ నిర్మిస్తున్న చిత్రం 'ప్రేమలో రెండోసార్లి. ఈ చిత్రానికి సంబంధించి లిరికల్ వీడియో సాంగ్ ని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత తీ వేణుగోపాలస్వామి. చార్టెడ్ అకౌంటెంట్. చేతుల మీదుగా 'ప్రేమలో రెండోసార్లి లిరికల్ వీడియో విడుదల చేయడం జరిగినది. ఈ సందర్భంగా తీ వేణుగోపాల స్వామి మాట్లాడుతూ 'ప్రేమలో రెండోసార్లి చిత్ర టైటిల్ చాలా బాగుంది. ఈ జనరేషన్ యువతకు ఈ సినిమా ఎంతో నచ్చుతుందని, ప్రతి ఒక్కరి జీవితంలో ఒకసారి ప్రేమకు దూరమైనప్పుడు ఏదో ఒక సందర్భంలో మరోసారి ప్రేమలో పడడం సహజం కాబట్టి తెలుగు ప్రేక్షకులకు నీ అలరిస్తుందని అన్నారు. సాంగ్స్ చాలా మెలోడీగా ట్రెండింగ్‌గా ఉన్నాయని, కచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని ,మ్యూజిక్ డైరెక్టర్ రమణ సాకే ని అభినందించారు. ఈ సాంగ్ లోనే సినిమా ప్రతిభ,టీం యొక్క కృషి ఎంతగానో తెలుస్తుందని, టీం అందరికి అల్ ది బెస్ట్ చెబుతూ వారిని అభినందించారు. ఈ సినిమా చక్కటి ప్రేక్షకాదరణ పొందుతుందన్న నమ్మకం నాకుంది అన్నారు. హీరో రమణ సాకే గుడ్ లుకింగ్ తో యువతను ఆకర్షించేలా నటించారని ఎన్నో సినిమాల్లో అవకాశం రావాలని టాప్ హీరోల స్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో, మ్యూజిక్ డైరెక్టర్ రమణ సాకే మాట్లాడుతూ, ఈ సినిమాలో 7 సాంగ్స్ ఉన్నాయని, ప్రతి ఒక్కటి సందర్భానికి తగినట్లు చాలా మెలోడీగా వచ్చాయని, సినిమా మ్యూజిక్ మొత్తం ప్రేక్షకులను మంత్రం ముద్దుల్ని చేస్తుందని సినిమా చూసేటప్పుడు ఆడియన్స్ వారిని వారు మరిచిపోయి సినిమాలో లీనమైపోతారని ఆ విధంగా ఈ సినిమా ఎంతో హిట్ అవుతుందని చెప్పారు. ఈ సినిమా నేటి పెద్దలకు పిల్లలకు, యువతీ యువకులకు ,బాగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని అందుకుంటుందన్న నమ్మకం ఉందన్నారు. డైరెక్టర్ సత్యమార్క మాట్లాడుతూ, మా హీరో కొత్త వారు అయినా చాలా బాగా నటించారు. వనిర్మాత సాకే నీరజ లక్ష్మీ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఖర్చు పెట్టారని చెప్పారు, బి వేణుగోపాల స్వామి లిరికల్ వీడియో లాంచ్ చేసి సపోర్టు చేసినందుకు కృతజ్ఞతలు. తెలుపుకున్నారు. ఇందులో నటీ నటులు: హీరో రమణ సాకే, హీరోయిన్ వనిత గౌడ, జబర్దస్త్ శ్రీను, బాబీ, దుర్గారావు, జబర్దస్త్ ఫణి, రాణి, సతీష్ సారపల్లి, చిరంజీవి, విక్టర్,సుజిత్, ప్రదీప్, బి ఎస్ మన్యం, అవ్వరు సురేష్ తదితరులు నటించారు.

## 'మాస్‌జాతర' నుంచి ఓలేఓలే సాంగ్‌అదుర్స్



విజయ్ దేవరకొండ మాస్ మహారాజా రవితేజ 'మాస్ జాతర్ల చిత్రం నుంచి రెండవ గీతం 'ఓలే ఓల్లే విడుదల భీమ్స్ సిసిరోలియో శైలిలో ఉత్సాహభరిత గీతంగా 'ఓలే ఓల్లే తమ ఎనర్జీతో పాటను మరో స్థాయికి తీసుకెళ్ళిన రవితేజ, శ్రీలీల జోడి. మాస్‌మహారాజారవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం 'మాస జాతర్ల. భాను భోగ వరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్ టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతా కాలపై సా ాయ్ దే వ ంా నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. 'మాస్ జాతర్ల కోసం అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను మెప్పించి.. సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేసింది. మొదటి గీతంగా విడుదలైన 'తు మేరా లవర్ల అందరినీ ఉర్రూతలూ గించింది. ఇప్పుడు రెండవ గీతంగా 'ఓలే ఓల్లేను విడుదల చేసింది చిత్ర బృందం. అందరూ కాలు కదిపేలా ఎంతో ఉత్సాహభరితంగా ఈ గీతముంది. ధమాకా జోడి రవితేజ,శ్రీలీల తెరపై కనిపిస్తే ఆ సందడే వేరు. 'ఓలే ఓల్లే పాటతో ఈ జోడి మరోసారి ఆకట్టుకుంది. ఇద్దరూ పోటాపోటీగా నర్తించి పాటను మరో స్థాయికి తీసుకెళ్ళారు. రవితేజ తన వింటేజ్ స్టెప్పులతో అలరించారు. శ్రీలీల తన అసాధారణ నృత్య ప్రతిభతో మరోసారి కట్టిపడేశారు. ఇద్దరూ కలిసి ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా తెరపై మెరుపులు మెరిపిస్తున్నారు. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో తనదైన శైలిలో స్వరపరిచిన 'ఓలే ఓల్లే మాస్ రాజా అభిమానులకు, మాస్ ప్రేక్షకులకు విందు భోజనంలా ఉంది. థియేటర్లలో ప్రేక్షకుల చేత.. ఈలలు, చప్పట్లతో స్టెప్పులు వేయించేలా ఎంతో ఉత్సాహభరితంగా ఈ గీతం సాగింది. ఇక ప్రతిభావంతులైన రోహిణి సోరట్ తన గాత్రంతో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. భాస్కర్ యాదవ్ దాసరి అందించిన సాహిత్యం ఉల్లాసంగా, ఆకర్షణీయంగా ఉంది. పాట యొక్క మూడ్‌కి సరిగ్గా సరిపోయే మాస్ ఫ్లేవర్‌తో ఆయన సాహిత్యం నిండి ఉంది. సంగీతం, సాహిత్యం, గాత్రం అన్నీ చక్కగా కుదిరి.. 'ఓలే ఓలే'ను అదిరిపోయే మాస్ గీతంగా మలిచాయి. దర్శకుడు భాను బోగవరపు.. రవితేజ అభిమానులతో పాటు, మాస్ ప్రేక్షకులు మెచ్చే విధంగా 'మాస్ జాతర'ను మలుస్తున్నారు. పాటల విషయంలోనూ ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

మాస్ రాజా వింటేజ్ వైబ్స్, కమర్షియల్ హంగులతో ఈ చిత్రంతో థియేటర్లలో మాస్ పండుగను తీసుకురాబోతున్నారు. వరుస ఘన విజయాలతో దూసుకుపోతున్న ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్యతో కలిసి 'మాస్ జాతర్ల చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. 'మాస్‌జాతర్ల సినిమాపై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. ఫుల్ మీల్స్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం ఆగస్టు 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. తారాగణం: రవితేజ, శ్రీలీల,దర్శకత్వం: భాను బోగవరపు. నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, సంగీతం: భీమ్స్ సిసిరోలియో,కూర్పు: నవీన్ నూలి,ఛాయాగ్రహణం: విధు అయ్యన్న మాటలు: నందు సవిరిగాన కళా దర్శకత్వం: శ్రీ నాగేంద్ర తంగాల,ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఫణి కె. వర్మసమర్పణ: శ్రీకర స్టూడియోస్ నిర్మాణ సంస్థలు: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, పీఆర్‌ఓ: లక్ష్మీవేణుగోపాల్ .

## 'చిత్రాలయం 'బ్యానర్‌పై కొత్త చిత్రం ప్రారంభం



.చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబర్ 3గా వేణు దోనేపూడి నిర్మాతగా కొత్త చిత్రం ప్రారంభం..చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెంబర్ 3గా వేణు దోనేపూడి నిర్మాతగా గుణి మంచికంటి దర్శకత్వంలోఅతిరథ మహారథుల సమక్షములో కొత్త సినిమాను ప్రారంభమైంది. టినును ఆనంద్,ఉపేంద్ర,జార్జ్‌మరియన్,అక్షయ్, విష్ణు, కార్తికేయ,ఆస్తా,మాళవితదితరులు ప్రధాన పాత్రలో రూపొందనున్నఈచిత్ర ప్రారంభోత్సవం ఘనంగాజరిగింది. ఈచిత్రానికి కొండల్ జిన్నా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఈ కార్యక్రమానికి రమేష్ ప్రసాద్ అక్కినేని, ఆది శేషగిరి రావు ఘట్టమనేని, కేఎస్ రామారావు, డైరెక్టర్ పి. మహేష్ బాబు, కేఎల్ నారాయణ, తమ్మారెడ్డి భరద్వాజ్, పరుచూరి గోపాలకృష్ణ, బి గోపాల్, కోటగిరి వెంకటేశ్వరరావు, మాధవపెద్ది సురేష్, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు వంటి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ముహూర్తపు సన్నివేశానికి రమేష్ ప్రసాద్ అక్కినేని స్క్రిప్ట్‌ను అందించగా.. ఆది శేషగిరి రావు క్లాప్ కొట్టారు. కేఎస్ రామారావు కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. మహేష్ బాబు.పి గౌరవ దర్శకత్వం వహించారు. నేపాల్ దేశ రాజవంశానికి చెందిన సమృద్ధి ఈ చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమవుతోంది. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరికొన్ని ఇంట్రెస్టింగ్ అప్‌డేట్స్ తెలియజేస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది.నటీనటులు : టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్, కార్తికేయ, అభినవ్, హర్ష, కిషోర్ కృష్ణ, ఆస్తా, మాళవి, సమృద్ధి, విష్ణు ఓయ్, కె.ఎల్.దామోదర్ ప్రసాద్, అనీష్ కురివిల్లా, కాదంబరి కిరణ్ తదితరులు. సాంకేతిక బృందం : బ్యానర్ : చిత్రాలయం స్టూడియోస్, నిర్మాత : వేణు దోనేపూడి, సహ నిర్మాత : కొండల్ జిన్నా,దర్శకత్వం : గుణి మంచికంటి ,సంగీతం : స్టీఫెన్, ఆనంద్,ఆర్ట్ : సాహి సురేష్, ఎడిటింగ్ : విజయ్ ముక్తవరపు, కెమెరామెన్ : అజయ్ అబ్రహం, జార్జ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వైశాఖ్ నాయర్‌కో డైరెక్టర్ : కిషోర్,కాస్ట్యూమ్స్ : ప్రియాంక, కొరియోగ్రఫీ : జెడి. మాస్టర్, యాక్షన్స్, నటరాజ్, పి.ఆర్.ఒ : మోహన్ తుమ్మల.

## ఆగస్టు 15న స్ట్రీమింగ్ జె.ఎస్‌కె జానకి వర్సస్ స్టేట్ ఆఫ్‌కేరళ



జీ5లో ఇండిపెండెన్స్ డే సందర్భంగా పవర్ ఫుల్ లీగల్ డ్రామా 'జె.ఎస్.కె జానకి వి వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ్ల ఆగస్టు 15 నుంచి స్ట్రీమింగ్.. భారత దేశంలోని అతిపెద్ద స్వదేశీ ఓటిటి ప్లాట్‌ఫారమ్ అయిన 5 2025లో మరో సూపర్‌హిట్ ప్రీమియర్‌తో ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. సంక్రాంతికి వస్తున్నం, రాబిన్‌హుడ్, భైరవం వంటి వరుస తెలుగు సూపర్‌హిట్‌లను అందించిన తర్వాత జీ5 తెలుగు ఇప్పుడు మరో అద్భుతమైన సినిమాను అందించబోతోంది. విమర్శకుల ప్రశంసలు పొందిన మాలీవుడ్ లీగల్ డ్రామా 'జె.ఎస్.కె జానకి వర్సస్‌స్టేట్ ఆఫ్ కేరళ్ల తెలుగు ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధంగా ఉన్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళ, కన్నడ, హిందీ భాషలలో స్ట్రీమింగ్ కానుంది.సురేష్ గోపి, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన జె.ఎస్.కె మూవీకి ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహించగా.. కాస్మోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రి. ఫణీంద్ర కుమార్ నిర్మించారు. ఈ చిత్రంలో గిరీష్ నారాయణన్ స్వరపరిచిన పాటలు, గిబ్రాన్ అద్భుతమైన నేపథ్య సంగీతం స్పెషల్ అట్రాక్షన్ కానున్నాయి. ఈ చిత్రానికి రెనదివే సినిమాటోగ్రఫీ అందించారు. ఈ ఆగస్టు 15న 'జె.ఎస్.కె జానకివర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ' ప్రత్యేక డిజిటల్ ప్రీమియర్‌ను జీ5లో మాత్రమే చూడండి. ఈ స్వాతంత్ర్య దినోత్సవం, ఈ వీకెండ్‌ను ఉత్కంఠభరితమైన కోర్టు డ్రామాతో ఎంజాయ్ చేయండి. ప్రఖ్యాత న్యాయవాది డేవిడ్ అబెల్ డోనోవన్ (సురేష్ గోపి) సహాయంతో లైంగిక వేధింపుల నుండి బయటపడిన జానకి విద్యాధరన్ (అనుపమ పరమేశ్వరన్) చుట్టూ ఈ కథ తిరుగుతుంది.జీ512 భాషల్లో అత్యద్భుతమైన కంటెంట్‌ని ప్రేక్షకులకు అందించగలుగుతోంది.

## సు ఫ్రమ్ సో' ఎంటర్‌టైనింగ్ ట్రైలర్



2019మైత్రి మూవీ మేకర్స్ 'సు ఫ్రమ్ స్లో ఎంటర్‌టైనింగ్ రైడ్ ట్రైలర్ రిలీజ్‌లేటెస్ట్ కన్నడ బ్లాక్ బస్టర్ 'సు ఫ్రం స్లో ఇప్పుడు తెలుగు ప్రేక్షకులుని ఆలరించడానికి రెడీ అయ్యింది. మంచి కంటెంట్ కి మద్దతుగా నిలిచే మైత్రీ మూవీ మేకర్స్ ఈ రూరల్ కామెడీ హారర్ సినిమాని ఆగస్ట్ 8న రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. జెపీ తుమినాడ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలుగు ట్రైలర్ రిలీజ్ అయ్యింది.

గ్రామీణ జానపద కథలు, మూఢనమ్మకాలు, హిలేరియస్ కామెడీ – ఇవన్నీ మిక్స్ అయ్యి వినోదాత్మక ప్రయాణమే సు ఫ్రం సో. కథ ఓ పల్లెటూర్లో జరుగుతున్న విచిత్ర సంఘటనల చుట్టూ తిరుగుతుంది. ఆ గ్రామానికి 'సోమేశ్వర్ల నుంచి వచ్చిన సులోచన కారణంగా ఊరు మొత్తం గందరగోళంలో పడుతుంది.

ఆ తర్వాత నవ్వుల హంగామా మొదలవుతుంది. ఈ సినిమాలో శనీల్ గౌతమ్ ఎనర్జిటిక్ పాత్రలో అలరించారు. శాంధ్య ఆరకెరె, జెపీ తుమినాడ్, ప్రకాశ్ తుమినాడ్, రాజ్ బి శెట్టి (కోప్రొడ్యూసర్ ) పాత్రలు కూడా ఆకట్టుకున్నాయి.

'సుఫ్రం సో రెగ్యులర్ హారర్ కామెడీల్లా కాకుండా గమ్మత్తైన రైటింగ్, అలరించే పాత్రలు, మంచి హాస్యంతో ఆకట్టుకునే సినిమా. ఎస్. చంద్రశేఖరన్ సినిమాటోగ్రఫీ ఆ ఊరి అందాన్ని చూపిస్తే, సుమేధ్ కె, సందీప్ తులసిదాస్ అందించిన సంగీతం సినిమాకి మరింత జోష్ తీసుకొస్తుంది.ఈ ఆగస్ట్ 8న తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా నవ్వులు ప్రయాణం కాబోతోంది.తారాగణం: షనీల్ గౌతమ్, జెపి తుమినాడ్, సంధ్య అరకెరె, ప్రకాష్ కె తుమినాడు, దీపక్ రాయ్ పనాజే, మైమ్ రాందాస్.సాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం : జెపి తుమినాడ్,నిర్మాతలు: శశిధర్ శెట్టి, బరోడా, రవి రాయ్ కలస, రాజ్ బి శెట్టితెలుగు రిలీజ్: మైత్రి మూవీ మేకర్స్,డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ :ఎస్.చంద్రశేఖరన్‌సంగీతం : సుమేద్ కె బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: సందీప్ తులసీదాస్‌పిఆర్‌ఓ: వంశీ శేఖర్,మార్కెటింగ్ : ఫస్ట్ షో.

## 'ఆశికా రంగనాథ్' బర్త్ డే స్పెషల్



టాలీవుడ్ లెజెండరి హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న అవైటెడ్ విజువల్ వండర్ చిత్రమే "విశ్వంభర". యువ దర్శకుడు వశిష్ఠ తెరకెక్కించిన ఈ భారీ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ సినిమాలో మెగాస్టార్ సరసన ఇద్దరు హీరోయిన్స్ త్రిషఅలాగే ఆషిక రంగనాథ్‌లు నటిస్తుండగా నేడు ఆషిక బర్త్ డే కానుకగా మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్‌ని విడుదల చేయడం జరిగింది. రి ఈ సినిమాలో ఆషిక లుక్ మాత్రం ఎంతో అందంగా చూసేందుకు ముచ్చటగా కనిపిస్తుందని చెప్పాలి. దీనితో అభిమానులు కూడా ఈ పోస్టర్ చూసి ఆషిక అందానికి ముగ్ధులు అవుతున్నారు.

అలాగే అతి త్వరలోనే సినిమా విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

# ఈ కాలంలో ఏం తినాలి? ఏం తినకూడదు?



వర్షాకాలంలో చాలామంది జబ్బు పడుతుంటారు. ఇందుకు వాతావరణంలో జరిగే మార్పులే కాదు. మనం తీసుకునే ఆహారం కూడా ఓ కారణమే అంటూన్నరు నిపుణులు. జీర్ణక్రియ మందకొడిగా ఉండే ఈ కాలంలో తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిదంటూన్నరు. మరి, ఈకాలంలో ఫుడ్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం..

**ఫ్రైడ్ ఫుడ్.. వద్దు !.....** వర్షాకాలంలో నూనెలో వేయించిన పదార్థాలు, ఫ్రైడ్ ఫుడ్స్ మంచివి కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈ కాలంలో వాతావరణంలో తేమ పెరిగి జీర్ణ వ్యవస్థపనితీరు మందగిస్తుంది. కాబట్టి ఈ సమయంలో నూనె సంబంధిత పదార్థాలు తినడం వల్ల అవి తొందరగా జీర్ణం కావు. ఫలితంగా జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. అంతేకాదు.. ఇలాంటి అనారోగ్యపూరిత ఆహారం బరువు పెరిగేలా చేసి ఇతర అనారోగ్యాలకూ దారితీస్తుంది. అందుకే వీటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

**ఇవి తొనద్దు !.......** అలాగే వర్షాకాలంలో బయట దొరికే చాట్, పానీపూరీ, కట్‌లెట్, పావ్‌బాజీ, వంటి పదార్థాలు తినడం వల్ల విరేచనాలు, పచ్చకామెర్లు.. వంటి సమస్యలు రావచ్చంటున్నారు నిపుణులు. ఇందుకు వాటి తయారీలో వాడే కలుషితమైన నీరే కారణం. అలాగే వీటితో పాటు బయట దొరికే పండ్ల రసాలకు కూడా దూరంగా ఉండాలి. అంతగా కావాలనుకుంటే ఇంట్లో స్వయంగా తయారుచేసుకొని తీసుకోవాలి.



**కడిగాకే తినాలి...** ఆకుకూరలు మట్టిలో మొలకెత్తుతాయి. వీటిని నేరుగా భూమిలోంచి తీసి కట్టలు కట్టి అమ్ముతుంటారు. ఈ క్రమంలో మట్టిలోని క్రిములు, పురుగులు ఈ ఆకులపై చేరతాయి. ఆకుల రంగులోనే కలిసిపోయిన ఈ పురుగుల్ని కనిపించ కుండా ఆకుల్ని అలగే కట్‌చేసి తీసుకోవడం వల్ల నక్రిములు కడుపులోకి చేరతాయి. కాబట్టి ఒక్కో ఆకు పరిశిలించకే తరుక్కోవాలి. అలాగే శుభ్రంగా కడిగాకే వండుకోవాలి. భూమిలో మొలకెత్తే పుట్టగొడుగులు, దుంపలకూ ఇది వర్తిస్తుంది.

**కావాల్సినప్పుడే...** ఆఫీసులకు వెళ్లే మహిళలు పండ్లు, కూరగాయలు ముందురోజు రాత్రే కట్‌చేసుకొని పెట్టుకుంటారు. అయితే వర్షాకాలంలో ఈ పద్ధతి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎదుకంటే కట్ చేసుకొని పెట్టుకున్న పండ్లు, కాయగూరల ముక్కల్ని ఎంత జాగ్రత్తగా భద్రపరచినా.. ఈ కాలంలో వాతావరణంలో తేమ అధికంగా ఉండడం వల్ల వాటిపై బ్యాక్టీరియా చేరే అవకాశం ఉంటుంది. వీటిని అలాగే తీసుకోవడం వల్ల లేనిపోనీ ఆరోగ్య సమస్యలొస్తాయి. కాబట్టి వీటిని ఎప్పటికప్పుడే కట్ చేసుకోవడం మంచిది.

**మాంసాహారం...** ఈ కాలంలో మాంసాహారం ఎక్కువగా తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తె అవకాశం ఉంటుంది. ఈ సమయంలో జీర్ణవ్యవస్థ పనితీరు నెమ్మదించడమే ఇందుకు కారణం. కాబట్టి వానాకాలంలో వీటికి సాధ్యమైనత దూరంగా ఉండడమే మేలంటున్నారు నిపుణులు ఇక చేపలు, రొయ్యలు.. వంటి సీఫుడ్‌ని సైతం దూరం పెట్టేయడమే మంచిదంటున్నారు.



# ఆర్థిక స్థిరత్వం చాలా ముఖ్యం




ఆ ఇంట్లోవాళ్లు కోడికూతతో నిద్రలేస్తారు. లేగదూడలతో దోస్తీ చేస్తారు, ఉడుతలతో ఆటలాడుతారు. వీళ్లుండేది ఏదో మారుమూల ప్రాంతంలో కాదు, ఆధునికత అందినంత కాలంలోనే ఉన్నా, వద్దనుకుని ప్రకృతి జీవనాన్ని ఎంచుకుంది శ్రావణ లక్ష్మి కుటుంబం! ఆ ప్రయాణం గురించి తెలుసుకుందాం..

మేం ఉంటున్నది బాపట్ల జిల్లా, మార్టూరు దగ్గరలోని బొబ్బేపల్లిలో, ఇరుగుపొరుగు ఎవరూ లేరు. అందుకంటే మేం ఇల్లు కట్టుకున్నది పొలాల మధ్యలో. కాలుష్యానికీ, రణగొణ ధ్వనులకు రంగా ప్రకృతి ఒడిలో బతకాలన్న ఉద్దేశ్యంతో ఈ ప్రదర్శనను ఎంచుకోవచ్చు. మా సొంతూరు గుంటూరు దగ్గర్లోని కాకుమాను. ఎంబీఏ పూర్తయ్యాక హైదరాబాద్‌లో ఉద్యోగం చేశా. 2016లో వెళ్లింది. మావారు జీవీ ప్రభుత్వోద్యోగి, ఆయన ఉద్యోగరీత్యా అప్పట్లో ప్రకాశం జిల్లాలో ఉండేవాళ్లం. మా పెద్దబ్బాయికి ఏడు నెలల తర్వాత ఫిట్స్ వచ్చాయి. హాస్పిటల్లో ఉండటం, విపరీతంగా మందులు వాడటం, బాబు చేతికి సూదులు... ఆ అనుభవం నా ఆలోచనల్ని మార్చేసింది. ఉన్నది ఒక్కటే జీవితం... బతకాల్సిన విధానం ఇది కాదనిపించింది. పిల్లలకు ఆరోగ్యకరమైన పాలైనా ఇవ్వలేకపోతున్నామని... పుంగనూరు ఆవు కొన్నాను. ఆ తర్వాత నా ఆలోచనలకు కొత్త రెక్కలు వచ్చాయి. రెండోవాడు పుట్టాక జీవన విధానమే అమరిపోవాలనుకున్నా. మరో 20 ఏళ్లకూ కాలుష్యం చేరని ప్రాంతంలో నివాసం ఏర్పాటుచేసుకోవాలనుకున్నా. మావారు పెద్దగా అభ్యంతరం చెప్పలేదు కానీ, అమ్మానాన్న, అత్తమామ వ్యతిరేకించారు.

**మొండి పట్టు వీడితేగా!**

ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో స్థలం తీసుకుని, ఇల్లు కట్టుకున్నాం. ముగ్గురు పిల్లలతోపాటు నాలుగేళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. మొదట్లో కనీస సౌకర్యాలకూ ఇబ్బందే. క్రమంగా ఒక్కోటీ సమకూర్చుకుంటూ వచ్చాం. పండ్లూ, కూరగాయాలూ ఇక్కడే... ప్రకృతిలో బతకడం అంటే కిటికీ దగ్గరో, బాల్కనీలోనో కూర్చొని పరిసరాల్ని చూటం కాదు. ఆ జీవనశైలినీ భాగం చేసుకోవాలి. సూర్యోదయానికి ముందే మొదలై, సూర్యాస్తమయంతో మా రోజు ముగుస్తుంది. ప్రకృతితోనే చుట్టరికం, మూగజీవాలతోనే నేస్తరికం. రసాయనాలుండే బూత్‌పేస్ట్‌ని పొద్దున్నే నోట్లో పెట్టడడం ఎందుకు? బదులుగా ఆవు కచ్చిక, వేప పుల్లని ఉపయోగిస్తాం. సబ్బులూ, షాంపూలూ నిషేధమే. నేనే రోజూ వాకిలి ఊడ్చి, కల్లాపి చల్లి, ముగ్గుపెడతా. పేడ తీస్తా, పశువులకు దాణా పెడతా, పాలు పితుకుతా, వంట చేస్తా దీన్లో శారీరక శ్రమ ఉంటుంది. అయినా భయపడను. మొదట్లో ప్రకృతి నన్ను పరీక్షించింది. దాన్లో నిలిచి గెలిచాను, పిల్లల్ని ఈ ఊళ్లోనే ప్రభుత్వ స్కూల్లో చదివిస్తున్నా. వాళ్లూ చేతనైన పనులువాటినే ఇస్తాను.



అందుకు ఆహార వనం సృష్టించు కుంటున్నాం. మామిడి, అరటి, జామ, సపోటా, ఈత సహ 20 రకాల పండ్ల చెట్లు ఉన్నాయి పది రకాల కూరగాయల్నీ పండిస్తాం. మొక్కలంటే మావారికీ ఇష్టం. భిన్న రకాలను తెస్తుంటారు. 100 వరకూ నాటుకోళ్లు, పది ఆవులు ఆరు ఎద్దులు, బాతులు, కుందేళ్లు ఉన్నాయి. వీటికితోడు వందల పక్షులు అతిథులుగా వస్తాయి. బియ్యం, పప్పులు మాత్రం బయటకొంటాం. వాటినీ పండించాలనేది నా లక్ష్యం. ఆహారంలో నూనెకూ ప్రాధాన్యం ఉంది. అందుకే ఎద్దుగానుగ ఏర్పాటుచేసుకుని సొంత తయారీ మొదలుపట్టా. మా పిల్లలకు 20 ఏళువచ్చేంతవరకైనా ఈ వాతావరణంలోనే పెంచుతా. తర్వాత ఏం చేయాలి, ఎక్కడ ఉండాలన్నది వాళ్ల ఇష్టం నేనైతే వాళ్లని రైతుల్ని చేయాలనుకుంటున్నా.!

**ఆర్థిక స్థిరత్వం ముఖ్యం..** ఈ ధైర్యం, పట్టుదల ఎక్కణ్నుంచి వచ్చాయని అడుగుతుంటారు చాలామంది. అమ్మానాన్న, అమ్మమ్మల నుంచే వాళ్లు ఏ రోజూ కష్టపడ్డానికి వెనకాడలేదు. అమ్మమ్మకు కూర్చుని తినే అవకాశం ఉన్నా, అందరితోపాటు కష్టపడేది. ప్రకృతి ఒడిలో జీవించాలన్న ఆలోచన చాలామందికి ఉంటుంది. అలాంటివారికి ఈ జీవనవిధానంలో ఉండే సంతృప్తినీ, సాధకబాధకాల్నీ యూట్యూబ్ ఛానెల్‌ద్వారా తెలియజేస్తున్నా. ఇలా ఉండాలనుకునేవాళ్లు ఒకరిపైన ఆధారపడకుండా పనులన్నీ చేయడానికి సిద్ధపడాలి. మూగజీవాలకు ఏలోటు రాకుండా చూడాలి. ఆర్థిక స్థిరత్వమూ చాలా ముఖ్యం. □

## చెలి చిట్కా

మైదా పిండి గోధుమ పిండికీ పురుగు పట్టకుండా ఉండా లంటే నాలుగు చెమ్చాల ఉప్పును శుభ్రమైన బట్టలో మూటకట్టి పిండి డబ్బాలో వేయండి. □

# తలలో పూల రబ్బరు బ్యాండు !



పూలంటే ఇష్టపడని మగువ లుంటారా చెప్పండి! కానీ, తీరిక లేకో, కార్పొరేట్ వస్త్రధారణకు నప్పకో పూలు పెట్టుకోవడం తగ్గించేశారు చాలామంది యువత. కానీ, సంప్రదాయంగా చీరకట్టో, లంగా ఓణీ ధరించాక పూలు పెట్టకుండా జుట్టుని వదిలేస్తే ఎబ్బెట్టుగా ఉండదూ! అలాంటి సందర్భాల చక్కగా జడ అల్లి ఓ చిన్న పువ్వు అయినా తలలో తురిమి.. మురిసిపోయిన అమ్మ గుర్తొచ్చేస్తుంది. అలాగని మనమే కొనుక్కుందామంటే పొద్దున్నే అంత తీరికెక్కడిది? పైగా ప్రయాణాలు, మీటింగ్‌లూ.. ఇలా మనం తిరిగే హడావుడికి ఇట్టే వాడిపోతాయి. ఇక, మీకా బెంగ అక్కర్లేదు. ఇలాంటి వారికోసమే రబ్బరు బ్యాండ్ల రూపంలో ఆర్టిఫిషియల్ పూల మాలలు వచ్చేశాయి. జడ అల్లుకున్నా, పోనీ వేసుకున్నా, కొప్పు పెట్టుకున్నా.. దీంతో బిగించేయండి రాలిపోతాయనో, వాడిపోతాయనో భయమూ అక్కర్లేదు. బాగుంది కదూ! □



# వారికి మొదలవుతుందా ?



పాపకి పదేళ్లు వచ్చాయంటే చాలు.. రజస్వల కావడానికి సిద్ధంగా ఉందని అర్థం. ఈ వయసు నుంచి ఆమెకు పోషకాలన్నీ అందుతున్నాయో లేదో సరిచూసుకోవాలి. అప్పుడే నెలసరి ఇబ్బందులు, గర్భాశయ సమస్యలు, రక్తహీనత, ఎముకలు గుల్లబారడం వంటి సమస్యల బారిన పడకుండా చూసుకోవచ్చు. ఇందుకోసం ఎలాంటి ఆహారం తీసుకోవాలంటే..

**ఇనుము :** ప్రపంచదేశాలతో పోల్చితే మనదేశంలోనే రక్తహీనతతో బాధపడుతోన్న మహిళలు, పిల్లలు ఎక్కువట. ఆడపిల్లల్లో రుతుక్రమం మొదలయ్యాక ఈ ఇబ్బంది తలెత్తకూడదంటే.. వారి ఆహారంలో తప్పనిసరిగా ఇనుము ఉండేలా చూసుకోవాలి. ఫిష్, లివర్ వంటివాటితో పాటు సజ్జలు, రాగులు, ఆకుకూరలు, సెనగలు, ఉలవలు, పల్లీలు, నువ్వులు, కాయగూరలు, పండ్ల నుంచి ఐరన్ అధికమోతాదులో లభిస్తుంది.

**కాల్షియం :** ఇనుము తరవాత ఎక్కువగా అవసరమయ్యే ఖనిజం కాల్షియం. ఇది లోపిస్తే ఎముకలు బలహీనంగా మారతాయి. మూడుపదులు దాటాక, మెనోపాజ్ దశలోనూ.. కీళ్ల సమస్యలు రావొచ్చు. పాలు, పాల సంబంధిత పదార్థాలను తీసుకోవాలి. అవి ఇష్టపడనివారు పెరుగుని ప్రత్యామ్నాయంగా తీసుకోవచ్చు. వీటితో పాటు తాజా ఆకుకూరలు, నువ్వులు, రాగులు, రాజ్మా, వేరు సెనగ పప్పు, పప్పుధాన్యాల నుంచి ఎక్కువగా లభిస్తుంది.

**మేలు చేసే కొవ్వులు :** చాలామంది కొవ్వు పదార్థాల్ని హానికారకం అనుకుంటారు. కానీ వీటిల్లో శరీరానికి మేలు చేసే కొవ్వులూ ఉంటాయి. వీటి అవసరం ఎంతో ఉంటుంది. బిఎంఐ 18 కంటే తక్కువ ఉన్న అమ్మాయిలో పీరియడ్స్ క్రమంగా రాకపోవడానికి కొవ్వుల లోపం కారణమైతే.. స్థూలకాయుల్లో కొవ్వులు ఎక్కువవ్వడం మరో కారణం. కాబట్టి వీటిని తగిన మోతాదులో తీసుకోవాలి. ఈ కొవ్వులు సరిగ్గా ఉంటేనే తీసుకునే ఇతర ఎ,డి,ఇ,కె విటమిన్లను శరీరం స్వీకరిస్తుంది. □

# మెదడుకు మేలుచేసే కొర్రలు

కొర్రబియ్యాన్ని ఫాక్స్ టెయిల్ మిల్లెట్ అంటారు. చిన్నగా నలుసంత ఉంటే వీటిని నక్కతోకతో వోల్చెడు తమాషానే కదూ! ఆడ ఉంచితే ఇది గొప్ప పోషకాహారం. ఇవి తెలుపు, పసుపు రంగుల్లో దొరుకుతాయి. వీటితో జావ, రొట్టెలు, ఇడ్లీలు, గారెలు, ఉప్మా, కిచిడీ, ప్యాక్, సలాడ్, పులావ్, దోక్లా, వెజ్జి బౌల్, లడ్డూ, ఖీర్, హల్వా, ఇలా ఎన్నో వంటకాలు చేసుకోవచ్చు. కొర్రలు ఎంత మేలు చేస్తాయంటే.. వీటిలో ప్రొటీన్లు, క్యాల్షియం, భాస్వరం, మెగ్నీషియం, ఐరన్, పీచు, విటమిన్ బి3, బి6, బి9, బి12 ఉన్నాయి. తింటే, కండరాలు, ఎముకలు పటిష్టంగా ఉంటాయి. హాయిగా నిద్రపడుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణప్రక్రియ బాగుంటుంది. ఇది ప్రో బయాటిక్గా పనిచేస్తుంది. ఊబకాయం రాదు. ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటారు. మెదడు పనితీరు మెరుగుపడుతుంది. మధుమేహం నుంచి ఉపశమనం కలుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయి క్రమబద్ధంగా ఉంటుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది. కొర్ర ఇడ్లీలు ఇలా..... కొర్రలు కప్పు, మినప్పప్పు అరకప్పు, కాస్త ఉప్పు, అర చెంచా మెంతులు తీసుకోవాలి. కొర్రలు, మినప్పప్పులను ఆరు గంటల పాటు విడివిడిగా నానబెట్టి మెంతులు, ఉప్పు జోడించి గ్రైండ్ చేయాలి. ఈ పిండిని సుమారు పది గంటలు నానబెట్టి ఇడ్లీలు వేసి రోటి పచ్చడి లేదా సాంబార్‌లో తింటే ఎంతో బలం. □



# డైపర్లు వాడుతున్నారా?

పసి పిల్లలకు డైపర్లు వేయడం ఇప్పుడు అలవాటుగా మారింది కానీ, ఈ పని దీర్ఘకాలంలో అనేక అనారోగ్యాలకు దారి తీస్తుందంటున్నారు నిపుణులు. పనిఒత్తిడి, అసౌకర్యం తగ్గించుకోవడానికి ఏర్పాటు చేసుకున్న ఈ వెసులుబాటు కాస్తా ఇప్పుడు తప్పనిసరి అలవాటుగా మార్చేశారనీ చెబుతున్నారు. పిల్లలకు నడకవచ్చిన నాటి నుంచే తమంతట తాముగా కాలకృత్యాలు తీర్చుకోవడం క్రమంగా నేర్పాలట. లేదంటే వారికి టాయిలెట్ ట్రెయినింగ్ ఇవ్వడం కష్టమవుతుంది. అలాకాకుండా తాత్కాలికంగా మీ సౌకర్యం కోసం గంటల తరబడి డైపర్లను వేసి ఉంచడం వల్ల చెమట, తడి.. వంటివి చేరి బ్యాక్టీరియా రెట్టింపు అవుతుంది. ఆ తరువాత వాటిని ఎక్కువసేపు తీయకుండా ఉంచేయడం వల్ల యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశమూ ఉంది. అందుకే, గంటా రెండు గంటలు మినహా వాటిని వేయకపోవడమే మేలని సూచిస్తున్నారు. □



# నైపుణ్యాలు పెంచుకుంటున్నారా?



నైపుణ్యం.. నిరంతర సాధన ఫలితం. అది అకస్మాత్తుగా వచ్చేది కాదు.. అన్నారు అబ్దుల్ కలాం. చేసే పనిలోనైనా, కెరీర్‌లోనైనా.. వచ్చే మార్పుల్ని గమనిస్తూ.. నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు సొంతమవుతుంది. అయితే అలాంటి సాధన చిన్న వయసు నుంచే అలవర్చుకోవాలంటున్నారునిపుణులు. ఇలా సొంతం చేసుకున్న నైపుణ్యాలే మన తరగని ఆస్తులవుతాయని, అవే ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మనల్ని ఉన్నతంగా నిలబెడతాయని చెబుతున్నారు.

**మార్పు మంచిదే!....** ప్రస్తుతం మన రోజువారీ జీవితాలే కాదు. కెరీర్ కూడా టెక్నాలజీతో ముడిపడిపోయిందని చెప్పాలి. ఇక భవిష్యత్తులో ఇది మరెంత అడ్వాన్స్‌డ్‌గా మారనుందో ఊహించగలం. ఈ క్రమంలో టెక్నాలజీలో వస్తోన్న కొత్త పోకడల్ని అవపోసన పట్టడం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. ఇందుకు మారుతోన్న సాంకేతికతకు అనుగుణంగానే కొత్త కోర్సులు నేర్చుకోవడానికి ఉత్సుకత చూపాలి. ఎలాంటి కొత్త బాధ్యతనైనా అందిపుచ్చుకునే నేర్పును అలవర్చుకోవాలి.

**కమ్యూనికేషన్ ముఖ్యం ....** చాలామందికి నలుగురిలో మాట్లాడాలంటే ఏదో తెలియని బిడియం, భయం ఉంటాయి. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదగాలనుకునే వారికి ఇవే పెద్ద అవరోధాలుగా మారుతున్నాయంటున్నారు నిపుణులు. పైగా రిమోట్ వర్కింగ్ వాతావరణంలో మీరు మీ బృందంతోనే కాదు.. ఇతర కంపెనీ బృందాలతో, విదేశీ టీమ్‌తోనూ పని/ప్రాజెక్ట్ గురించి మాట్లాడాల్సి రావచ్చు. మీ ఆలోచనల్ని వారితో పంచుకోవాల్సిన అవసరం ఏర్పడవచ్చు. ఇలాంటప్పుడు చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు.. వంటివన్నీ ముందు నుంచే అలవర్చుకోవడం మంచిది.




**విశ్లేషించగలగాలి....** చాలామందికి నలుగురిలో మాట్లాడాలంటే ఏదో తెలియని బిడియం, భయం ఉంటాయి. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదగాలనుకునే వారికి ఇవే పెద్ద అవరోధాలుగా మారుతున్నాయంటు న్నారు నిపుణులు. మీరు మీ బృందంతోనే కాదు. ఇతర బృందాలతో సైతం పని/ప్రాజెక్ట్ గురించి మాట్లాడాల్సి రావచ్చు. మీ ఆలోచనల్ని వారితో పంచుకోవాల్సిన అవసరం ఏర్పడచ్చు. ఇలాంటప్పుడు చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు.. వంటివన్నీ ముందు నుంచే అలవర్చుకోవడం మంచిది.

**పోటీని తట్టుకునేలా...** ఈ రోజుల్లో పోటీ లేని రంగం, కెరీర్ లేదంటే అతిశయోక్తి కాదు. అయితే ఇది భవిష్యత్తులో మరింత తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయని చెబుతున్నారు నిపుణులు. అలాగని భయపడిపోతే ముందుకు సాగలేం. అందుకే ఈ పోటీని తట్టుకొని నిలబడాలంటే.. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి. ఎంచుకున్న రంగంలో పోటీని అధిగమించడానికి అవసరమైన అన్ని నైపుణ్యాలను సొంతం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు మన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. ఈ లక్షణాలు ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా ముందుకు నడిపించడంతో పాటు.. విజయం సాధించేలా చేస్తాయి. □


# గౌతముడి తిరస్కరణ

ఆధ్యాత్మికం


సిద్ధార్థుడు వివిధ ప్రాంతాలు తిరుగుతూ ధర్మబోధలు చేస్తున్నాడు. ఒకరోజు ఓ పిసినారి వ్యాపారి ఇంటి ముందు నిలబడి ఆహారం అర్థించగా అతడు పరుష పదజాలంతో దూషించాడు. తథాగతుడు చిరునవ్వుతో వెళ్లిపోయాడు. అలా గౌతముడు వెళ్లి నప్పుడల్లా ఆ వ్యాపారి తిట్టి పంపాడు. బుద్ధుడి ముఖంలో ప్రసన్నత చెదరలేదు. కొన్నాళ్లకు వ్యాపారి ఇంట్లో ఆహారం మిగిలిపోయింది. అది వృథా అవుతుందని బౌద్ధ బిక్షువుల కోసం ఎదురుచూస్తున్నాడతడు. ఎప్పటిలాగానే బుద్ధుడు అతని ఇంటి ముందుకు వచ్చాడు. వ్యాపారి మిగిలిన ఆహారాన్ని తీసుకొచ్చి ఇవ్వబోయాడు. సిద్ధార్థుడు సున్నితంగా తిరస్కరించాడు. ఎందుకు తీసుకోవడంలేదు? అనడిగాడు వ్యాపార. నాకు అవసనరం లేదు. నేను తీసుకోలేదు కనుక అది నీ దగ్గరే ఉంది. అలానే ఇన్నాళ్లూ నీ తిట్లూ నిందలనూ కూడా నేను స్వీకరించలేదు కనుక అవి నీ దగ్గరే ఉన్నాయి. అంటూ బదులిచ్చాడు. ఇంతకాలం తానెంత మూర్ఖంగా ప్రవర్తించాడో, కఠిన పద జాలంతో ఎంతమందిని హింసించాడో అర్థమై చింతించాడు వ్యాపారి. ఆ తర్వాతెన్నడూ పిసినారితనం చూపలేదతడు. అడగకుండానే ధనం పంచేవాడు. □



# మనసుకెంతో ఆనందం చిట్టి గులాబీలు



చూడచక్కని రంగుల్లో, అందమైన ఆకృతిలో విచ్చుకునే గులాబీ అంటే మనసు పారేసుకోనివారు ఎవరుంటారు చెప్పండి. అందులోనూ అవి గుత్తులు గుత్తులుగా నిరబూస్తుంటే మనసుకెంతో ఆనందం. పైగా ముళ్లూ తక్కువగా ఉంటే మరింత సంతోషం. అలాంటివే ఈ బటన్రోజెస్, వీటినే మినియేచర్ గులాబీలని కూడా అంటారు. మరి వీటినెలా పెంచుకోవచ్చో చూద్దామా! చైనా, యూరోపియన్ గులాబీలను సంకరం చేయడం ద్వారా అభివృద్ధి చేసిన రకం... బటన్రోజ్. ఈ మినియేచర్ గులాబీకి 1800వ సంవత్సరంలో ప్రాణం పోశారట. తక్కువ కాలంలోనే దాన్ని అందంతో ఎక్కువ ఆదరణ పొందింది. దీన్ని ఎక్కడ పెంచినా ఆ ప్రదేశం అందాన్ని రెట్టింపు చేస్తుంది. తక్కువ ప్రదేశంలోనూ ఇవి చక్కగా ఎదుగుతాయి. అందుకే, వీటిని కంటైనర్ గార్డెన్స్, బాల్కనీలు... కాలి బాటల పక్కన ఎక్కడైనా పెంచుకోవచ్చు. దీనికి మెయింటెనెన్స్ తక్కువ. ఈ బటన్ రోజ్లు 12 అడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. హ్యాంగింగ్ పాట్స్ ఇవి చక్కని ఎంపిక బటన్‌లోజ్ ఆకులు చిన్నగా, నిగనిగలాడుతూ ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. ఎరుపు, గులాబీ, పసుపు, తెలుపు, నారింజ... వంటి రంగుల్లో ఇవి విచ్చుకుంటాయి.



**ఎలా పెంచాలంటే...** గులాబీ బటన్ మొక్కలు ఇంతటి ప్రజాదరణ పొందడానికి ప్రధాన కారణం... వాటి సులువు కావడమే. ఇవి ఆరోగ్యంగా పెరగాలంటే కనీసం 4-6 గంటలు ప్రత్యక్షంగా ప్రసరించేలా చూసుకోవాలి. ఎండ ఎక్కువగా వచ్చే బాల్కనీల్లోనూ పెంచుకోవచ్చు. సారవంతమైన పొడి నేలల్లో వీటిని నాటుకుంటే మేలు. ఆ నేల కోసం ఆ నేలలో కాసిన్ని పటిక నీళ్లు అప్పుడప్పుడూ చల్లుకుంటే సరి. మట్టిలో కాస్త పెర్లైట్ లేదా ఇసుకని, పొటాషియం ఎక్కువగా ఉంటే నెలరోజులకోసారి పూస్తాయి. పూలు పూయడం అయిపోయాక తప్పక ప్రూనింగ్ చేయాలి. వాడిపోయిన పువ్వులనూ ఎప్పటికప్పుడు తీసేయాలి. అప్పుడే పూలతో నిండుగా, ఆరోగ్యంగా ఎదుగుతాయి. □

# టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఘోర పరాభవం



## అత్యల్ప స్కోర్‌కే ఆలౌట్

### 26 రన్స్‌తో టాప్-1లో న్యూజిలాండ్

**న్యూఢిల్లీ:** గత కొన్ని సంవత్సరాలుగా టెస్ట్ క్రికెట్ నాటకీయ పతనాలకు సాక్ష్యంగా నిలిస్తోంది. టెస్ట్ క్రికెట్‌లో పాల్గొనే వివిధ జట్లు దారుణంగా అత్యంత తక్కువ స్కోర్లకే ఆల్‌ఔట్ అయి ఘోర పరాభవాన్ని ఎదుర్కొంటున్నాయి. వెస్టిండీస్ ఇటీవల టెస్ట్ క్రికెట్‌లో రెండవ అత్యల్ప జట్టు స్కోరును రికార్డు స్థాయిలో సాధించింది. దీంతో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లతో పాటు, అపఖ్యాతి పాలైన జట్టు పతనాల జాబితాలో చేరింది. టెస్ట్ క్రికెట్‌లో న్యూజిలాండ్ అత్యల్ప స్కోరు 26 పరుగులకే ఆలౌట్ అయింది. ఇది మార్చి 1955లో ఇంగ్లాండ్‌తో జరిగింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో జరిగిన మ్యాచ్‌లో కివీస్ జట్టు ఇంగ్లండ్ బౌలింగ్ చేతిలో ఘోర పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ 20పరుగుల తేడాతో గెలిచింది. ఇది టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరు చేసిన జట్లలో అగ్రస్థానానికి చేరింది. ఇక గత నెల (జూలై, 2025) 14వ తేదీన జమైకాలోని సబీనా పార్క్‌లో ఆస్ట్రేలియా చేతిలో 27 పరుగులకే ఆలౌట్ అయిన వెస్టిండీస్ అవాంఛనీయ చరిత్ర సృష్టించింది. మిచెల్ స్టార్క్ ఆరు వికెట్లు పడగొట్టి కరేబియన్ జట్టు పతనానికి దారితీసేలా చేశాడు. ఇది ఇప్పుడు టెస్ట్ క్రికెట్‌లో రెండవ అత్యల్ప స్కోరుగా రికార్డయింది. అలాగే 1896లో గ్కెబెర్హాలో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 30 రన్స్‌కే దక్షిణాఫ్రికా ఆలౌట్ అయి అవమానకరమైన పతనాన్ని చవిచూసింది. పర్యాటక జట్టు ప్రోటీస్‌ను 288 పరుగుల తేడాతో ఓడించింది. ఇక 1924లో బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో 30 పరుగుల దారుణమైన స్కోరు కారణంగా దక్షిణాఫ్రికా మరోసారి ఈ జాబితాలో చోటు సంపాదించింది. ఇంగ్లాండ్‌తో మళ్లీ తలపడిన దక్షిణాఫ్రికా జట్టు సీమ్ అనుకూల పరిస్థితుల్లో ఇబ్బంది పడి ఇన్నింగ్స్ 18 పరుగుల తేడాతో టెస్టును కోల్పోయింది. ఇది టెస్ట్ క్రికెట్‌లో నాల్గవ అత్యల్ప జట్టు స్కోరుగా నమోదైంది.

1899లో కేప్ టౌన్‌లోని న్యూలాండ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 35 పరుగులకే పరిమితమైన కారణంగా ఈ జాబితాలో మూడోసారి చోటు దక్కించుకుంది. సొంత మైదానంలో ఆధిక్యంలో ఉన్నప్పటికీ, ప్రోటీస్ జట్టు ఇంగ్లండ్ బౌలర్లను ఎదుర్కోలేక 210 పరుగుల తేడాతో పూర్తిగాఓడిపోయింది. టెస్ట్ క్రికెట్ ప్రారంభ సంవత్సరాల్లో ఇంగ్లాండ్ ఆధిపత్యం ఇదే.



## డబ్ల్యూటిసి పాయింట్స్‌లో..

# దూసుకొచ్చిన టీమిండియా

### నాలుగుకు దిగజారిన ఇంగ్లండ్

**న్యూఢిల్లీ:** భారత్, ఇంగ్లాండ్ సిరీస్ తర్వాత డబ్ల్యూటిసి పాయింట్స్ పట్టికలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌ను డ్రా చేసుకున్న టీమిండియా పాయింట్స్‌లో 46.67 విజయ శాతంతో మూడో ప్లేసుకు దూసుకొచ్చింది. ఇక ఇంగ్లాండ్ నాలుగో ప్లేసుకు పడిపోయింది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా, శ్రీలంక రెండో ప్లేసులో నిలిచింది. డబ్ల్యూటిసి తాజా సైకిల్‌లో భారత్ ఐదు టెస్ట్‌లు ఆడగా 2 విజయాలు, 2 ఓటములు, ఒక డ్రా నమోదు చేసి 28 పాయింట్లుతో మూడోస్థానంలో ఉంది. మొత్తంగా 46.67 విజయశాతంతో భారత్ మూడో స్థానంలో ఉంది. స్లో ఓవర్ రేట్ కారణంగా రెండు పాయింట్లు కోల్పోయిన ఇంగ్లాండ్ 43.33 విజయ శాతంతో నాలుగో ప్లేసుకు పడిపోయింది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా (100 విజయ శాతం), శ్రీలంక (66.67 విజయశాతం)తో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. బంగ్లాదేశ్ (16.67), వెస్టిండీస్ (0) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక డబ్ల్యూటిసి సైకిల్‌లో వెస్టిండీస్, దక్షిణాఫ్రికాలతో భారత్ టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లలో భారత్ గెలిస్తే టాప్2లోకి దూసుకొచ్చే అవకాశం ఉంది. వచ్చే ఏడాది టీమిండియా శ్రీలంక, న్యూజిలాండ్‌లో రెండు టెస్ట్ సిరీస్ ఆడనుంది. అందులోనూ గెలిస్తే డబ్ల్యూటిసి ఫైనల్ అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయి. ఈ సైకిల్ చివరి సిరీస్‌లో భారత్ సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌లు ఆడనుంది. మొత్తంగా మిగిలిన 14 మ్యాచ్‌లలో భారత్ నాలుగింటిని మాత్రమే విదేశాల్లో ఆడనుంది. దీంతో ఈసారి డబ్ల్యూటిసి ఫైనల్‌కు భారత్ చేరేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయి.



## బాస్కెట్ బాల్ ఆసియా కప్‌లో

# జోర్డాన్ గెలుపు

**న్యూఢిల్లీ:** ఫిబా ఆసియా కప్-2025లో భారత్ తొలిగ్రూప్ మ్యాచ్‌లో జోర్డాన్‌చేతిలో ఓడిపోయింది. టోర్నమెంట్‌లో తమ స్థానాన్ని సంపాదించుకున్న నెల తర్వాత, భారత పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు టోర్నమెంట్ యొక్క గ్రూప్ దశల్లో తిరిగి అడుగుపెట్టింది. రికార్డు స్థాయిలో 16 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన చైనా, ఆతిథ్య సౌదీ అరేబియా మరియు జోర్డాన్‌లతో కలిసి భారతదేశం గ్రూప్ సిలో ఉంది. మ్యాచ్‌లో భాగంగా మంగళవారం జెడ్డాలోని కింగ్ అబ్దుల్లా స్పోర్ట్స్ సిటీలో జరిగిన మ్యాచ్‌తో ప్రపంచ 35వ ర్యాంకర్ జోర్డాన్‌తో భారత్ తలపడింది. ఇందులో భాగంగా ప్రారంభ గ్రూప్ సి ఎన్‌కౌంటర్‌లో భారత పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు అదనపు సమయం తర్వాత జోర్డాన్ చేతిలో ఘోరంగా ఓడిపోయింది. 2011 ఆసియా కప్ రజత పతక విజేత డార్ టక్కర్ 30 పాయింట్లుసాధించడంతో స్కాట్‌ఫ్లెమింగ్ జట్టు జోర్డాన్‌చేతిలో 84-91 తేడాతో పరాజయంపాలైంది.

## మహిళల చెస్ ఛాంపియన్‌షిప్..

# వైశాలి ఓటమి



**న్యూఢిల్లీ:** మహిళల స్పీడ్ చెస్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ గ్రాండ్ మాస్టర్ ఆర్ వైశాలి తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో అమెరికన్ ఇంటర్నేషనల్ మాస్టర్ ఆలిస్ లీ చేతిలో ఓడిపోవడంతో భారత గ్రాండ్ మాస్టర్ వైశాలి మహిళల స్పీడ్ చెస్ ఛాంపియన్‌షిప్ 2025 నుండి నిష్క్రమించింది. వైశాలి 5+1 విభాగంలో ఆధిపత్యం చెలాయించింది. మూడు విజయాలు మరియు ఒక డ్రాతో ఆమె 3.5-0.5 ఆధిక్యంలో ఉంది. అయితే, లీ 3+1 విభాగంలో తిరిగి పుంజుకుంది. ఒక డ్రా తర్వాత, ఆమె వరుసగా నాలుగు ఆటలను గెలుచుకుంది. ఆమె చివరి విభాగంలో కూడా 3-2 స్కోరుతో విజయం సాధించి విజయాన్ని నమోదు చేసింది. కాగా అన్ని మ్యాచ్‌లు మూడు విభాగాలుగా కేటాయించారు. ప్రారంభ రౌండ్ మరియు క్వార్టర్ ఫైనల్స్‌లో, ఆటగాళ్ళు 5+1 ఆటలను (ప్రతి కదలికకు ఒక సెకను పెరుగుదలతో 5 నిమిషాల సమయ నియంత్రణ) 45 నిమిషాలు ఆడారు. తరువాత 3+1 ఆటలను 30 నిమిషాలు మరియు చివరకు, 1+1 ఆటలను 15 నిమిషాలు ఆడారు. ఇక సెమీఫైనల్స్, ఫైనల్స్‌లో మిగిలిన పోటీదారులు 75 నిమిషాలు 5+1 ఆటలను ఆ తరువాత 3+1 ఆటలను 50 నిమిషాలు చివరకు, 1+1 ఆటలను 25 నిమిషాలు ఆడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వైశాలి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది.

## గోల్ఫ్ వరల్డ్ టోర్నీలో..

# భన్సాలీ ఛాంపియన్

**న్యూఢిల్లీ:** యుఎస్ గోల్ఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్-2025లో వేదిక భన్సాలీ సంచలన విజయంతో ఛాంపియన్‌గా నిలిచింది. నార్త్ కరోలినాలోని పైన్‌హర్స్ట్ విలేజ్‌లో మంగళవారం జరిగిన ప్రతిష్టాత్మక యుఎస్ గోల్ఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన వేదిక భన్సాలీ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి బాలికల 9 ఏళ్ల వయసు గ్రూప్ టైటిల్‌ను గెలుచుకుంది. బెంగళూరుకు చెందిన ఈ యువతి తన చివరి తొమ్మిది హోల్ రౌండ్‌లో బోగీ లేకుండా 4 అండర్ 32 కార్డ్‌ను సాధించింది. 33-33-32 స్థిరమైన రౌండ్లతో, వేదిక 10అండర్ టోటల్‌ను నమోదు చేసింది. జపాన్‌కు చెందిన ఎమి మినామి కంటే ఒక షాట్ ముందు అమెరికాకు చెందిన ఆడ్రీ జాంగ్ కంటే రెండు స్ట్రోక్‌ల ఆధిక్యంలో ఉంది. భారత్‌కు చెందిన ఐదా తిమ్మయ్య బాలికల 11 విభాగంలో మూడవ స్థానంలో నిలిచింది. ఐదా ముగింపు రౌండ్‌లో 6 అండర్ 66తో షాట్ కొట్టింది, దీనితో ఆమె మూడు రౌండ్ల మొత్తం 7అండర్ (75-68-66)కి చేరుకుంది. ఈ విభాగంలో అమెరికా నుండి బెల్లా సిమోస్ 21-అండర్‌తో ముగించగా, భారత మాజీ క్రికెట్ కెప్టెన్ వెంకటరాఘవన్ మనవరాలు అనన్య వెంకటరాఘవన్ 10-అండర్‌లో రెండవ స్థానంలో నిలిచింది. గత ఏడాది పోడియం ఫినిషర్ అయిన చండీగఢ్‌కు చెందిన నిహాల్ చీమా, బాలుర 8వ విభాగంలో 38-39-35 రౌండ్లు నమోదు చేసి నాల్గవ స్థానంలో నిలిచాడు. ఇక నోయిడాకు చెందిన కబీర్ గోయల్ బాలుర 10 విభాగంలో 72-70-68 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచాడు.

# భారత్ ఆర్థికవృద్ధి 6.4 నుంచి 6.7%

### డెల్లాయిట్ ఇండియా విశ్లేషణ

**ముంబై, ఆగస్టు 5:** డెల్లాయిట్ ఇండియా కంపెనీ భారత్ ఆర్థిక వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరంలో 6.4 నుంచి 6.7శాతం మధ్యలో ఉంటుందని అంచనావేసింది. దేశీయంగా ఉన్న వనరులు కొంత మేర పటిష్టపడటంతో పాటు గ్లోబల్ అవకాశాలను మరింత విస్తరించుకోవడం వల్ల భారత్ ఆర్థికవృద్ధి మరింత పెరుగుతుందని డెల్లాయిట్ విశ్లేషించింది. భౌగోళిక అనిశ్చితులను అధిగమించే శక్తిసామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని, అలాగే వాణిజ్య విస్తరణపై భారత్ మరింత దృష్టిసారించాల్సి ఉంటుందని వెల్లడించింది. వ్యూహాత్మక వాణిజ్య సంప్రదింపులు కొంతమేలు చేస్తాయి. ప్రత్యేకించి గత నెలలో యునైటెడ్ కింగ్‌డమ్‌తో కలిసి చేసిన చర్చలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగడం అలాగే వాణిజ్య ఒప్పందాలకు సంబంధించి అమెరికాతో జరుపుతున్న సంప్రదింపులు కొలిక్కి వస్తున్నాయని, ఈ తరుణంలో భారత్‌లో వాణిజ్య పరంగా మరింత వృద్ధి నమోదవుతుందని వెల్లడించింది. ఆదాయవనరులపరంగాను, జాబ్స్,మార్కెట్‌కు చేరువ కావడం వంటి వాటితో దేశీయంగా డిమాండ్‌కూడా పెరుగుతుందని తెలిపింది. అందువల్లనే భారత్ ఆర్థిక వృద్ధి ఈ ఏడాది 6.4నుంచి 6.7శాతం వరకూ వెళ్లే అవకాశం ఉంటుందని డెల్లాయిట్ అంచనా. గత ఏడాది 6.5 శాతంగా ఉన్న వృద్ధి ఈ సారి మరింత మెరగవుతుందని తెలిపింది. దేశీయంగా ద్రవ్యోల్బణం దిగిరావడం కూడా కొంతమేలు జరుగుతోంది. దేశీయంగా కేంద్రం అమలుచేస్తున్న విధివిధానాలు, అంతర్జాతీయ వాణిజ్య బంధాలు కూడా భారత్ ఆర్థికవృద్ధికి మరింత దోహదం చేస్తాయని చెపుతున్నారు. వినియోగారుల బేస్ పెరగడం, ప్రపంచ స్థాయిలో పోటీపడే వర్క్‌ఫోర్స్ భారత్‌కు మేలైన వనరులని డెల్లాయిట్ ఆర్థికవేత్త రుంకీ మజుందార్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తన వాణిజ్యబేస్‌ను విస్తరించేందుకు భారత్ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇటీవల వాణిజ్య ఒప్పందాలు ఇందుకు దోహదం చేస్తాయి.




కృత్రిమ మేధ, డిజిటల్ పరివర్తనం, సృజనాత్మకతతో కూడి స్టార్టప్‌లు ఆవిర్భావం వంటివి భారత్ ఆర్థికవృద్ధికి దోహదం చేసానతయని డెల్లాయిట్ ఆర్థికవేత్త విశ్లేషించారు. అరుదైన ఖనిజ వనరులు, ప్రత్యేక ఎరువుల పరంగా కొంతమేర సమస్యలు ఎదురయినా భారత్ అధిగమించాల్సి ఉంటుందని తేల్చింది.అందివచ్చిన అవకాశాలతోపాటు దేశీయంగా పటిష్టంగా ఉన్న మూలవనరుల సాయంతో భారత్ ఆర్థికవృద్ధి మరింతగా పెరుగుతుందని, ఎలాంటి అనిశ్చితి పరిస్థితులనైనా అధిగమించ గలిగేస్థాయి భారత్‌కు ఉందని డెల్లాయిట్ విశ్లేషించింది.

# ఆపిల్‌కు భారత్ మంచి మార్కెట్



**వాషింగ్టన్, ఆగస్టు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చిర్రెత్తించే విషయాన్ని వెల్లడించారు యాపిల్ సీఈఓ టిమ్ కుక్. భారత్‌లో ఫోన్ల తయారీ చేపట్టడంపై ట్రంప్ తన అసహనం వ్యక్తం చేయగా, ఆయన వ్యాఖ్యలను పెడచెవిన పెట్టారు. అమెరికాలో ఈ ఏడాది రెండో త్రైమాసికంలో అమ్ముడైన ఐఫోన్లలో మెజారిటీ ఫోన్లు భారత్‌లో తయారైనవేనని చెప్పారు. మున్ముందూ ఆపిల్ తయారీ భారత్‌లో కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఆపిల్ త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్‌లో ఐఫోన్ల తయారీని చేపట్టడాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. మే నెలలో దోహా పర్యటన సందర్భంగా తన మనసులో మాటను బయట పెట్టారు. భారత్‌లో తయారీ చేపట్టడం తనకే మాత్రం ఇష్టంలేదంటూ టిమ్ కుక్ సమక్షంలోనే చెప్పారు. భారత్‌పై 25 శాతం సుంకాలను విధించారు. అయితే, అందులో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను మినహాయించారు. దీంతో ప్రస్తుతానికి ఐఫోన్లపై టారిఫ్ ఎఫెక్ట్ లేనట్లే. అయితే మున్ముందూ పరిస్థితి ఇలానే ఉంటుందని చెప్పలేమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆపిల్ రెండో త్రైమాసిక ఫలితాల సందర్భంగా టిమ్ కుక్ మాట్లాడుతూ, గత త్రైమాసికంలో కొనసాగిన వైఖరే మున్ముందూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. అమెరికాలో విక్రయమయ్యే ఫోన్లు దాదాపుగా భారత్‌లో తయారైనవే. అమెరికాలో వినియోగించే ఇతర ఆపిల్ ఉత్పత్తులైన మ్యాక్‌బుక్స్, ఐప్యాడ్స్, యాపిల్ వాచ్‌లను వియత్నాంలో తయారుచేస్తున్నాం. ఇతర దేశాలకు చైనా నుంచి ఎగుమతి చేస్తున్నాం అని టిమ్ కుక్ వివరించారు. తయారీపరంగానే కాదు.. ఆదాయం పరంగానూ ఆపిల్‌కు భారత్ కలిసొచ్చింది. ఐఫోన్ల విక్రయం ద్వారా భారత్‌లో రికార్డు రెవెన్యూ వృద్ధి నమోదైందని టిమ్‌కుక్ వెల్లడించారు. భారత్, పశ్చిమాసియా, దక్షిణాసియా, బ్రెజిల్‌లో రెండంకెల వృద్ధి నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా సగటున 10 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నారు.

# మార్కెట్లకు టారిఫ్ భయాలు..

**ముంబై, ఆగస్టు 5:** దేశీయ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాలను చవి చూశాయి. ట్రంప్ టారిఫ్ భయాలకు తోడు ఆర్‌బీఐ సమీక్షకు ముందు మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో నేటి (ఆగస్టు 5) ట్రేడింగ్‌లో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా పడిపోగా.. నిఫ్టీ 24,700 మార్క్ కోల్పోయింది. ఉదయం 80,946.43 వద్ద నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా ఒడుదొడుకుల్లోనే సాగింది. ఒక దశలో 80,554 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయిన సూచీ చివరకు 308.47 పాయింట్లు తగ్గి 80,710.25 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 24,59024,733 మధ్య కదలాడింది. మార్కెట్ ముగిసే సమయానికి 73.20 పాయింట్లు కోల్పోయి 24,649.55 వద్ద స్థిరపడింది. టారిఫ్ ఎఫెక్ట్, ముడిచమురు ధరల నేపథ్యంలో రూపాయి విలువ మరింతగా క్షీణిస్తోంది. నేటి ట్రేడింగ్‌లో 15 పైసలు పతనమై 87.81 వద్ద ముగిసింది. నిఫ్టీలో ఇన్ఫోసిస్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు భారీగా నష్టపోయాయి. రష్యా చమురును కొనుగోలు చేస్తే భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను



దెబ్బతీసింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. సోమవారం రూ.2,566.51 కోట్ల విలువైన ఈక్విటీలను ఎఫ్ఐఐలు విక్ర యించారు. ట్రంప్ టారిఫ్‌ల భయాలతో చమురు, గ్యాస్ రంగ షేర్లు కుదేలయ్యాయి. దాదాపు 1 శాతం మేర కుంగాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు బుధవారం వెలువడనున్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినప్పటికీ.. ప్రస్తుత పరిస్థితుల్లో రేట్ల కోతపై రిజర్వ్ బ్యాంక్ ఆచితూచి వ్యవహరించనుందనే సంకేతాలు కన్పిస్తున్నాయి.

# వాణిజ్యం

# ఆల్‌టైమ్ గరిష్టానికి యుపిఐ లావాదేవీలు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ నెల 2న ఒకే రోజులో ఏకంగా 70 కోట్ల లావాదేవీల మైలురాయిని తొలిసారిగా అధిగమించి ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. ఈ పరిణామం భారతదేశాన్ని రియల్ టైమ్ చెల్లింపుల రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టింది. గత కొన్ని నెలలుగా యూపీఐ వినియోగం శరవేగంగా పెరుగుతోంది. జూన్ నెలలో రోజుకు సగటున 62.8 కోట్ల లావాదేవీలు నమోదు కాగా, కేవలం కొన్ని వారాల్లోనే ఈ సంఖ్య 70 కోట్లు దాటడం విశేషం. కేవలం జులై నెలలోనే 1947 కోట్ల లావాదేవీలు జరగ్గా, వాటిమొత్తం విలువ రూ.25.1 లక్షల కోట్లుగా నమోదైంది. గతేడాదితో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 35 శాతం, విలువలో 22 శాతం వృద్ధి కనిపించింది. భవిష్యత్తులో రోజుకు 100 కోట్ల లావాదేవీలను చేరుకోవడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని యూపీఐ నిర్వాహక సంస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) పేర్కొంది. సులభమైన వినియోగ విధానం, వ్యాపారుల నుంచి లభిస్తున్న ఆదరణే ఈ వృద్ధికి కారణమని ఎన్‌పీసీఐ తెలిపింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 49.1 కోట్ల మంది వినియోగదారులు, 6.5 కోట్ల మంది వ్యాపారులు యూపీఐని వాడుతున్నారు. మొదలైన ఛార్జీల వసూళ్లు

యూపీఐ ఒకవైపు రికార్డులతో దూసుకెళుతున్నప్పటికీ, మరోవైపు దాని ఉచిత సేవల భవిష్యత్తుపై చర్చ మొదలైంది. దేశంలోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్, ఆగస్టు 1 నుంచి పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించడం ప్రారంభించింది. ఫోన్‌పే, గూగుల్




పే వంటి సంస్థలు జరిపే వ్యాపార లావాదేవీలపై ఈ ఛార్జీలు వర్తిస్తాయి. ఈ ఛార్జీల భారం ప్రస్తుతానికి వినియోగ దారులపై నేరుగా పడనప్పటికీ, ఈ పరిణామం పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ల ఆర్థిక లెక్కలను మార్చే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ బాటలోనే ఇతర బ్యాంకులు కూడా నడిచే సూచనలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# ఇడి ఎదుట హాజరైన అనిల్ అంబానీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ మంగళవారం ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట హాజరయ్యారు. రూ.17వేల కోట్ల రుణ మోసాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రశ్నించేందుకు ఇటీవల దర్యాప్తు సంస్థ ఆయనకు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో నేడు ఆయన దిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి చేరుకొని అధి కారుల ముందు హాజరయ్యారు. ఈ కేసులో అనిల్ అంబానీ వాంగ్మూలాన్ని ఈడీ నమోదు చేయనుంది. ఇటీవల రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఈడీ సోదాలు నిర్వహించిన అనంతరం.. అనిల్ అంబానీకి సమన్లు జారీ చేసింది. జులై 24 నుంచి మూడు రోజుల పాటు ఈ సోదాలు జరిగాయి. ఇందులో కీలక దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇక ఇదే కేసులో రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్‌లకు కూడా సమన్లు జారీ అయ్యాయి. అమితాబ్ ఝున్‌ఝున్‌వాలా, సతీశ్‌సేథ్ సహా గ్రూప్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు ఇడి సమన్లు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17వేల కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇడి ఈ చర్యలు చేపట్టింది. ఇందులో రిలయన్స్ హోమ్‌ఫైనాన్స్ రూ.5,901 కోట్లు, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ రూ.8,226 కోట్లు, రిల



యన్స్ కమ్యూనికేషన్స్‌కు సంబంధించి రూ.4,105 కోట్ల రుణాలున్నాయి. ఇప్పటికే అనిల్ అంబానీ దేశం విడిచి వెళ్లకుండా లుకౌట్ సర్క్యులర్ (ఎల్ఒసి)ను కూడా ఇచ్చింది.

# ఎంజి ఎస్‌యువిలపై రూ.2.30లక్షల డిస్కౌంట్!

**ముంబై, ఆగస్టు 5:** కార్ల తయారీ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ భారత్‌లో అడుగుపెట్టి ఆరేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కంపెనీ తన హెక్టార్, హెక్టార్ ప్లస్ ఎస్‌యూవీ మోడళ్లపై డిస్కౌంట్ ప్రకటించింది. ఇది పరిమిత కాల ఆఫర్‌గా కంపెనీ పేర్కొంది. వినియోగదారులు ఎంపిక చేసుకున్న మోడల్, వేరియంట్‌లను బట్టి ఆయా ఎస్‌యూవీలపై గరిష్ఠంగా రూ.2.30 లక్షల వరకు రాయితీలు ఉంటాయని తెలిపింది. 2019లో భారత మార్కెట్లోకి అడుపెట్టిన ఎంజీ హెక్టార్ దేశంలో మొట్టమొదటి ఇంటర్నెట్ కనెక్టెడ్ ఎస్‌యూవీగా పేరు పొందింది. అయితే, తాజా ఆఫర్‌లో భాగంగా హెక్టార్‌లోని అన్ని వేరియంట్ల



పైనా గణనీయమైన తగ్గింపులను ప్రకటించారు. షార్ప్ ప్రో 1.5 పెట్రోల్ ఎంఎన్‌టీ వేరియంట్‌పై అత్యధికంగా రూ.2.14 లక్షల వరకు ఆఫర్ అందిస్తున్నారు. దీంతో, ఆఫర్ సమయంలో రూ.19 లక్షలకే (ఎక్స్‌షోరూమ్ ధర) లభిస్తుంది. స్నోస్టార్మ్, బ్లాక్‌స్టార్మ్ వేరియంట్ల ధరలపైనా భారీగా డిస్కౌంట్‌లు ప్రకటించింది. అదే సమయంలో బేస్ వేరియంట్ స్టైల్ ట్రిమ్ ధర రూ.25వేలు పెంచడం గమనార్హం. హెక్టార్ ప్లస్6 సీటర్ అన్ని వేరియంట్ల ధరలనూ తగ్గించారు. షార్ప్ ప్రో 1.5 పెట్రోల్ ఎంఎన్‌టీ వేరియంట్‌పై గరిష్ఠంగా రూ.2.30 లక్షల మేర తగ్గింపు ప్రకటించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.